అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 07-02-2019 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 40 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

ఎన్‌డీయేతో కటీఫ్‌..



సరైన సమయం కోసం వేచి చూస్తున్నాం

- పౌరసత్వ బిల్లుకు పూర్తి వ్యతిరేకం : మేఘాలయ సీఎం కాన్రాడ్‌ సంగ్మా

వివరాలు 2లో

మహిళల ప్రవేశానికి ఓకే

ట్రావెన్‌కోర్‌ బోర్డు యూటర్న్‌

- సుప్రీం తీర్పును గౌరవిస్తామన్న టీడీబీ
- 'శబరిమల' రివ్యూ పిటిషన్లపై రిజర్వ్‌లో తీర్పు



వివరాలు 9లో

నింగిలోకి జీశాట్‌-31



ఇస్రో మూడో విజయం

- ఫ్రెంచ్‌ గయానా నుంచి ఏరియాన్‌-5 రాకెట్‌ద్వారా నిర్ణీత కక్ష్యలోకి
- దేశంలో మరింత బలోపేతం కానున్న సమాచార సేవలు

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఈఏడాది ముచ్చటగా మూడో విజయాన్ని సొంతం చేసుకు న్నది. జీశాట్‌-31 ఉపగ్రహాన్ని బుధవారం విజయవంతంగా నింగిలోకి ప్రవేశపెట్టడం ద్వారా ఈ ఘనతను సాధించింది. దక్షిణ అమెరికాలోని ఫ్రెంచ్‌గయానాలో గల కౌరౌ వద్ద ఉన్న ఏరియాన్‌ స్పేస్‌ లాంచ్‌ కాంప్లెక్స్‌ నుంచి భారతకాలమానం ప్రకారం ఉదయం 2.31 గంటలకు దీనిని ప్రయోగించారు. ఏరియాన్‌-5 రాకెట్‌ ద్వారా జీశాట్‌-31 ఉపగ్రహాన్ని గగనతలంలోకి పంపారు. అలాగే సౌదీకి చెందిన 1హెల్లాస్‌ శాట్‌-4 ఉపగ్రహాన్ని కూడా ఏరియాన్‌-5 మోసుకెళ్లింది. 42నిమిషాల అనంతరం జీశాట్‌-31 ఉపగ్రహం నిర్ణీత కక్ష్యలోకి చేరింది. ఈ ఉపగ్రహ ప్రయోగం విజయవంతంతో దేశంలో సమాచార సేవలు మరింత బలోపేతమవనున్నాయి. జీశాట్‌-31 ...9లో

ఎవరి దారి వారిదే

ప్రజా కూటమి మనుగడ ప్రశ్నార్థకమే

లోక్‌సభ ఎన్నికల్లో పొత్తులపై నోరుమెదపని భాగస్వామ్య పార్టీలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో ప్రజాకూటమి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎటువంటి ఉమ్మడి కార్యాచరణ కోసం కూటమి నేతలు ప్రయత్నం చేయక పోవటంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అసెంబ్లీ ఎన్నికలు జరిగి రెండు నెలలు గడచినా ప్రజాకూటమి సమావేశం ఇప్పటి వరకూ జరగక పోవటం విశేషం. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీతో కలసి పోటీ చేయటంతో భారీ మూల్యమే చెల్లించుకో వాల్సి వచ్చిందని భావిస్తున్న కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర నేతలు ఇదే విషయాన్ని మంగళవారం రాహుల్‌ గాంధీకి కూడా చెప్పారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయటమే మంచిదనే అభిప్రాయాన్ని కూడా వారు వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ...9లో



(ఫైల్‌)

వివరాలు 9లో

మీ వైఖరేంటీ..?

విద్యావాలంటీర్ల సర్వీసుల పొడిగింపుపై.. సర్కార్‌ను ప్రశ్నించిన హైకోర్టు



హైదరాబాద్‌ : వివిధ విద్యా సంస్థల్లో పనిచేసే విద్యా వాలంటరీల సర్వీసుల్ని పొడిగింపు అంశంపై ప్రభుత్వం తన వైఖరిని ఎందుకు తెలియజేయలేదని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. పాతవారిని కొనసాగించేందుకు ఇబ్బందులు ఏమున్నాయో తెలియజేయాలని ఆదేశించింది. ఆదిలాబాద్‌ జిల్లా నుంచి బి.శైలజ మరో 42 మంది విద్యా వాలంటరీలు, వరంగల్‌ జిల్లా నుంచి వి.కరుణ మరో ఆరుగురు దాఖలు చేసిన వ్యాజ్యాలను బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ అభినంద్‌కుమార్‌ షావిలి విచారించారు. ప్రభుత్వం రెగ్యులర్‌ టీచర్‌ పోస్టులు భర్తీ చేసే వరకూ విద్యా వాలంటరీలను కొనసాగించాలన్న పిటిషనర్ల అభ్యర్థనపై ప్రభుత్వ వైఖరిని తెలపాలని న్యాయమూర్తి కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల మంది విద్యా వాలంటరీలు ఉన్నారని, వీరిని కొనసాగించేందుకు ఉత్తర్వులు ఇవ్వకుండా కొత్త వారిని నియమించే ప్రయత్నాలను అడ్డుకోవాలని, ఉపాధ్యాయుల భర్తీ జరిగే వరకూ పాత వారినే కొనసాగించాలని ...9లో

ప్రేమించలేదని..

విద్యార్థినిపై కత్తితో దాడి

- తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- పోలీసుల అదుపులో నిందితుడు



నవతెలంగాణ- అంబర్‌పేట

ప్రేమను నిరాకరించిందని విచక్షణ కోల్పోయి ఉన్మాదిగా మారిన యువకుడు ఇంటర్‌ విద్యార్థినిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. కాలేజీకి పోతుండగా కాపుకాసి వాగ్వివాదానికి దిగిన దుర్మార్గుడు.. వెంట తెచ్చుకున్న కొబ్బరిబోండాల కత్తితో నరికేశాడు. తీవ్రగాయాలైన విద్యార్థిని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమంగా ఉన్నట్టు డాక్టర్లు చెప్పారు. నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని కాచిగూడ పోలీసుస్టేషన్‌ పరిధిలోని బర్కత్‌పురలో బుధవారం ఉదయం జరిగింది. పోలీసులు, బాలిక కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పుర సత్యానగర్‌ ప్రాంతానికి చెందిన మంగ రాములు- ఉదయల ...9లో

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

లేదంటే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు

- రోడ్లపై చెత్తవేస్తే రూ.500 జరిమానా

కరెంటు బిల్లులు బకాయి పడితే సస్పెండే : సీఎం కేసీఆర్‌

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్‌

పంచాయతీల్లో నూటికి నూరుశాతం కచ్చితంగా పన్నులను వసూలు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ అన్నారు. అలా వసూలు చేయని పంచాయతీ ...9లో





ప్రియాంక ఎంట్రీ

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు

వివరాలు 9లో

ఎస్మానూ లెక్కచేయని ఉద్యోగులు

యూపీలో సమ్మెలోకి 20లక్షల మంది

- మద్దతు పలికిన సీఐటీయూ

వివరాలు 2లో



సర్పంచ్‌ అభ్యర్థికి మద్దతు ఇవ్వలేదని..

ఆరు కుటుంబాల 'కుల' బహిష్కరణ

- అధికారులకు బాధితుల ఫిర్యాదు



వివరాలు 9లో

వర్ధమాన నటి ఆత్మహత్య

ప్రేమించి మోసపోవడమే కారణమా..?

వివరాలు 3లో



పెండ్లికి వెళ్ళి వస్తుండగా...

ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు దుర్మరణం
- మృతులంతా ఒకే కుటుంబం
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ధర్నా



వివరాలు 9లో

మోడీ వర్సెస్‌ మోడీ





- ప్రధానికి బద్ధశత్రువు.. ముఖ్యమంత్రియే ...
- అప్పుడలా ఇప్పుడిలా

న్యూఢిల్లీ : పశ్చిమబెంగాల్‌లో 'రాజకీయ తిరుగుబాటు' కోసం సీబీఐని అస్త్రంగా వాడుకుంటుం దని ప్రధాని నరేంద్రమోడీని, బీజేపీని నిందిస్తూ మమతా బెనర్జీ చేస్తున్న ఆరోపణలపై మోడీ మౌనంగావున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) స్వయంప్రతిపత్తిని పశ్చిమబెంగాల్‌ సీఎం ...9లో

గతాన్ని గుర్తుచేసుకుంటూ కూర్చుంటే.. అది బాధనే మిగిలిస్తుంది - ఇది ఒక సామెత. అయితే.. ప్రధానమంత్రి నరేంద్రమోడీ విషయంలో అచ్చుగుద్దినట్టు సరిపోతున్నది. బేతాళుడి కథలో మాదిరిగా.. ఇపుడు ఆయన ట్విట్టర్‌ గతమే వెంటపడి వేధిస్తున్నది. దీన్ని వివరంగా చెప్పాలంటే.. ట్విట్టర్‌లో ప్రస్తుత పీఎం నరేంద్రమోడీని.. అప్పటి గుజరాత్‌ సీఎం నరేంద్రమోడీ ట్రోల్‌ చేస్తున్నారు. ఇంతకీ మోడీ వర్సెస్‌ మోడీ కథేంటో పరిశీలిద్దాం..

న్యాయవ్యవస్థపై కత్తి ఎత్తారు..

కొందరు న్యాయవాదుల తీరు ఆందోళన కలిగిస్తోంది : సుప్రీంకోర్టు

- **న్యాయవిచారణ మధ్యలో ఉండగానే వ్యాఖ్యానాలు**

న్యూఢిల్లీ : కొందరు న్యాయవాదులు మొత్తం న్యాయ వ్యవస్థకు వ్యతిరేకంగా కత్తిపట్టినట్టు తెలుస్తోందని సుప్రీం కోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌పై కోర్టు ధిక్కార పిటీషన్‌ను విచారణకు స్వీకరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్, కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం న్యాయ వ్యవస్థను హత్య చేయడానికి బార్ రంగంలోకి దిగిందని వ్యాఖ్యానించింది. కొందరు న్యాయవాదులు తమ కేసులు విచారణలో ఉన్నప్పటికీ, న్యాయ వ్యవస్థపైనా, న్యాయమూర్తులపైనా చేస్తున్న విమ ర్శల దాడిపై ఘాటుగా స్పందించింది. "స్వేచ్ఛతోపాటు బాధ్యత ఉంటుంది. న్యాయవ్యవస్థను హత్య చేయడానికి బార్‌రంగంలోకి దిగితే పర్యవసానం ఏమిటి? ఇప్పటి పరి స్థితి అలాగే కనిపిస్తోంది. న్యాయవ్యవస్థను బయటి నుంచి కాపాడాల్సి ఉంది. కానీ భాగస్వాముల నుంచి కాదు. న్యాయ వ్యవస్థను హత్య చేయడానికి కొందరు న్యాయ వాదులు తమతోపాటు కత్తిని తీసుకొస్తున్నట్టు కనిపి స్తోంది"అని ధర్మాసనం పేర్కొంది. "బార్ ఇలా ప్రవరిస్తూ ఉంటే మన స్వాతంత్ర్యాన్ని కాపేడేది ఎవరు? పిటిషన్లలో అన్ని రకాల ఆరోపణలు చేస్తున్నారు. మేం వాటిని పరిశీలించడానికి ముందు వాటిని ఉపసంహరించుకుంటున్నారు. ఈ రోజుల్లో జరుగుతున్నదాని గురించి మేం నిజంగా ఆందోళన చెందుతున్నా"మని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ నవీన్ సిన్హా వ్యాఖ్యానించారు. కోర్టు ధిక్కార కేసులో సమాధానం ఇవ్వడానికి ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌కు మూడు వారాలు గడువు ఇచ్చింది. ఈకేసులో కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, ప్రశాంత్ భూషణ్‌పై కఠిన చర్య తీసుకోవాలని కోరారు.

అయోధ్యఅంశంపై వీహెచ్‌పీ వెనుకడుగు

న్యూఢిల్లీ. అయోధ్యలో రామమందిర నిర్మాణంపై వీహెచ్‌పీ వెనుకడుగువేసింది. ఎన్నికలయ్యేదాకా రామమందిరం జోలికివెళ్లకూడదని నిర్ణయించింది. ఇప్పటిదాకా చేపట్టిన నిరసనలకు నాలుగునెలలపాటు తాత్కాలికవిరామం ఇచ్చింది. ఈ విషయాన్ని వీహెచ్‌పీ నేత సురేంద్రజైన్ తెలిపారు. కేంద్రంలో కొత్త సర్కార్ ఏర్పడ్డాక భవిష్యత్ కార్యక్రమం చేపడతామన్నారు.

24 మంది వెట్టి కార్మికులకు విముక్తి

బెంగళూరు: ఆ 24 మంది తమిళనాడులోని కృష్ణగిరికి చెందినవారు. అధిక కూలీ ఆశజూపి.. ఇద్దరు మానవ అక్రమ రవాణాదారులు వారిని కర్నాటకలోని హస్సన్ జిల్లాకు తీసుకొచ్చారు. అనంతరం సక్లేశ్‌పూర్ గ్రామంలోని ఇటుక బట్టీల్లో పనిలో చేర్చారు. ఇందులో పది మంది చిన్నారులూ, నలుగురు టీనేజర్లూ ఉన్నారు.

ఏడాది పసికందుపై పాశవికంగా...

న్యూఢిల్లీ: ఏడాది పసికందుపై సమీప బంధువే ఉన్మాదాన్ని ప్రదర్శించాడు ఓ కామాందుడు. చిన్నారిని తాళ్లతో కట్టేసి ఆమెపై అతి దారుణంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం బయటపడటంతో ఆగ్రహించిన స్థానికులు నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం....చిన్నారి వాళ్ల అంకుల్ పనిచేస్తున్న ఫ్యాక్టరీలో నిందితుడు దర్మేంధర్ కూడా పనిచేస్తున్నాడు. సోమవారం వారి ఇంటికి వచ్చి చాక్లెట్లు కొనిస్తానని ఆశచూపి నిందితుడు పాపను తీసుకు వెళ్లాడు. అనతరం నిందితుడు తన ఇంట్లో ఆమెను బందించాడు. అతి కిరాతకంగా ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. కాగా ఇంటి నుంచి వెళ్లిన చిన్నారి చాలా సమయం నుంచి కనపడకపోవడంతో తల్లిదండ్రులు ఆమె ఆచూకి కోసం వెతికారు. కాగా పొరుగు వారు ఇచ్చిన సమాచారంతో నిందితుని ఇంటికి చేరకున్నారు. అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించిన నిందితున్ని స్థానికులు పట్టుకున్నారు. నిందితునికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌డీయేతో కటీఫ్



సమయం కోసం వేచి చూస్తున్నాం: మేఘాలయ సీఎం

- పౌరసత్వ బిల్లుకు పూర్తి వ్యతిరేకమని వెల్లడి

షిల్లాంగ్ : బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీయే కూటమితో తెగదెంపులు చేసుకునేందుకు సరైన సమయం కోసం ఎదురు చూస్తున్నామని నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) అధ్యక్షుడు, మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా తేల్చి చెప్పారు. మోడీ సర్కారు మోసపూరితంగా తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ బిల్లుకు తాము పూర్తిగా వ్యతిరేకమని ఈ సందర్భంగా తెలిపారు. బుధవారం ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. ఈ బిల్లు పాస్ కాకుండా అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఢిల్లీలో పలు రాజకీయ పార్టీల నాయకులను కలిశామని, ఒకవేళ బిల్లు రాజ్యసభ ముందుకు వస్తే వ్యతిరేకంగా ఓటు వేయాలని వారిని కోరినట్టు చెప్పారు. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), బహుజన్ సమాజ్‌పార్టీ(బీఎస్పీ) నేతలతోనూ తాము టచ్‌లో ఉన్నట్టు తెలిపారు. అయితే.. బిల్లు విషయమై చర్చించేందుకు ఎన్‌పీపీ, ఇతర ఈశాన్య ప్రాంతీయ పార్టీలకు మోడీ అవకాశమిస్తే అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. మోడీ అపాయింట్‌మెంట్ కోసం చాలాసార్లు మొరపెట్టుకున్నా.. ప్రధానమంత్రి కార్యాలయం స్పందించడం లేదని ఆయన చెప్పారు. అయితే.. త్వరలో అపాయింట్‌మెంట్ దొరుకుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పౌరసత్వ సవరణ బిల్లును ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలే కాక.. అక్కడి ప్రజా సంఘాలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఒకవేళ ఇది అమల్లోకొస్తే స్థానిక ప్రజలపై బయటివారు పెత్తనం చెలాయించే ప్రమాదముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పౌరసత్వ చట్టం-1955కు సవరణలు చేస్తూ కేంద్రం ఈ సవరణ బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి 2014 డిసెంబర్ 31 కంటే ముందు దేశానికి వచ్చిన 6 మైనార్టీ తెగలకు భారత పౌరసత్వం ఇచ్చేలా చట్టానికి సవరణలు రూపొందించారు.

ఈ జాబితాలో హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ, క్రిస్టియన్ మతాలున్నాయి. కానీ, బిల్లులో ముస్లిం శరణార్థుల ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

నిరసనకారులపై రాజద్రోహం కేసు



అగర్తల: ఈశాన్యభారత్‌లో పౌరసత్వ సవరణ బిల్లు ప్రకంపనలు ఆగడంలేదు. బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన నిరసనకారులపై బీజేపీ పాలితరాష్ట్రం త్రిపురలో పోలీసులు రాజద్రోహం కేసు నమోదు చేశారు. పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా.. ఏడుగిరిజన సంఘాలతో ఏర్పడిన రాజకీయ వేదిక ఎంఎపీసీఏబీ గతనెల 30న రాజధాని అగర్తలలోని ఖుమ్లువుంగ్‌లో ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీకి ఐఎన్‌పీటీ ప్రధాన కార్యదర్శి జగదీశ్ డెబ్బార్మ, ఎంఏసీఏబీ కన్వీనర్ ఆంథోనీ డెబ్బార్మ, ఐపీఎఫ్‌టీ(తిప్రాహ) చీఫ్ అఘోరే డెబ్బార్మతో పాటు త్రిపుర స్టూడెంట్ ఫెడరేషన్, నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ త్రిపుర, త్రిపుర పీపుల్స్ ఫ్రంట్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగానికి చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు. అయితే దాదాపు 40 మంది దాకా ఈ ర్యాలీలో భారత్‌కు వ్యతిరేకంగా, చైనాకు అనుకూలంగా నినాదాలు చేశారని ఇందుకు సంబంధించిన వీడియో ఫుటేజీ, ఇతర ఆధారాలను సేకరించే పనిలో ఉన్నామని పశ్చిమ త్రిపుర జిల్లా పోలీసు అధికారి ప్రాన్ కృష్ణదాస్ తెలిపారు.

అయితే తాము నిర్వహించిన ర్యాలీ మాత్రం శాంతియుతంగా జరిగిందని, స్థానిక ప్రజల గొంతునొక్కేందుకు పోలీసులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని ఎంఏసీఏబీ కన్వీనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గాంధీజీ 'బొమ్మ'ను కాల్చిన కేసులో పూజా పాండే, ఆమె భర్త అశోక్ అరెస్టు

లక్నో : మహాత్మాగాంధీ బొమ్మపై కాల్పులు జరిపిన కేసులో అఖిల భారత హిందూ మహాసభ జాతీయ కార్యదర్శి పూజా పాండే, ఆమె భర్త అశోక్ పాండేలను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గాంధీ వర్ధంతి రోజున ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో హిందూ మహాసభ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీని పోలినట్టు ఏర్పాటు చేసిన బొమ్మను పూజా పాండే పిస్తోల్‌తో కాల్చి పైశాచిక ఆనందం పొందారు. అంతేకాక అక్కడున్న కార్యకర్తలందరికీ స్వీట్లు పంచారు. ఈ ఘటనంతా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి ఇదివరకే ముగ్గురిని అరెస్టు చేశారు. యూపీలోని తప్పాల్‌లో పూజా పాండే, అశోక్ పాండేలను పోలీసులు బుధవారం అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచారు. కాగా.. కోర్టు బయట పూజా పాండే మీడియాతో మాట్లాడుతూ.. గాంధీజీ బొమ్మను కాల్చడంపై తాను పశ్చాత్తాపం చెందడం లేదని, ఇందులో తప్పేమీ లేదని చెప్పడం గమనార్హం.

మృతదేహాలను ఆధార్‌తో గుర్తించలేం

- **ఢిల్లీ హైకోర్టులో ఉడాయ్**

న్యూఢిల్లీ : మృతదేహాలను గుర్తించడంలాంటి ఫోరెన్సిక్ అవసరాలకు ఆధార్ బయోమెట్రిక్‌ను వినియోగించలేమని ఆధార్ విశిష్ట ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. చట్టపరంగా, సాంకేతికంగా ఇది సాధ్యం కాదని వివరించింది. సుప్రీంకోర్టు గతేడాది వెలువరించిన ఆధార్ తీర్పులో బయో మెట్రిక్‌ను చట్టంలో పేర్కొన్న అవసరా లకు మాత్రమే వినియోగించాలని ఆదేశించినట్టు చీఫ్ జస్టిస్ రాజేంద్ర మీనన్, జస్టిస్ వి కామేశ్వర్‌రావుల ధర్మాసనానికి యూఐడీఏఐ తెలిపింది. మృతదేహాలను గుర్తించేందుకు ఆధార్ వినియోగంపై మార్గదర్శకాలను కోరుతూ అడ్వకేట్ అమిత్ సాహ్ని దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణలో భాగంగా యూఐడీఏఐ ఈ మేరకు వివరించింది. ఫోరెన్సిక్ అవసరాలకు వినియోగించే విధంగా ఆధార్ బయోమెట్రిక్ సమాచారాన్ని సేకరించలేదని, అందుకే మృతదేహాలను గుర్తించలేమని అఫిడవిట్‌లో పేర్కొంది.

మమల్ని పట్టించుకోరెందుకు ?

సీఎం మమతపై చిట్‌ఫండ్ బాధితుల ఆగ్రహం

- **న్యాయ పోరాటం కోసం సంక్షేమ సంఘం**



కోల్‌కతా : దుర్గా పూజలు, ఇతర అనేక కార్యక్రమాల కోసం పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తున్నారని, కానీ, తమ గోడును మాత్రం పట్టించుకునే స్థితిలో లేరని చిట్‌ఫండ్ స్కాంల బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శారదా చిట్‌ఫండ్ మోసాలతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇప్పటికే 300 మందికి పైగా బాధితులు ఆత్మహత్య చేసుకున్నారని వారు తెలిపారు. మరిన్ని ప్రాణాలు పోకుండా ఉండాలంటే చిట్‌ఫండ్ కంపెనీల ఆస్తులను జప్తు చేసి, వాటిని వేలం వేయడం ద్వారా వచ్చిన డబ్బును బాధితులకు తిరిగిచ్చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి న్యాయ పోరాటం చేసేందుకు బాధితులు ఒక సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పలు చిట్‌ఫండ్ కంపెనీల తరఫున ఏజెంట్లు.. ప్రజల వద్ద నుంచి లక్షలాది, కోట్లాది రూపాయలను వసూలు చేశారని ఓ బాధితుడు తెలిపాడు. ఇప్పుడు ఏజెంట్లకూ నిలువ నీడ లేకపోయిందని, వారు ప్రాణ భయంతో బతుకుతున్నారని చెప్పాడు. చిట్‌ఫండ్ కేసుల్లో దర్యాప్తు నిమిత్తం కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్‌కుమార్ నివాసానికి ఆదివారం వచ్చిన సీబీఐ అధికారులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కేంద్రప్రభుత్వ తీరును సీఎం మమతా బెనర్జీ ధర్నాకు దిగారు. కాగా.. రాజీవ్‌కుమార్‌ను అరెస్టు చేయొద్దని, కానీ, సీబీఐ విచారణకు ఆయన సహకరించాల్సిందేనని సుప్రీంకోర్టు మంగళవారం తేల్చి చెప్పింది.

ఎస్మానూ లెక్కచేయని ఉద్యోగులు

- **సమ్మెలో 20లక్షల మంది**
- **మద్దతు పలికిన సీఐటీయూ**

లక్నో: యూపీలో నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా బుధవారం నుంచి సమ్మెకు దిగుతామని ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీనితో అత్యవసరసేవల నిర్వహణా చట్టం(ఎస్మా)ను ప్రయోగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. కాగా ప్రభుత్వ ఉత్తర్వులను సైతం లెక్క చేయకుండా తమ డిమాండ్ల సాధనకు ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. సుమారు 20లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ఈ సమ్మెలో వైద్య, విద్యుత్ సంస్థల ఉద్యోగులు పాల్గొన లేదని తెలిపారు. ఈనెల 12లోగా తమ డిమాండ్లను తీర్చకపోతే మిగితా సంస్థల ఉద్యోగులు కూడా పాల్గొంటారని వెల్లడించారు. రానున్న రోజుల్లో తమ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి ప్రేమ్‌నాథ్ మాట్లాడుతూ...ప్రభుత్వం చేపడుతున్న చర్య పూర్తిగా కార్మికుల సమ్మె హక్కును కాలరాసేవిధంగా ఉన్నదని విమర్శించారు. కార్మికుల సమ్మెకు మద్దతు పలుకుతున్నామని వెల్లడించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలను ఆయన ఖండించారు.

ట్రంప్- కిమ్ రెండోదఫా భేటీ

ఈనెల27, 28 తేదీల్లో వియత్నాంలో



వాషింగ్టన్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్- జోంగ్- ఉన్‌తో ఈ నెల27న భేటీ కానున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారికంగా ప్రకటించారు. వియత్నాం నగరాన్ని చర్చలకు వేదికగా ఎంచుకున్నామని అన్నారు. రెండు రోజుల పాటు తమ భేటీ కొనసాగుతుందన్నారు. ఉత్తరకొరియా అణ్వాయుధాలను త్యజించేలా తన కృషి కొనసాగుతుందన్నారు. గతంలో సింగపూర్‌లో జరిగిన భేటీ సత్ఫలితాన్ని ఇచ్చిందన్నారు. కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పేందుకు తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని అన్నారు. యుఎస్ కాంగ్రెస్‌లో 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' సదస్సులో ప్రసంగించిన అనంతరం మీడియాతో ట్రంప్ మాట్లాడారు. తాను అధికారం చేపట్టాక అమెరికా ఆర్థిక వ్యవస్థ గాడిలో పడిందని అన్నారు. నిరుద్యోగం ఐదు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత తక్కువగా ఉందని చెప్పారు. తమ దేశ ఉద్యోగుల్లో మహిళల శాతం అధికంగా ఉందన్నారు. మహిళలకు పురుషులతో పాటు సమాన అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు.

యూఎస్ కాంగ్రెస్‌లో కూడా వారి సంఖ్య అధికంగా ఉందని చెప్పారు. అమెరికా శత్రువులను ఓడించాలంటే రాజకీయ ఐక్యత ముఖ్యమని హితవు పలికారు. అత్యున్నతమైన ఎంపిక ఉండాలని ఆయన సూచించారు. కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజకీయ వైషమ్యాలను వీడనాడి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. కోట్ల మంది ప్రజలు మనల్ని గమనిస్తున్నారంటూ ఆయన డెమోక్రాట్లకు గుర్తు చేశారు. అఫ్ఘనిస్తాన్‌లో అన్ని వర్గాలతో నిర్మాణాత్మక చర్చలు కొనసాగిస్తామని అన్నారు. ఈ వర్గాల్లో తాలిబన్లు కూడా ఉంటారన్నారు. ఈ నిర్ణయం వల్ల దళాల ఉపసంహరణ సులభమై ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టిపెట్టే అవకాశం లభిస్తుందన్నారు. ఇరాన్ అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించిందని ట్రంప్ ఆరోపించారు. అందుకే, ఆ దేశంతో గతంలో కుదుర్చుకున్న అణు ఒప్పందాన్ని రద్దు చేసుకున్నామని అన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకే ఆంక్షలు కఠినతరం చేశామని అన్నారు.

బొలీవియాలో విరిగిపడ్డ కొండచరియలు

- **14 మంది మృతి**

లాపెజ్ : బొలీ వియాలో కొండచరియలు విరిగిపడటంతో 14 మంది మృతి చెందారు. 34 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తర లించి చికిత్స అంది స్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ఏడుగురు పౌరులు గల్లంతయ్యారు. ఆచూకీ లభ్యంకాని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు ప్రత్యేక బృందాలు తెలిపాయి. జిల్లా ఎస్పీ రోములో డెల్గేడో తెలిపిన వివరాల ప్రకారం...బొలీవియాలో కొద్ది రోజులుగా ఎడతెరపి లేకుండా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. వరద ఉధృతి కారణంగా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బొలీవియా రాజధాని లాపెజ్, కరానావి నగరాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 14 మంది మృతి చెందారు. మరో 34 మంది స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలకు అధ్యక్షుడు ఈవో మోరెల్స్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. హెలికాప్టర్ల సాయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. బొలీవియాలో నవంబర్ నుంచి మార్చి నెల వరకు వర్షాకాలం. జనవరి, ఫిబ్రవరి నెలల్లో భారీ వర్షాలు కురుస్తుంటాయి.

సెక్స్ బానిసలుగా చర్చిల్లో మహిళలు

పోప్ ఫ్రాన్సిస్



వాటికన్ సిటీ : చర్చి మతాధికారులు నన్లను (క్రైస్తవ సన్యాసినులను) సెక్స్ బానిసలుగా మార్చుకున్నారని పోప్ ఫ్రాన్సిస్ తెలిపారు. పలు చర్చిల్లో నన్స్ లైంగిక వేధింపులకు గురవుతున్నారనే విషయం తెలిసి తీవ్ర మనోవేధనకు గురయ్యానని చెప్పారు.

చర్చి మతాధికారులు నన్లను సెక్స్ బానిసలుగా మార్చుకోవడంతోనే తనకు ముందు పోప్‌గా ఉన్న పోప్ బెనెడిక్ట్ మతాధికారుల వల్ల వేధింపులకు బలైన నన్ల సమాజాన్ని రద్దు చేయాల్సి వచ్చిందని అన్నారు. మతాధికారులు నన్లపై చేస్తున్న లైంగిక వేధింపుల గురించి పోప్ ఫ్రాన్సిస్ తెలియ జేయడం ఇదే మొదటిసారి. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. చర్చిల్లో మతాధికారులు పిల్లలు, యువకులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు చాలాకాలం నుంచీ ఆరోపణలు వస్తున్న సమయంలో పోప్ నన్ల వేధిం పులపై ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. చారి త్రక పర్యటన కోసం మధ్యప్రాచ్యం వెళ్లిన పోప్ ఒక మీడియా సమావేశంలో 'చర్చికి ఒక సమస్య ఉంది. దాని మూలం మహిళలను రెండో తరగతిగా చూడడంలోనే ఉంది' అని అంగీకరించారు. నన్లను వేధింపులకు గురిచేసిన మతాధి.కారులను సస్పెండ్ చేశామని అన్నారు. 2005లో రద్దయిన మహిళా సమాజం పోప్ బెనెడిక్ట్ కింద పనిచేసిన కమ్యూనిటీ ఆఫ్ సెయింట్ జీన్. ఇది ఫ్రాన్స్‌కు చెందినది. ఫ్రెంచ్ రోమన్ క్యాథలిక్ వార్తాపత్రిక లా క్రోయిక్స్ కథనం ప్రకారం... మతాధి.కారులు పలువురు మహిళలతో అస భ్యంగా ప్రవర్తించినట్టు కమ్యూనిటీ ఆఫ్ సెయింట్ జీన్ 2013లో అంగీ కరించింది. భారత్‌లో బయటపడ్డ మరో కేసులో 2014-2016 మధ్య ఒక నన్‌పై 13 సార్లు అత్యాచారం చేశారనే ఆరోపణలతో గత ఏడాది ఒక బిషప్‌ను అరెస్ట్ చేశారు. జలంధర్ మతాధికారిగా పనిచేసిన బిషప్ ఫ్రాంకో ముల్కల్ తనపై ఆరో పణలను ఖండించారు. చిలీలో కూడా మతాధి.కారులు నన్లను వేధించినట్టు వార్తలు రావడంతో గత ఏడాది వాటికన్ ఒక దర్యాప్తు ప్రారంభిం చింది. ఈ వేధింపులు బయటప డడంతో మహి ళలను ఆర్డర్ నుంచి తొలగించినట్టు వార్తలు వస్తున్నాయి. గత ఏడాది ఇటలీ, ఆఫ్రికాలో కూడా వేధింపుల కేసులు వెలుగుచూసినట్టు అసోసి యేటెడ్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ గత ఏడాది తెలిపింది.

సరిహద్దులో గోడ నిర్మిస్తాం : ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా-మెక్సికో సరిహద్దులో గోడ నిర్మించి తీరుతామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. అమెరికాకు చట్టబద్ధంగా వచ్చినవారికి తప్పకుండా ఆశ్రయం కల్పిస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. తమ దేశం ప్రతిభావంతులకు స్వర్గధామం అని అన్నారు. యూఎస్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వలసదారుల అంశాన్ని ప్రస్తావించారు. తమ దేశానికి వచ్చేవారు న్యాయపరంగా రావాలని ట్రంప్ కోరారు. అక్రమ వలసదారుల కారణంగా దేశంలో అభద్రతా భావం పెరిగిపోతుందని అన్నారు.

'అమెరికన్ల ఉద్యోగాలకు, వారి భవిష్యత్‌కు రక్షణ కల్పిస్తూ బలమైన వలస వ్యవస్థను రూపొందించడం మా నైతిక బాధ్యత. న్యాయపరంగా వచ్చే వలసదారులు మా దేశానికి ఎంతగానో ఉపయోగపడుతున్నారు. విదేశీయులు ఇంకా ఎక్కువ మంది మా దేశానికి రావాలని కోరుకుంటున్నాను. కానీ వారు న్యాయపరంగా రావాలి' అని ట్రంప్ అన్నారు. మెక్సికో నుంచి వస్తున్న అక్రమవలసదారులను, మాదక ద్రవ్యాల ముఠాలను అడ్డుకోవాలంటే సరిహద్దు గోడ నిర్మాణం తప్పనిసరి అని ట్రంప్ పునరుద్ఘాటించారు. అమెరికా భద్రతకు అత్యంత కీలకంగా నిలిచే సరిహద్దు గోడ నిర్మాణాన్ని డెమోక్రాట్లు అడ్డుకోవడం సరికాదన్నారు. గతంలో అమెరికా-మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి మద్దతు తెలిపినవారంతా ప్రస్తుతం వ్యతిరేకిస్తుండటం శోచనీయమని అన్నారు. ఈ నెల 15 లోగా సరిహద్దు గోడ నిర్మాణం గురించి ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలంటూ గడువు విధించారు. 2016లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందని వస్తున్న విమర్శలపై ట్రంప్ ఘాటుగా స్పందించారు. అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిపాలు కావడంతోనే డెమోక్రాటిక్ పార్టీ సభ్యులు తమపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు.

రిపబ్లికన్‌పార్టీ తరుపున పోటీ చేసిన తనపై నమ్మకంతోనే ప్రజలు ఎన్నికల్లో గెలిపించారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకుంటానని అన్నారు.

బీజేపీ, తృణమూల్ దొందూదొందే

17,500 కోట్ల కుంభకోణంలో టీఎంసీ నేతల హస్తం

- రాజకీయ ప్రత్యర్థులపై మోడీ సర్కారు దాడి: సురవరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు దొందూదొందేనని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని



మాట్లాడుతున్న సురవరం

మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం, తృణమూల్ ప్రభుత్వం కలిసి ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని అన్నారు. బెంగాల్‌లో రాజ్యాంగ సంక్షోభానికి దారితీసే అవకాశముందన్నారు. శారదా చిట్‌ఫండ్ కుంభకోణం రూ.2,500 కోట్లు, రోజ్‌వ్యాలీ కుంభకోణం రూ.15 వేల కోట్లు కలిసి మొత్తం రూ.17,500 కోట్ల కుంభకోణం జరిగిందని అన్నారు. రూ.17,500 కోట్ల కుంభకోణాల్లో టీఎంసీ నేతల హస్తముందన్నారు. ప్రధాన నిందితుడిగా ఉన్న తృణమూల్ నేత ముకుల్‌రాయ్ బీజేపీలో చేరారని అన్నారు. ఆయనను కాపాడేందుకు కేంద్రం సీబీఐని రంగంలోకి దింపిందని చెప్పారు. ఇంకోవైపు రాజకీయ ప్రత్యర్థులపైనే మోడీ సర్కారు దాడులు చేస్తోందన్నారు.

రాజీవ్‌కుమార్‌కు సీబీఐ 15 నోటీసులిచ్చిందని అన్నారు. చివరి నోటీసు తొమ్మిది నెలల కింద ఇచ్చిందని చెప్పారు. ఇంతకాలం సీబీఐ ఏం చేసిందని ప్రశ్నించారు. ఈనెల 3న వామపక్షాల ఆధ్వర్యంలో కోల్‌కతాలోని బ్రిగేడ్ మైదానంలో లక్షలాది మందితో భారీ బహిరంగసభ జరిగిందని చెప్పారు. 3న అర్ధరాత్రి రాజీవ్‌కుమార్‌ను అరెస్టు చేసేందుకు సీబీఐ బృందం వచ్చిందన్నారు. సీబీఐ బృందం వచ్చినా స్థానిక పోలీసుల సహకారంతోనే విచారణ చేయాలనీ, అరెస్టు చేయాల్సి ఉంటుందనీ గుర్తు చేశారు. ఇవేవీ కేంద్రం పాటించకపోవడంతో సీబీఐ బృందాన్ని బెంగాల్ రాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం, తృణమూల్ ప్రభుత్వాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందని అన్నారు. ఇది కుంభకోణాలపై విచారణ కాకుండా రెండు పార్టీల మధ్య రాజకీయ యుద్ధంగా కనిపిస్తోందని చెప్పారు. మాయావతి, అఖిలేష్ యాదవ్, కేరళ సీఎం విజయన్, జేఎన్‌యూ నేత కన్నయ్యకుమార్ ఇలా రాజకీయ ప్రత్యర్థులపై కేంద్రం దాడులకు దిగుతోందన్నారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్‌చౌహాన్‌పై వ్యాపం కుంభకోణంలో ఆరోపణలు వస్తే సీబీఐ విచారణ చేపట్టడం లేదన్నారు. కేంద్రం అప్రజాస్వామిక పద్ధతులను ఖండిస్తున్నామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలను తిరిగి నిర్ణయించాలనీ, ఇందుకోసం అఖిలపక్షం ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు కేంద్రం, తృణమూల్ ప్రభుత్వాలకు మొట్టికాయలు వేసిందన్నారు. సీబీఐ స్వయంప్రతిపత్తిని కాపాడాలని కోరారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలనీ, బాధితులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు.రాష్ట్రంలో మంత్రివర్గం లేకుండా అప్రజాస్వామిక పాలన సాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా పరిష్కారం కావడం లేదన్నారు. మంత్రివర్గ విస్తరణపై సీఎం కేసీఆర్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

రైతుల ఆకాంక్షలు నెరవేర్చని కేంద్ర బడ్జెట్

- రేపటి నుంచి రాష్ట్రవ్యాప్త ప్రచారం: తెలంగాణ రైతుసంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతుల ఆకాంక్షలు నెరవేర్చని కేంద్ర బడ్జెట్ విఫలమైందని అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ అన్నారు. నామమాత్రపు బడ్జెట్ కేటాయింపుల వల్ల రైతుల ఆర్థిక సమస్యలు పరిష్కారం కావన్నారు. చైతన్య సేద్యం 2019 డైరీని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులపై ఈ నెల 8 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్‌టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించి విస్తృత ప్రచారం చేస్తామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఎలాంటి సహాయం ప్రకటించలేదని విమర్శించారు. దేశంలో ఏటా 12500 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉన్నదని చెప్పారు. కేరళ తరహాలో రుణ విమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రుణ చట్టంలో మే, జూన్ నెలలో పంట రుణాలు బ్యాంకుల ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఇవ్వాలని కోరారు. అన్ని పంటలకు బీమా ప్రీమియాన్ని ప్రభుత్వాలే చెల్లించాలని డిమాండ్ చేశారు.



వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు చేయడంలో మధ్య దళారీలు ఏటా రూ. 2 లక్షల కోట్లు లాభాలు గడిస్తున్నారని చెప్పారు. మధ్య దళారీలను తొలగించి, ప్రభుత్వ కొనుగోలు సంస్థలకు అప్పగిస్తే వినియోగదారులపై భారం పడకుండా రైతులకు పెట్టుబడిపై 50శాతం ధరలు చెల్లించవచ్చని సూచించారు. ప్రకటించిన ధరలకు తక్కువకు అమ్మడం వల్ల ఒక్క తెలంగాణలోనే రూ. 8,300 కోట్లు, సీ-2పై 50 శాతానికి తక్కువ ధరలు నిర్ణయించడం వల్ల మారో రూ.23, 000 కోట్ల చొప్పున ఏటా ఆరు పంటలకే నష్టపోతున్నారని వివరించారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర బడ్జెట్ రైతులకు గిట్టుబాటు ధరలు లభించే విధంగా కేటాయింపులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వి. సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ధమాన నటి ఆత్మహత్య

- ప్రేమించి మోసపోవడమే కారణమా..?

నవతెలంగాణ - బంజారాహిల్స్

స్టార్ మాలో ప్రసారమయ్యే 'పవిత్రబంధం' సీరియల్‌లో నటిస్తున్న వర్ధమాన నటి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పవిత్ర బంధం సీరియల్‌లో నటించే నాగఝాన్సీ(21)ది కృష్ణాజిల్లా ముదినేపల్లి మండలం ఓదిలి గ్రామం. ఝాన్సీ సీరియల్స్‌లో నటిస్తూ నగరంలోని శ్రీనగర్ కాలనీలో నివాసముండేది. అయితే, బుధవారం ఉదయం ఆమె ఇంటికొచ్చిన సోదరుడు తలుపులు తట్టాడు. ఎంతసేపటికీ డోర్ తీయకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి, లోపలికి వెళ్లి చూడగా ఝాన్సీ విగత జీవిగా ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు.



పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ప్రేమ వ్యవహారమా లేక ఇంకేమైనా ఇబ్బందులున్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఝాన్సీ విజయవాడకు చెందిన సూర్య ఆరు నెలలుగా ప్రేమించుకుంటున్నారనీ, అతను పరిచయం అయ్యాక సీరియల్స్‌లో నటించడం మానేసిందనీ బంధువులు చెప్పారు. అయితే, పెండ్లి చేసుకుందామనడంతో సూర్య ఆమెను దూరం పెట్టాడు. ఇటు సీరియల్స్, అటు ప్రేమ దూరం కావడంతో ఝాన్సీ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని అంటున్నారు.

అర్హులైన పేదలకే భూములను అసైన్డ్ చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిజమైన పేదలకే భూములను అసైన్డ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అసైన్డ్ భూముల కొనుగోలు వ్యవహారంలో ఏపీ అసైన్డ్ ల్యాండ్స్ ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్ఫర్స్ (పీవోటీ) యాక్ట్-1977 కింద లబ్దిపొందినవారి ప్రయోజనాలను ఆటంకపర్చకుండా, గ్రామ సభల ద్వారా విచారించి సంపన్నుడు లబ్ది పొందకుండా నిజమైన అర్హులను గుర్తించిన తర్వాతనే ఆ భూములను అసైన్డ్ చేయాలని కోరారు. రాష్ట్రంలో 1952 నుండి నేటి వరకు వివిధ రకాల ప్రభుత్వ భూములు అర్హులైన పేదలకు అసైన్డ్ చేయబడ్డాయని తెలిపారు. రాష్ట్రంలో పేదరికంతో సేద్యం చేయలేక, అభివృద్ధి చేయలేక 2,41,749 ఎకరాల అసైన్డ్ భూమిని 84,706 మందికి అమ్ముకున్నట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని పేర్కొన్నారు. పేదరికంలో మగ్గి ప్రభుత్వ అసైన్డ్ భూమిని అమ్ముకుంటే దాన్ని ఎవరికీ అసైన్డ్ చేయకుండా పాతవారు అర్హుడై ఉంటే అతనికే ఆ భూమిని అప్పగించాలని పీవోటీ చట్టం-1977లో ఉందని తెలిపారు. ఈ చట్టం దళిత, గిరిజన, వెనకబడిన పేదలకు రక్షణగా ఉండేదని పేర్కొన్నారు. ఇలాంటి చట్టానికి గత ప్రభుత్వంతో పాటు తెలంగాణ ప్రభుత్వం కూడా సవరణ తెచ్చిందని తెలిపారు. ఈ చట్ట సవరణ ప్రకారం అసైన్డ్ భూములు కొన్నవారు అర్హులైతే వారికే పట్టాలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. దీని ద్వారా పేద, దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులకు చెందిన విలువైన అసైన్డ్ భూములు సంపన్నులకు దక్కే అవకాశముందని తెలిపారు. అదే విధంగా హెచ్ఎండీఏ, రాష్ట్రంలోని మున్సిపాలిటీల చుట్టూ ఉన్న ఇలాంటి భూములు సంపన్నులు, పట్టణ ప్రజలు ఈ చట్టం చాటున లబ్ది పొందే అవకాశముందని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం గత పీవోటీ చట్టం కింద లబ్దిపొందినవారి ప్రయోజనాన్ని ఆటంకపర్చకుండా చూడాలని కోరారు. గ్రామ సభల ద్వారా విచారించి సంపన్నులు లబ్ది పొందకుండా నిజమైన అర్హులను గుర్తించిన తర్వాతనే ఆ భూములను అసైన్డ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ భూములు సాగు చేయడానికి పేదలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

మల్లన్నసాగర్ కట్ట నిర్మాణంపై హైకోర్టు స్టే

నవతెలంగాణ-తొగుట

సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో నిర్మిస్తున్న కొమురవెల్లి మల్లన్నసాగర్ కట్ట నిర్మాణ పనులను ఆపాలని హైకోర్టు మంగళవారం స్టే విధించింది. ప్రభుత్వం పనులను వేగవంతం చేసిన నేపథ్యంలో నిర్వాసితులకు పరిహారం, రైతు కూలీలకు భతి, ముంపు గ్రామాల వాసులకు పునరావాసం కోసం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించే వరకు పనులు కొనసాగించొద్దని ఇటీవలే బాధితులు కోరుటకెళ్లారు. ఈ కేసు నడుస్తుండగానే కాంట్రాక్టు అధికారులు పనులు చేపడట్టంతో వాటిని అడ్డుకోవాలని నిర్వాసితులు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న కోర్టు.. నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా, సమస్యలు పరిష్కరించకుండా పనులు ఎలా చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిపై రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించి, పనులపై స్టే విధించింది. ఈ ప్రతిని నిర్వాసితులకు అందజేసింది. దీంతో నిర్వాసితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందం తొందరగా కంటికి పాతబడిపోతుంది.
సౌశీల్యానికి మాత్రమే ఎప్పుడూ నశించని ఆకర్షణ ఉంటుంది. - గురజాడ

సంపాదకీయం

అమెరికా చర్య దుర్మార్గం

చదువుకోవడానికి అమెరికా వెళ్లిన భారత విద్యార్థులను ఆ దేశ పోలీసులు అరెస్టు చేయడం అన్యాయం. విద్యార్థి వీసా ముసుగులో తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి అక్రమంగా ఉండేందుకు ప్రయత్నించినందునే అదుపులోకి తీసుకోవాల్సి వచ్చిందని అమెరికా ప్రభుత్వం చెప్పడం దుర్మార్గం. వాస్తవాలు తెలుసుకోకుండా మధ్యవర్తులు చెప్పింది నమ్మి నష్టపోయిన వారిలో ఎక్కువమంది భారత విద్యార్థులు. అందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యార్థులు కూడా ఉండటం బాధాకరం. ఈ ఘటనలో అమెరికా ప్రభుత్వమే మొదటి ముద్దాయి అని చెప్పాలి.

జీఆర్ఈ, టోఫెల్ ప్రవేశపరీక్షల్లో నెగ్గుకు రాలేని వారు అమెరికాకు వెళ్లాలనుకుంటే మంచిదారులే ఉన్నాయి. చదువుకుంటూ ఉద్యోగం చేసుకునేందుకు ఎలా ఉంటే బాగుంటుందో చెప్పేందుకు విజ్ఞులయిన నిర్వాహకులను సంప్రదించాలి. ప్రభుత్వాలు కూడా విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు, వ్యక్తులకు అవసరమైన పూర్తి సమాచారం అందిస్తే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కావు.

వేరేదారిలో విద్యార్థులు అక్రమంగా అమెరికాలో చొరబడితే వారిది తప్పు. ప్రభుత్వమే తమ పోలీసులచేత నకిలీ యూనివర్సిటీని ఏర్పాటు చేయించి అందులో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులను ఆ తర్వాత అరెస్టు చేయడం ముమ్మాటికీ అన్యాయమూ, అవమానించడమే. పైగా అక్రమ వలసదారులను పట్టుకోవడంలో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే క్రమంలో ఇలా వక్రమార్గంలో స్టింగ్ ఆపరేషన్ చేశామని ఘనంగా చెప్పుకోవడం ఆశ్చర్యకరం! ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటినుంచీ ఆ దేశప్రజలను తన మాటలతో మోసపుచ్చుతూనే ఉన్నారు. యువతకు ఉపాధి చూపక పోవడానికి అక్రమ వలసదారులే కారణమంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ట్రంప్‌కు అత్యంత విశ్వాసపాత్రుడిగా ఉంటున్న మోడీ భారత విద్యార్థులకు జరిగిన అన్యాయం పట్ల స్పందించరా? అరెస్టయి ఐదురోజులైనా ఇప్పటివరకు మోడీ నోరెత్తలేదంటే దేశ విద్యార్థుల కంటే ట్రంప్ మీద ఈగ వాలకుండా ఎంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతున్నది.



అక్రమ వలసదారుల సంఖ్యకు అడ్డుకట్టవేయాలన్న ట్రంప్ ఆదేశాలను అమలు చేసే క్రమంలో అధికారులు కొత్త ఆపరేషన్‌కు తెరలేపారు. ఇందులో భాగంగా మిషిగన్ రాష్ట్రంలో యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్‌ను ప్రారంభిస్తున్నట్టు 2017ఫిబ్రవరిలో అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు(ఐసీఈ) ప్రకటనలు ఇచ్చింది. న్యూజెర్సీలో 2015లో మూతపడి ఫార్మింగ్టన్ వర్సిటీ పేరిట కోర్సులు ఆఫర్ చేసింది. సిబ్బందిని, అధ్యాపకులను నియమించినట్టు ప్రత్యేక ఏజెంట్లుగా నియమించబడిన ఐసీఈలోనే అంతర్గత భద్రత దర్యాప్తు సిబ్బంది వెబ్‌సైట్ రూపొందించారు. విద్యార్థులను చేర్పించిన మధ్యవర్తులకు ప్రోత్సాహకాలు ప్రకటించారు. ఈ క్రమంలో మధ్యవర్తులు విద్యార్థులను ఆకర్షించి అడ్మిషన్లు ఇప్పించారు. లక్షల రూపాయలు వసూలు చేసారు. తాము అనుకున్న రీతిలో అంతా జరిగిపోవడంతో దాదాపు 600మంది విద్యార్థుల్నీ అధికారులు అరెస్టు చేశారు. ఇందులో కోర్సు గడువు ముగుస్తున్న వారూ, హెచ్1బీ వీసాకు ప్రయత్నిస్తున్న వారూ ఉన్నారు. అక్రమ వలసదారులను పట్టుకునేందుకే ఈ స్టింగ్ ఆపరేషన్ చేసినట్టుగా ఇమ్మిగ్రేషన్ అధికారులు యిప్పుడు చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం. అందులో అత్యధికమంది భారతీయులు ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 129మంది ఉన్నట్టు పత్రికల ద్వారా తెలుస్తోంది. ఇందులో కీలకంగా వ్యవహరించిన ఎనిమిదిమంది మధ్యవర్తులపై కేసులు నమోదయ్యాయి. అమెరికాలో ఉన్న తెలుగు సంఘాల కృషితో కొంతమంది విద్యార్థులు విడుదలైనా, మరికొంతమంది పోలీసుల అదుపులో ఉన్నారు. గతంలోనూ ఇలాంటి ఆపరేషన్ చేపట్టిన అమెరికా ప్రభుత్వం 11మంది విద్యార్థులను అరెస్టు చేసి వెనక్కి పంపారు. విద్యార్థులందర్నీ వెనక్కి పంపిన తర్వాత వారి భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్థకం. వారంతా పేద పిల్లలు. అప్పు చేసి చెల్లించిన లక్షల రూపాయలు ఎలా తీరుస్తారు.

యూనివర్సిటీ అధికారులతో ఒప్పందాలు చేసుకున్నాకే అడ్మిషన్లు ఇప్పించామని, నగదు కూడా చెల్లించామని మధ్యవర్తులు చెప్పడం గమనార్హం. దీనికి అమెరికా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా? తిరిగి ఆ డబ్బు విద్యార్థులకు చెల్లిస్తుందా? అక్రమ వలసదారులను గుర్తించడం కోసం యూనివర్సిటీని సృష్టించి విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం మూర్ఖత్వంతో కూడుకున్న పని. ప్రపంచంలో తిరుగులేని శక్తిగా పేరు తెచ్చుకున్న అమెరికా ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని ఎవరు ఊహిస్తారు. నకిలీ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్టు పోలీసులు న్యాయస్థానానికి వివరణ ఇచ్చుకోవడం తెలివైన పనా? తన కనుసైగలతో ప్రపంచదేశాలను గడగడలాడించే అమెరికాకు అక్రమ వలసదారులను గుర్తించి పట్టుకునే వ్యవస్థ లేదనుకోవాలా? ఇతరులకు సుద్దులు చెప్పే అమెరికా పాలకులు విద్యార్థులను మోసం చేయడం సరైందేనా?

అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థులు పూర్తి విషయాలు తెలుసుకోకుండా మధ్యవర్తుల చెప్పిన మాటలు నమ్మి వెళితే పరిస్థితులు ఇలాగే ఉంటాయి. జీఆర్ఈ, టోఫెల్ ప్రవేశపరీక్షల్లో నెగ్గుకు రాలేని వారు అమెరికాకు వెళ్లాలనుకుంటే మంచిదారులే ఉన్నాయి. చదువుకుంటూ ఉద్యోగం చేసుకునేందుకు ఎలా ఉంటే బాగుంటుందో చెప్పేందుకు విజ్ఞులయిన నిర్వాహకులను సంప్రదించాలి. ప్రభుత్వాలు కూడా విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు, వ్యక్తులకు అవసరమైన పూర్తి సమాచారం అందిస్తే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కావు.

ప్రేరేపిత హత్యకు గురైన గణాంక వ్యవస్థ



జయతీ ఘోష్

దేశంలోని వివిధ వ్యవస్థలపై నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడులు అందరికీ తెలిసిన విషయమే. కానీ భారతదేశ గణాంక వ్యవస్థ విధ్వంసం తగినంతగా ఖండించబడలేదు. 'నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్' వారు 2017–18 సంవత్సరానికి చేసిన ఉపాధి సర్వేను విడుదల చేయడానికి ప్రభుత్వం తిరస్కరిస్తున్నది. అది 'నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్' కు చెందిన చివరి ఇద్దరి స్వతంత్ర సభ్యుల రాజీనామాకు దారితీసింది.

అధికార గణాంకాలపై చేసిన ఈ దాడి తప్పకుండా ఆలోచించవలసిన అంశం. ఎందుకంటే, దేశ ఆర్థిక వ్యవస్థలో ఏమి జరుగుతున్నదో, ప్రభుత్వ పనితీరు ఏ విధంగా వున్నదో దేశ పౌరులు తెలుసుకొని, అంచనా వేయడాన్ని తిరస్కరించడం. విచారకరం. ఎందుకంటే, ఒక పెద్ద అసంఘటిత ఆర్థిక వ్యవస్థ, సాంప్రదాయ కొలమానానికి చిక్కనటువంటి ఆర్థిక కార్యకలాపాలను కలిగి ఉన్నప్పటికీ, అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలోని ఆకట్టుకునే గణాంక వ్యవస్థలలో ఒక దానిని భారతదేశం నిర్మించే ప్రయత్నం చేసింది. ఇది ప్రభుత్వానికి కూడా ప్రతికూలమైన అంశమే. ఎందుకంటే, సమర్థవంతమైన విధానం రూపొందడానికి ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, సమస్యలపై సరియైన పరిజ్ఞానం కూడ అవసరం.

వాస్తవానికి, ఫిబ్రవరి 7న విద్యార్థులూ యువకులూ నిర్వహించతలపెట్టిన 'పార్లమెంట్‌కు ప్రదర్శన'లో చేయనున్న డిమాండ్లలో, ఖాళీల భర్తీ అనేది ప్రధానమైన డిమాండ్. కీలకమైన సామాజిక సేవా రంగాలలో క్రమమైన ఉపాధి విస్తరణ అనుకూలమైన భారీ ఫలితాలనిస్తుంది. దాని వలన పరోక్ష ఉపాధి కల్పన సృష్టించబడుతుంది.

ఆ విధమైన అతిక్రమణల జాబితా రోజురోజుకూ పెరిగిపోతున్నది. ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వం కన్నా మెరుగైనదని చూపించుకోవడానికి తమకు అనుకూలమైన పద్ధతిలో జీడీపీ సమాచారాన్ని చూపించింది. ఇతర సమాచారాలకు సంబంధించిన వాస్తవాలు, సంఖ్యలు అధికారికంగా విడుదల చేయడానికి ముందుగా తొక్కిపెట్టబడుతున్నాయి. 'గంగా నదిని శుభ్రం చేయండి' అనే ప్రచారం నుంచి 'స్వచ్ఛ భారత్ అభియాన్' లేక 'ఉజ్వల యోజన' లేదా గ్రామీణ విద్యుద్దీకరణ ప్రచారం లాంటి ప్రభుత్వ కార్యక్రమాల వరకూ వాటికి సంబంధించిన ఏ సమాచారం ఇవ్వకుండా నిరాకరిస్తున్నారు. ఆర్థిక సమాచారాన్ని కూడా నమ్మలేం. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రభుత్వరంగ సంస్థలను ఇతర ప్రభుత్వరంగ సంస్థలకు అమ్ముతున్నట్టు నటించడం ద్వారా, ఉపాధి లేదా ఆహార భద్రతా కార్యక్రమాలకు చెల్లించవలసిన బకాయిలను చెల్లించకపోవడం ద్వారా, ఆఫ్ బడ్జెట్ ఖర్చును తరలించడం ద్వారా తన లోటును దాచిపెడుతున్నది. 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' రెండు సంవత్సరాలుగా తన నివేదికలను ప్రచురించడం లేదు. మొత్తానికే నిలిపివేసింది. రెగ్యులేటరీ మార్గదర్శకాలకు అనుగుణంగా లేని బ్యాంకుల సమాచారాన్ని బహిర్గతం చేయడానికి ఆర్‌బీఐ తిరస్కరిస్తున్నది. పారదర్శకంగా సమాచారం ఇస్తుందన్న పేరున్న 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' వెబ్‌సైట్, పని కావాలన్న డిమాండ్లకు స్పందించి ప్రభుత్వం పనిని సమకూర్చలేకపోయిన విషయాన్ని దాచిపెట్టే ఒక అబద్ధాన్ని కూడ కలిగి ఉన్నది.

స్వయంగా 'రియల్ టైమ్ డాటా'ను సమకూర్చే 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే'తో భర్తీ చేయాలన్న కారణంతో ఐదేండ్ల కొకసారి పెద్ద ఎత్తున సర్వే నిర్వహించే కార్మికశక్తిని 'నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్' రద్దు చేసేట్టు ఒత్తిడి తెచ్చినారు. 2017–18 సర్వే నివేదిక సిద్ధంగా ఉన్నది. దానిని 'నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్' అధికారికంగా ఆమోదించింది. కానీ ప్రభుత్వం దానిని విడుదల చేయడం లేదు. అదే విధంగా 2016–17కు సంబంధించిన ఆరవ వార్షిక ఉద్యోగ–నిరుద్యోగంపై లేబర్ బ్యూరో చేసిన సర్వే నివేదికను కూడ, సంబంధిత మంత్రి అనుమతి ఉన్నప్పటికీ, ప్రభుత్వం బహిరంగంగా విడుదల చేయలేదు.

స్వతంత్ర సర్వేలు సూచించినట్టుగా, గతంలో ఉపాధి కల్పన నిల్చిపోయినట్టు లేదా తగ్గినట్టుగా సర్వేలు తెలియజేస్తున్నట్టు మాత్రమే మనం ఊహించగలం. ఇప్పటికే ఉపాధి కల్పన అధ్వాన్నంగా ఉన్న పరిస్థితిలో, పెద్దనోట్ల రద్దు భారతదేశ అసంఘటిత ఆర్థిక వ్యవస్థకు, పేద ప్రజల జీవనోపాధికి అపాయం కల్గించిందని మనం అంగీకరించాలి. అప్పటి నుంచీ ఉపాధి కల్పన కోలుకుంటున్నట్టు కనిపించడం లేదు. వాస్తవానికి 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ద ఇండియన్ ఎకానమీ' పెద్దఎత్తున నిర్వహించిన సర్వే 2018లో ఉపాధి కల్పన గణనీయంగా పతనమైనట్టు సూచించింది. ముఖ్యంగా గ్రామీణ మహిళలు, తక్కువ చదువుకున్న కార్మికులు 11 మిలియన్ల ఉద్యోగాలు కోల్పోయిన వారిలో ఉన్నారు. ప్రాథమిక సమాచారం ఈ విధంగా ఉంటే, మొత్తం పరిస్థితి దిగులుపడే విధంగా ఉన్నది.

నేరం చేసినట్టు ఆరోపించే సమాచారాన్ని బహిరంగంగా విడుదల చేయకుండా అడ్డుకునే పరిస్థితులున్నాయి. ప్రభుత్వంలో ఉన్న మంత్రులు కూడా దేశంలో ఉపాధి కల్పనకు సంబంధించి నమ్మదగిన సమాచారమేదీ లేదని చెబుతున్నారు. దానికి బదులుగా ప్రధాని, ఇతర మంత్రులు పూర్తిగా తప్పుదారిపట్టించే, నవ్వుపుట్టించే సూచికల ఆధారంగా ఉపాధి కల్పన జరుగుతుందన్న ప్రచారం చేస్తున్నారు.

ఎంప్లాయ్‌మెంట్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపీఎఫ్ఓ) ఆధ్వర్యంలో ఉండే జీతాల చెల్లింపుల రిజిష్టర్‌లో నమోదు చేయబడిన పేర్లు సూచించే ఉపాధి కల్పనను ఉపయోగించుకోవడం, వారు చేసే నిరాశాజనకమైన ప్రయత్నాలలో ఒకటి. ఇపిఎఫ్ఓ అధికారి స్పష్టం చేసినట్టుగా, అనేక కారణాల వలన ఈ ప్రయత్నం తప్పు. ఇది క్రొత్త ఉపాధి కల్పనకు సంబంధించిన ఆలోచనలు కూడ ఇవ్వదు. ఇది రిజిస్టర్‌లో నమోదు చేసిన ప్రస్తుత కార్మికులను గుర్తిస్తుంది. అనేకమంది కార్మికులకు అనేక అకౌంట్లు ఉంటాయి.



కార్మికులు ఒకే అకౌంట్‌గా మార్చుకోరు. ఒకసారి నమోదు చేసిన పేర్లు, వారు ఆ ఉద్యోగంలో కొనసాగనప్పటికీ తొలగించరు. ఈపీఎఫ్ఓ లోని అస్థిరమైన సంఖ్యలు ఉపాధి కల్పనా స్థాయిని అంచనా వేయడంలో పరిమితంగా ఉపయోగపడతాయి. నమోదయిన అనేక మంది కార్మికులు కనీస వేతనాలు కూడా పొందడంలేదు.

పరిస్థితి ఈ విధంగా ఉన్నప్పటికీ, 2018 జూలైలో లోక్‌సభలో ప్రధాని మోడీ, తన పాలనా కాలంలో ఆర్థిక వ్యవస్థలో కొన్ని మిలియన్ల ఉద్యోగాలు కల్పించినట్టు పేర్కొనడానికి ఇలాంటి సమస్యాత్మకమైన సూచికలను ఉపయోగించుకున్నాడు. ఆయన కచ్చితమైన సమాచారం ఆధారంగా లేని ఊహాజనితమైన అంచనాలను సభలో తెలియచేసినాడు. క్రొత్తగా నమోదు చేసిన చార్టర్డ్ అక్కౌంటెంట్ కంపెనీలలో, ఒక్కొక్క కంపెనీలో 20 మంది చొప్పున ఒక లక్ష క్రొత్త ఉద్యోగాలు సృష్టించబడినట్టు; పట్టభద్రులైన డాక్టర్లలో 60శాతం మంది స్వంతంగా వృత్తిని చేపట్టడం ద్వారా ఒక్కొక్కరి వద్ద ఐదుగురు చొప్పున 2,40,000 ఉద్యోగాలు కల్పించినట్టు; 3/4 వంతు క్రొత్త వాణిజ్య వాహనాల అమ్మకాలు ఒక్కొక్క వాహనానికి ఇద్దరు చొప్పున 11.4 లక్షల మంది ఉద్యోగాలు పొందినట్టు; 90శాతంగా అమ్ముడుపోయిన ఆటో రిక్షాలు, రెండు వాహనాలకు ముగ్గురేసి చొప్పున 3.4 లక్షల ఉద్యోగాలు పొందినట్టు ఊహించినాడు. నిరాధారమైన ఈ అంచనాలు, ఆయన ఒక్క సంవత్సరంలోనే 10 మిలియన్ల ఉద్యోగాలు సృష్టించామని చెప్పడానికి దారితీసినాయి. ప్రాచీన భారతదేశంలోనే గ్రహాల మధ్య విమానాలు, గాజుకుండలో గర్భం దాల్చడం, ప్లాస్టిక్ సర్జరీ ప్రక్రియల లాంటివి అభివృద్ధి చెందినాయని మంత్రులు ప్రజలను నమ్మించడానికి వ్యాప్తిచేసిన భావాలతో సమానంగా ఈ గణాంకాల పుట్టుక జరిగింది.

అదే ఉపన్యాసంలో నరేంద్ర మోడీ దేశ ప్రజల ముందు నెలవారీగా ఉపాధి కల్పనా వివరాల సంఖ్యలను సమర్పిస్తామని వాగ్దానం చేసినాడు. అధికారిక సర్వే సమాచారాన్ని వదిలివేయడంతోపాటు, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యలను కూడ విడుదల చేయలేదు. మోడీ పాలనలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 75,231కి క్షీణించిందని బడ్జెట్ పత్రాలు సూచిస్తున్నాయి. ఏ సంవత్సరంలో కూడా అనుకున్న లక్ష్యాలు సాధించలేదు.

ఈ పరిస్థితి ఉపాధి సంక్షోభానికి అత్యవసరమైన పరిష్కారం ఉండాలని సూచిస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో పెద్ద ఎత్తున ఖాళీలున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 2.4 మిలియన్ల ఖాళీలున్నాయని, అంతకు మించి అనేక రెట్లు వివిధ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఒక అంచనా. ఉపాధి అవసరాలు ఉన్నవారికి ఖాళీలు నింపడం ద్వారా ప్రజాసేవ చేసినట్టవుతుంది. వాస్తవానికి, ఫిబ్రవరి 7న విద్యార్థులూ యువకులూ నిర్వహించతలపెట్టిన 'పార్లమెంట్‌కు ప్రదర్శన'లో చేయనున్న డిమాండ్లలో, ఖాళీల భర్తీ అనేది ప్రధానమైన డిమాండ్. కీలకమైన సామాజిక సేవా రంగాలలో క్రమమైన ఉపాధి విస్తరణ అనుకూలమైన భారీ ఫలితాలనిస్తుంది. దాని వలన పరోక్ష ఉపాధి కల్పన సృష్టించబడుతుంది.

కాబట్టి సమస్యను దాచి ఉంచడానికి బదులు, బాధ్యతాయుతమైన ప్రభుత్వం ఉపాధి కల్పన గురించి ఏదైనా చేయడం అత్యవసరం. ఫలితంగా ఒక బాధ్యతాయుతమైన ప్రభుత్వం ఉన్నదన్న గ్యారంటీ కూడా ప్రజల్లో ఉంటుంది.

అనువాదం: బోడపట్ల రవీందర్
సెల్: 9848412451

ఇపీఎస్ పెన్షన్ నిర్ధారణ శాస్త్రీయంగా చేయాలి



ఎం.ఎన్.రెడ్డి

ఇపీఎస్ పెన్షనర్లకు 2014 సెప్టెంబర్ 1 నుంచి కనీస పింఛన్ వేయి రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం అమలుకు విధించిన వివిధ ఆంక్షల వల్ల ఆ పరిధిలో వచ్చిన వారిలో చాలా మంది పెన్షనర్లు రూ.వేయికి తక్కువగా పొందుతున్నారు. పదవీ విరమణ పొందిన భవిష్యనిధి సభ్యులు దాదాపు 65లక్షలమంది ఉన్నారు. వీరిలో కొద్దిమందికి పెన్షను లేదు. భవిష్యనిధి పరిధిలోని కార్మికులు, పెన్షను కావాలని పలు ఆందోళనలూ పోరాటాలూ చేశారు. మొదటి దశలో 31.3.1971 నుంచి ఫ్యామిలీ పెన్షన్ స్కీమ్, రెండవ దశలో ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్–1995ను, 1995 నవంబర్ 16నుంచి ప్రవేశ పెట్టారు. ఈ పథకంలో పెన్షను నిర్ధారణ సహేతుకంగా, శాస్త్రీయంగా కనీస అవసరాల ప్రాతిపదికన జరగలేదు.

గత పదేండ్లుగా ఈ భవిష్యనిధి పరిధిలో పొందుతున్న పెన్షన్ శాస్త్రీయంగా నిర్ధారించాలని కోరుతున్నారు. ఉదాహరణకు ఈనాడు అన్ని రంగాల కార్మికులకు ఉద్యోగులకు వేతనాలు కుటుంబం, కుటుంబ అవసరాలకు, పెరిగే ధరలకు అనుగుణంగా ఆహారం, విద్య, వైద్య, సామాజిక అవసరాల ప్రాతిపదికన మూలవేతనం నిర్ధారించబడింది. అందుకు డాక్టర్ ఆక్రాయిడ్ లేక నేషనల్ న్యూట్రిషన్ కమిషన్ సిఫార్సులను, ఆయా కమిషన్ల పరిగణనలోకి తీసుకునే కనీస వేతనాలు నిర్ధారించబడినాయి. ఈ కనీస వేతనాల నిర్ధారణ ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉద్యోగుల పదవీ విరమణ తరువాత పొందే పెన్షన్ నిర్ధారించాయి. ఆ విధంగా, ఆ పెన్షనులకు కూడా శాస్త్రీయమైన పెన్షన్ని రిటైరయ్యే చివరి నెల జీతంలో సగభాగం పెన్షనుకాని, లేక కనీస వేతనంలో సగభాగం కనీస పెన్షనుగా నిర్ధారించారు. చెల్లిస్తున్నారు. ఈ విధానాల వల్ల పెన్షనుకు సార్వజనీకత ఏర్పడింది.

సంఘటితరంగ పరిశ్రమల్లోని ఉద్యోగులు పొందుతున్న పెన్షనుకు కూడా సార్వజనీకమైన పెన్షను విధానం కావాలి. శాస్త్రీయ ప్రాతిపదికన పెన్షను నిర్ధారించాలి. అందుకు ప్రభుత్వం, ప్రావిడెంటు ఫండు అధికారులు, ఇపిఎస్ పెన్షను విధానం, కంట్రిబ్యూటరీ పెన్షను విధానం కాబట్టి యాజమాన్యం ఇపిఎస్ పెన్షన్ కోసం చెల్లిస్తున్న కంట్రిబ్యూషను పరిధికి పరిమితమై ఉంటుందని పదేపదే వివరణలు ఇస్తున్నారు. అందుచేత వృద్ధాప్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో కనీస అవసరాల ప్రాతిపదికన శాస్త్రీయత, హేతుబద్ధత, ఈ పరిశ్రమల నుంచి పదవీ విరమణ అయ్యేవారికి వర్తింపచేయలేదన్న వాదనను ప్రభుత్వం, పీఎఫ్ సంస్థ వివరిస్తున్నాయి. పీఎఫ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్‌లో కార్మికులకు ప్రాతినిధ్యం వహించేవారు కూడా ఈ వాదన బలపరుస్తున్నారు. కనీస పెన్షన్ అవసరాల ప్రాతిపదికన చెల్లించే స్థోమత భవిష్యనిధికి లేదని వాదిస్తున్నారు. ఈ సంక్షేమ పథకానికి తనకు సంబంధమే లేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఇపిఎఫ్ (సీలింగ్ రూ.15,000 పరిధి)లో 1.16శాతం చెల్లించటమే ఎక్కువని, ఇంకెంతమాత్రం అదనపు భారం భరించలేనని ప్రభుత్వం తప్పుకుంటోంది.

కేరళ హైకోర్టు 12.10.2018న ఇచ్చిన తీర్పులో పీఎఫ్, మిస్‌లేనియస్ ప్రొవిజన్స్ – 1952 చట్టం చేయటంలో గల ప్రభుత్వ ఉద్దేశాలు బాధ్యతలను వివరించింది. 1.9.2014 నుంచి అత్యధిక జీతంపై విధించిన 15వేల సీలింగ్ వల్ల ఆపైన జీతం పొందుతున్న వారి హయ్యర్ పెన్షను పొందే అవకాశాన్ని ఎత్తివేయటాన్ని కేరళ కోర్టు తప్పుపట్టింది.

పీఎఫ్ చట్టం సెక్షన్ 6, 6ఎలలో ఉన్న పరస్పర విరుద్ధ అంశాలను తొలగించాల్సి ఉంది. సెక్షన్ 6 చెప్పిన విధంగా కార్మికుడు తన నిజ వేతనంపై 12శాతంపై పీఎఫ్ నిధికి చెల్లించాలి. అందుకు సమాన మొత్తం యాజమాన్యాలు చెల్లిస్తాయి. సెక్షన్ 6ఎ, పీఎఫ్ స్కీమ్‌లో రూలు 2(6) ప్రకారం ఇపిఎస్ కంట్రిబ్యూషన్ ఉన్నట్టే పీఎఫ్ రూల్సుకు కార్మికులు, పెన్షనర్లకు అనుకూలంగా సవరించాలి.

హై ఇంపవర్డ్ మానిటరింగ్‌కి సమర్పించిన వినతిపత్రంలో కనీస పెన్షను రూ.9వేలు కమిటీ నిర్ణయించాలని, కరువు భత్యం చెల్లించాలి. కనీస పెన్షను నిర్ణయం, శాస్త్రీయ ప్రాతిపదికపై ఉండాలి. 1.1.2016 నుంచి కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు చెల్లిస్తున్న కనీస పెన్షను రూ.9వేలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల నిర్ధారణలో ముడిపడివున్నది.

హై ఇంపవర్డ్ మానిటరింగ్ కమిటీ కూడా ఇపిఎస్ కనీస పెన్షన్ శాస్త్రీయ ప్రాతిపదికన రూపొందించాలని వినతిపత్రంలో కోరాం. ఈ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి 2018 డిసెంబర్ 21న సమర్పించినట్టు కార్మికశాఖ మంత్రి లోక్‌సభలో ప్రకటించారు. ఆ నివేదికను పీఎఫ్ సంస్థ పరిశీలించి ఇచ్చే రిపోర్టుపై ఈనెల చివరిలో సీబీటీ సమావేశమై నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. భగత్‌సింగ్ కోష్యారి అధ్యక్షతన రాజ్యసభ పిటిషన్స్ కమిటీ తన నివేదిక నెం.147, తేది 2.9.2013 కరువు భత్యంతో కూడిన రూ.3వేలు చెల్లించటానికి కలిగే అదనపు భారాన్ని ప్రభుత్వం భరించాలని పేర్కొన్నది. కేరళ కోర్టు 12.10.2018న ఇచ్చిన తీర్పులో, పెన్షన్ పెంచడంవల్ల పీఎఫ్ సంస్థ భరించలేదన్న వాదన లేవనెత్తవద్దని, 1952లో పీఎఫ్ చట్టం తెచ్చింది కార్మికుల సంక్షేమం కోసమేనని ఆ సంక్షేమ బాధ్యతల నిర్వహణ ప్రభుత్వానిదేనని, అందుచేత అదనపు భారాలను ప్రభుత్వం భరించాలని తీర్పుచెప్పింది. అందుచేత ప్రభుత్వం కనీస పెన్షను రూ.9వేలు చెల్లించాలి. ఈ కనీస పెన్షను రూ.9వేలతో పాటు ఇతర కోర్కెల సాధనకు ఇపిఎస్ పెన్షనర్లు ఆందోళన కొనసాగిస్తారు.

సెల్: 9441284852

హక్కుల్ని కాలరాయడానికేనా కొత్త అటవీ చట్టం?



ఆర్. శ్రీరాం నాయక్

అడవుల సంరక్షణకు ప్రస్తుతం ఉన్న చట్టాల స్థానంలో మరింత కఠినమైన కొత్త అటవీ చట్టం తీసుకు రావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. అనుకున్నదే తడవుగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధికారులకు చట్టం రూపకల్పనకు దిశానిర్దేశం చేశారు. అందుకనుగుణంగా నూతన అటవీచట్టం వేగంగా రూపొందుతున్నట్టు ఉన్నతాధికారులు చెపుతున్నారు. ఫిబ్రవరి నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెడుతున్నట్టు ప్రభుత్వం సంకేతాలిస్తున్నది.

రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అంత హడావిడిగా నూతన అటవీ చట్టాన్ని తీసుకురావాలనుకుంటున్నది. ఇప్పటికే అడవుల సంరక్షణ కొరకు కఠినమైన చట్టాలుండగా ఎందుకని కొత్త అటవీ చట్టాన్ని రూపొందిస్తున్నదనే సందేహాలు కలుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బయటకు చెపుతున్న కారణాలు స్మగ్లర్లు, దొంగలు అటవీ సంపదను తరలిస్తున్నారని, వీరిని కట్టడిచేయాలంటే కఠినమైన చట్టం అవసరమని నొక్కి చెపుతున్నది. ఇప్పటికే ఉన్న పీడీ యాక్టులో ఉన్న జైలు శిక్షను ఏడాది నుంచి ఏడేండ్ల వరకు బెయిలు రాకుండా చట్టంలో మార్పులు చేయడం, కేంద్రసాయుధ బలగాలు, రాష్ట్ర పోలీసులు, అటవీ సిబ్బందితో 54చెక్‌పోస్టులు పెట్టడం వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. అవి అడవుల్లోకి వెళ్ళాలన్నా, సంచరించాలన్నా భయపడేవిధంగా ఉండాలని పేర్కొన్నది. ప్రభుత్వం చెపుతున్న ఈ ప్రతిపాదనలన్నీ ప్రస్తుతం అమలవుతున్న చట్టాల్లో చాలా స్పష్టంగా ఉన్నాయి. వాటిని కఠినంగానే అటవీశాఖ అమలు చేస్తున్నది. అయినా అటవీ సంపద తరలిపోవడానికి కారకులెవరు అనేది మాత్రం ప్రభుత్వం చెప్పటం లేదు. స్మగ్లర్లు, దొంగలకు పరోక్షంగా ప్రత్యక్షంగా అండదండలిస్తున్న వారు 90శాతం అటవీశాఖ అధికారులు, రాజకీయ నాయకులేనని నమోదవుతున్న కేసులను పరిశీలిస్తే అర్థమవుతున్నది. తాత్కాలికంగా చర్యలు తీసుకోవడం మినహా కఠినంగా వ్యవహరించిన దాఖలాలు లేవు. అందుకు రాజకీయ వత్తిడులే కారణం. అటవీ సంపదను తరలించే వారు ఎంతటి వారైనా కఠినంగా జైలు శిక్షలు విధించడానికి ప్రస్తుత చట్టాల్లోనే అవకాశాలున్నాయి. కానీ తరతరాలుగా అటవీ భూములను సాగుచేస్తున్న గిరిజనులు, ఇతర పేదలకు భూమిపై హక్కులుకల్పించాలన్న అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమలు మాటేమిటి? అడవుల్లోని గిరిజనుల హక్కులు గుర్తించకుండా హడావిడిగా నూతన అటవీచట్టం తీసుకురావడంలో ఆంతర్యమేమిటి?

ఉన్న చట్టాలు చాలవా?

అడవులకు గిరిజనులకు విడదీయరాని బంధం. అడవిని దేవతగా పూజిస్తూ స్వేచ్ఛగా జీవనం సాగిస్తున్న గిరిజనులను బ్రిటిష్ పాలకులు ఏజన్సీ బౌండరీస్ పెట్టి నిర్బంధం విధించారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా దేశంలో అనేక గిరిజన తిరుగుబాట్లు జరిగాయి. ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగంలో గిరిజన హక్కులను తప్పని పరిస్థితుల్లో పొందుపరచాల్సి వచ్చింది. అయితే ఇవేవీ అడవుల్లో శతాబ్దాలుగా నివసిస్తున్న గిరిజనులకు భూమిపై మాత్రం హక్కులు ఇవ్వడానికి దోహదం చేయలేదు. భారతదేశ జనాభాలో 10శాతంగా ఉన్న 710కి పైగా గిరిజన తెగలకు అటవీ భూములపై హక్కులు ఇవ్వకుండా కఠినమైన అటవీ చట్టాలు వచ్చాయి. వీటిని గిరిజనులు నల్లచట్టాలుగా పరిగణిస్తారు. ఇవి అడవిమీద గిరిజనుల హక్కులను ప్రశ్నిస్తూ చెట్టు, పుట్ట, పట్టుతేనె, పోడు వ్యవసాయం నుంచి గిరిజనుల్ని దూరం చేస్తూ వారిని అడవుల నుండి గెంటివేయడానికి ప్రయత్నించినవే. ఆ చట్టాల పేరుతో దేశవ్యాపితంగా గిరిజనులపై నమోదైన కేసుల్లో 3 లక్షలకు పైగా పెండింగ్ కేసులు నేటికీ కొనసాగుతున్నాయి బ్రిటిష్ వలస రాజ్యంలో స్వతంత్ర భారత పరిపాలనలో అడవిపేర, గిరిజనులపేర అనేక చట్టాలు రూపొందాయి. వాటన్నిటికీ భిన్నంగా దశాబ్దాలుగా గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని సరిచేస్తూ వచ్చినదే అటవీ హక్కుల గుర్తింపు చట్టం (2006). అడవులే ఆవాసాలుగా జీవనం సాగిస్తున్న గిరిజనుల హక్కుల్ని, జీవనోపాధిని గుర్తించడంలో చారిత్రక



తప్పిదం జరిగిందని సాక్షాత్తు పార్లమెంటులో చేసిన ఈ చట్టం ప్రారంభవాక్యాల్లో ప్రకటించడం గమనార్హం.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం ఏం చెపుతోంది?

అడవుల్లో జీవిస్తున్న గిరిజనులు తరతరాలుగా అటవీ భూములను సాగుచేస్తున్నా వారికి ఎటువంటి హక్కులు లేవని, ఫలితంగా వారు నివశిస్తున్న అడవుల్లోనే వారిని ఆక్రమణదారులుగా, దొంగలుగా నేరగాళ్లుగా చిత్రీకరిస్తున్నారని పేర్కొన్నది. వన్యప్రాణులకు పులులకు, చెట్లకు వున్న హక్కులు అడవుల్లోనే ఉంటున్న గిరిజనులకు లేకపోవడంపై దేశంలో అనేక ఉద్యమాలు జరిగాయి. గిరిజనులు సాగిస్తున్న ఆందోళనకు ముఖ్యంగా వామపక్షాలు అండగా నిలిచాయి. వామపక్షాల అండతో ఏర్పడిన యూపీఏ–1 ప్రభుత్వం అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 తెచ్చింది. చట్టం ప్రకారం 2005 డిసెంబర్ 13 కంటే (చట్టం రూపొందిన తేది) ముందు సాగులో ఉన్న అటవీ భూములన్నిటిపై గిరిజనులు, సాంప్రదాయ అటవీ వాసులకు 10ఎకరాల లోపు హక్కు కల్పించాలని చెప్పింది. ఆ భూమిని వంశపారంపర్యంగా అనుభవించే హక్కు, పంటలు పండించుకునే హక్కు, అటవీ ఫలసాయాన్నీ స్వేచ్ఛగా అనుభవించే హక్కు వంటివి పొందుపరిచారు. పార్లమెంటులో చేసిన ఈ చారిత్రాత్మక చట్టం రూపుదిద్దుకుంటున్నప్పుడే గిరిజనులకు భూమిపై హక్కులు కల్పిస్తే అడవులు అంతరిస్తాయని, పర్యావరణం దెబ్బతింటుందని కేంద్ర అటవీ శాఖ అడ్డంకులు కల్పించింది.

రాష్ట్రంలో చట్టం అమలు జరిగిన తీరు...

అటవీశాఖ లెక్కల ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో 25లక్షల ఎకరాల అటవీ భూముల్లో గిరిజనులు ఇతర పేదలు పోడువ్యవసాయం చేస్తున్నారని వాటన్నిటిపై గిరిజనులకు హక్కులు ఇస్తున్నట్లు 2007లో నాటి ముఖ్యమంత్రి ప్రకటించారు. అధికారంలో ఉన్న కాలంలో 4లక్షల 66వేలకు మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకున్నది. అప్పటి నుంచి ప్రస్తుత తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ అధికారంలో ఉన్న ఐదేండ్ల కాలంలో కూడా అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం ఒక ఎకరాపై కూడా హక్కు పత్రాలు ఇవ్వలేదు. చట్టంలో కాలపరిమితి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం నిరాధారణకు గురైందని, ఆంధ్రాపాలకులు గిరిజనులను మోసంచేశారని, నూతన రాష్ట్రం ఏర్పడితే గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములన్నీటికీ హక్కుపత్రాలిస్తామని టీఆర్ఎస్ హామీ ఇచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సభల్లో ఇదే విషయాన్ని చెప్పారు. కొత్త రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో గిరిజనులకు హక్కుపత్రాలిస్తారని ఆశతో ఎదురుచూసిన గిరిజనులు ఇతర పేదలకు నిరాశనే మిగిలిందని చెప్పవచ్చు. పైగా హరితహారం పేరుతో గిరిజనుల సాగులో ఉన్న భూములను, బలవంతంగా లాక్కోని మొక్కలు నాటే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టింది. ఎదురు తిరిగిన గిరిజన సాగుదార్లపై నిర్బంధం ప్రయోగించి వందలాదిమందిపై అక్రమకేసులు పెట్టింది. ఇందులో పిడియాక్టు కేసులు కూడా ఉన్నాయి. అందుకే ప్రభుత్వానికి షెడ్యూల్ ప్రాంతంలో వ్యతిరేక ఫలితాలు వచ్చాయని గుర్తించి ఎన్నికల ఫలితాల తరువాత స్వయంగా ముఖ్య మంత్రి మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కులు ఇస్తామని ప్రకటించాల్సి వచ్చింది.

నూతన చట్టంలో గిరిజన హక్కుల మాటేమిటి?

గిరిజనుల జీవన విధానంలో భాగంగా వారి నివాసాలకు అడవుల నుంచి కలపను ఉపయోగించడం, వంటచెరకుగా వాడటం, పోడుభూముల్లో చిన్న చిన్న తుప్పలను తొలగించి అందులో వ్యవసాయం చేయడం, అటవీ ఉత్పత్తుల సేకరణ వంటి వాటిని కట్టడి చేసేందుకే ఈ కొత్త చట్టమా? లేక నూతన అటవీ చట్టం పేరుతో గిరిజనులను భయపెట్టి అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని అటకెక్కించాలనే ప్రయత్నమా? అందుకే అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని ప్రారంభం నుండి అడ్డుకుంటున్న అటవీశాఖకు తయారీ బాధ్యతను ఇచ్చారా? ఈ నేపథ్యంలో అటవీ హక్కుల గుర్తింపు చట్టంను తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అమలుచేస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

సెల్ : 9440532410

మానవి
నవతెలంగాణ

పండ్ల పచ్చళ్లు...



కాలమేదైనా సరే... వేడి వేడి అన్నంలో ఇంత పచ్చడి వేసుకుని రెండు ముద్దలు తింటే.. ఆ రుచే వేరు. కానీ ఆ పచ్చళ్లు రెగ్యులర్‌వైతే కొత్తదనమేముండదు. పోషకాలు అధికంగా ఉండే పండ్లతోనూ పచ్చళ్లు చేసుకోవచ్చు. కాకపోతే వీటిని ఉదయం అల్పాహారానికి ఉపయోగించడం మంచిది. ఆరోగ్యానికి ఆరోగ్యం. రుచికి రుచి! ఇంకెందుకాలస్యం.. మీరూ ప్రయత్నించండి!

జామకాయ పచ్చడి



కావలసిన పదార్థాలు : జామకాయలు (మరీ పచ్చిగా, మరీ దోరగా లేనివి) – 2, కొత్తిమీర, పుదీనా తరుగు – అరకప్పు, పచ్చిమిర్చి, ఎండుమిర్చి – 2 చొప్పున, ఎల్లిపాయలు – 4, చింతపండు – 2 రెబ్బలు, ఉప్పు – రుచికి సరిపడా, నూనె – 1 టేబుల్ స్పూను, కరివేపాకు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, ఆవాలు, ఎండుమిర్చి, ఇంగువ – తిరగమోతకి సరిపడా.

తయారుచేసే విధానం : నూనెలో ఎండుమిర్చి, పచ్చిమిర్చి, వెల్లుల్లి కొద్దిసేపు వేగించి తీసెయ్యాలి. తర్వాత జామకాయ ముక్కలు, కొత్తిమీర, పుదీనా ఒకటి తర్వాత ఒకటి వేగించాలి. అన్నీ చల్లారాక ఉప్పు, చింతపండు కలిపి రుబ్బుకోవాలి. ఆ తర్వాత విడిగా పెట్టుకున్న తాలింపు కలపాలి. ఈ పచ్చడి వేడి వేడి అన్నంలో కలుపుకుంటే ఎంతో రుచిగా ఉంటుంది.

పుచ్చకాయ పచ్చడి...

కావలసిన పదార్థాలు: పుచ్చకాయముక్కలు(ఎర్రగా ఉండే గుజ్జు కాకుండా, అడుగున ఉండే తెల్లభాగం చెక్కు తీసేసి) కప్పు , పచ్చిమిర్చి– రెండు, నూనె– రెండు చెంచాలు, కొబ్బరి తురుము– చెంచా, వెల్లుల్లిరేక– ఒకటి, ఉప్పు– రెండు చిటికెలు, తాలింపు కోసం: కరివేపాకురెమ్మలు, ఆవాలు, మినపప్పు కొద్దిగా



తయారుచేసే విధానం: ముందుగా ఒక నాన్‌స్టిక్ పాత్రలో నూనె వేసి వేడెక్కాక అందులో పుచ్చకాయ ముక్కలు వేసి ఐదునిమిషాల పాటు మగ్గనివ్వాలి. అందులో కొబ్బరి, పచ్చిమిర్చి, వెల్లుల్లి, చింతపండు, ఉప్పు కూడా వేసి మూడు నిమిషాల పాటూ మగ్గనివ్వాలి. చల్లారిన తర్వాత మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు తాలింపు వేసుకుని రుబ్బుకున్న పుచ్చకాయ మిశ్రమాన్ని కలుపుకోవడమే.

మామిడికాయ పచ్చడి...

కావలసిన పదార్థాలు : పచ్చిమామిడికాయ – ఒకటి (పొట్టు తీసి, తురిమి), పసుపు – పావు టీస్పూను, నువ్వులు – అరకప్పు (సన్నని మంట మీద దోరగా వేయించాలి. చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేయాలి), ఆవాలు – అర టీస్పూను (పొడి చేసి), మెంతులు – పావు టీస్పూను (ఎర్రగా వేయించి, పొడిలా చేయాలి), ఉప్పు– రుచికి సరిపడా, నూనె – నాలుగు టేబుల్‌స్పూన్లు, ఆవాలు– అర టీస్పూను, జీలకర్ర – ఒక టీస్పూను, ఎండుమిర్చి – ఏడు (గింజలు లేకుండా చిన్న ముక్కలుగా తుంపి), ఇంగువ – చిటికెడు, కరివేపాకు – గుప్పెడు.



తయారుచేసే విధానం :
లోతైన కడాయిలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, ఇంగువ, ఎండుమిర్చి, కరివే పాకులు వేసి వేయించాలి. అందులో మామిడి తురుము, పసుపు వేయాలి. నూనె పైకి తేలేంతవరకూ సన్నని మంటపై మూతపెట్టకుండా ఉడికించాలి. తరువాత నువ్వుల పొడి వేసి బాగా కలిపి ఒక నిమిషం స్టవ్ మీదే ఉంచాలి. మెంతిపొడి, ఆవాలపొడి, ఉప్పు వేసి కలిపి స్టవ్ ఆపేయాలి. వేడి అన్నంలో ఈ పచ్చడి కలిపి, నెయ్యి వేసుకుని తింటే ఆ టేస్టే వేరు.

పైనాపిల్ పచ్చడి

కావలసిన పదార్థాలు: పండిన పైనాపిల్–1, బెల్లం– అరకిలో, కరివేపాకు–ఒక రెబ్బ, ఎండు మిరపకాయలు–5, కొబ్బరికాయ–1, ఆవాలు– అర చెంచా, పసుపు– అర చెంచా, జీలకర్ర–1 చెంచా, ఉప్పు– తగినంత



తయారుచేసే విధానం :
పైనాపిల్ చెక్కుతీసి చక్రాలుగా తురుముకోవాలి. ఓ పాత్రలో కొంచెం నీరుపోసి అందులో ముక్క లను వేసి సన్నని మంట మీద ఉడికించండి. అందులో పసుపు, కారం ఉప్పు వేయండి. బెల్లం సన్నగా తురమండి. కొబ్బరి కోరులో జీలకర్ర, ఆవాలు కలిపి మెత్తని ముద్దగా నూరండి. ఎండు మిరపకాయలను విడిగా నూరి ముద్ద చేసుకోండి. ఉడుకుతున్న పైనాపిల్ ముక్కలు మొత్తబడగానే బెల్లం వేసి గంటెతో కలుపుతూ ఉండండి. ద్రావణం చిక్కబడుతుండగా కొబ్బరి ముక్క ఎండు మిర్చి ముద్ద, కరివేపాకు వేసి బాగా కలిపి దించండి. సిద్ధమైన పైనాపిల్ పచ్చడిని బ్రెడ్‌టోస్టుతో కలిపి వడ్డించండి.

దానిమ్మ పచ్చడి

కావలసిన పదార్థాలు: దానిమ్మగింజలు – అరకప్పు, (వేయించి పొట్టు తీసినవి) పల్లీలు – 1 కప్పు, పచ్చిమిర్చి – 3, వెల్లుల్లి రేకలు – 2, మినప్పప్పు – 1 టీ స్పూను, ఉప్పు – రుచికి తగినంత, నూనె – 1 టీ స్పూను, తాలింపు కోసం: ఆవాలు, జీలకర్ర, మినప్పప్పు, కరివేపాకు, ఎండుమిర్చి, నూనె – సరిపడా.



తయారుచేసే విధానం :
కొద్దిగా నూనెలో మినప్పప్పు, పచ్చిమిర్చి రెండు నిమిషాలు వేయించి చల్లారనివ్వాలి. మిక్సీలో మినప్పప్పు, పల్లీలు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, దానిమ్మగింజలు, ఉప్పు ఒకటి తర్వాత ఒకటి గ్రైండ్ చేయాలి. తర్వాత విడిగా తాలింపు పెట్టుకుని దానిమ్మ మిశ్రమంలో కలపాలి.

చిటికెలో రెడీ...



- అనుకోకుండా ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లాల్సి వస్తే ఇంట్లో చక్కటి ఫేషియల్ తయారు చేసుకోవచ్చు. ఒక గిన్నెలో రెండు టీ స్పూన్ల నారింజ రసం. ఒక టీ స్పూన్ పెరుగు తీసుకుని బాగా కలపాలి. ఆ మశ్రమంతో ముఖానికి ప్యాక్ వేసుకొని, 15 నిమిషాల తర్వాత తడి గుడ్డతో తుడిచేసుకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే చర్మం కాంతివంతంగా తయారవుతుంది.
- ఇంట్లోనే జుట్టుకు కండీషనర్ తయారు చేసుకోవడం చాలా సులువు. ఒక ఇనుప పాత్రలో అరకప్పు కాఫీ పొడి, అరకప్పు హెన్నా పౌడర్ తీసుకొని వాటికి నిమ్మరసం కానీ పెరుగు కానీ కలుపుకొని పేస్ట్‌లా చేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని తలంటు స్నానం చేసిన మరుసటి రోజు మాడుకు, జుట్టుకు అప్లై చేసుకొని, అది పూర్తిగా ఆరిపోయాక కడిగేసుకోవాలి. అలా చేస్తే చుండ్రు సమస్య పోవడంతో పాటు జుట్టు ముదురు రంగులో నిగారిస్తుంది.
- తరచూ పెదాలు పగులుతూ, అందంగా కనిపించట్లేదని బాధపడేవారికి ఈ చిట్కాతో మంచిఫలితం దక్కుతుంది. చిన్న పాత్రలో అర టీస్పూన్ నిమ్మరసం, అరటీస్పూన్ ఆముదం, అర టీస్పూన్ గ్లిజరిన్ వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని చిన్న డబ్బాలోకి తీసుకొని ప్రతిరోజూ పెదాలకు రాసుకుంటే పగలకుండా ఉంటాయి. దాంతో మీ పెదాలు అందంగా తయారవుతాయి.

❖

తియ్యతియ్యని తేనె



- పురుగు కాటుతో వచ్చే దురదలను తేనె తగ్గిస్తుంది. కాబట్టి చర్మంపై దురద ఉన్న చోట తేనె పూయాలి.
- తేనె సర్వరోగ నివారిణి కూడా! దీన్ని పై పూతగా, ఆహారంగా కూడా తీసుకోవచ్చు.
- తేనెలోని 'పైనోసెంబ్రిన్' అనే యాంటీ ఆక్సిడెంట్ మెదడు పనితీరు పెంచుతుంది.
- తేనె, అల్లం రసం కలిపి తాగితే దగ్గు, జలుబు తగ్గుతాయి.
- తేనెను జాగ్రత్తగా భద్రపరిస్తే ఎంత కాలమైనా చెక్కు చెదరదు. తేనెలో సహజ సంరక్షకాలు (ప్రిజర్వేటివ్స్) ఉంటాయి. అవి తేనెను ఎప్పటికీ తాజాగా ఉంచుతాయి.
- దెబ్బలు, కాలిన గాయాలకు తేనె పూస్తే త్వరగా నయమవుతాయి. అక్కడి చర్మం మచ్చపడకుండా ఉంటుంది.
- గోరువెచ్చని నీళ్లలో చెంచా తేనె కలుపుకుని తాగితే అలసట తీరి తాజాగా తయారవుతాం.
- తేనె అరుగుదలను పెంచుతుంది. సుష్టుగా భోంచేసినప్పుడు అజీర్తి ఇబ్బంది పెట్టకుండా ఉండాలంటే గ్లాసు నీళ్లలో ఒక చెంచా తేనె కలుపుకుని తాగాలి.
- తేనెను నీళ్లలో కలుపుకుని తాగితే సన్నబడతాం. కానీ, లావు అవ్వాలంటే తేనెను పాలలో కలుపుకుని తాగాలి.
- తేనె తింటే ఎక్కువ శక్తితో, ఎక్కువ సేపు పరిగెత్తగలం. ఇందుకు కారణం దీన్లోని సహజపిండి పదార్థాలే!

❖

ఇట్లచేద్దాం



నిద్రలో పెదాలు ఎండిపోయే అవకాశం ఎక్కువగా ఉంది. కాబట్టి, ప్రతి రోజు రాత్రి నిద్రపోయే ముందు పెదాలను హైడ్రేట్ లేదా మాయిశ్చరైజ్ చేసుకోవడం మంచిది. మీకు నచ్చిన లిప్‌బామ్ లేదా పెట్రోలియం జెల్లీని అప్లై చేసుకుని రాత్రంతా అలాగే ఉండనివ్వండి. ఇలా చేస్తే పెదాలు మృదువుగా మారతాయి.



'ఇప్పటిదాకా అణచివేత, వివక్షల గురించి మాట్లాడుకున్నాం. రాసుకున్నాం. కానీ ఇకనుంచైనా ధిక్కార స్వరాల గురించి మాట్లాడుకుందాం, ముళ్లకంపలను చీల్చుకుంటూ దారులేసిన మార్గదర్శకుల గురించి రాసుకుందాం. స్ఫూర్తి పొందుతూ... మన సామర్థ్యాన్ని మరింత పెంచుకుందాం' అంటోంది పాకిస్తాన్ కళాకారిణి మలీహా అబ్బాస్ అబీదీ. స్వతహాగా కళాకారిణి అయిన.. మలీహా ఇటీవలే రచయితగా మారింది. పాకిస్తాన్‌లో ధైర్యవంతులైన మహిళల జీవితగాథలతో 'పాకిస్తాన్ ఫర్ ఉమెన్' అనే పుస్తకాన్ని తీసుకొచ్చింది.


మహిళా స్వరం... మలీహా!

'పాకిస్తాన్ అనగానే అందరికీ... తక్కువ శక్తిసామర్థ్యాలున్న చిన్న దేశంగా కనిపిస్తుంది. కానీ... పాకిస్తానీగా నా దేశపు శక్తి నాకు తెలుసు. దానికున్న నైపుణ్యం, ఆకాంక్షలు, ఇక్కడ ప్రజల శక్తిసామర్థ్యాలు అన్నీ. అన్ని దేశాల్లో మహిళల్లాగే పాకిస్తాన్‌లో మహిళలు కూడా. ఎన్ని ఆంక్షలున్నా, ఎన్ని అడ్డంకులెదురైనా అన్నింటినీ దాటి... దారులేసిన నాయకులున్నారు. సృజనకారులైన రచయిత్రులు న్నారు. మేధోశక్తి ఉన్న పరిశోధకులు న్నారు. వాళ్లందరి కథలు చెప్పాలనిపించింది' అని అంటోంది మలీహా.



బామ్మ ప్రభావం: ఆ పుస్తకంలోని మహిళల్లాగే... మలీహా కథ కూడా ఆసక్తికరమైనదే. పాకిస్తాన్ నుంచి యూకేవరకు ఆమె చేసిన ప్రయాణం... రచయితగా, చిత్రకారిణిగా, విద్యార్థినిగా కొన సాగింపు చెప్పుకోదగినది. తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు. సింధ్‌లో పెరిగింది. పెద్ద కుటుంబం. చిన్నతనం నుంచే ఆమెను అన్ని విషయాల్లో భాగస్వామిని చేశారు. దాంతో బాధ్యత తెలిసొచ్చింది మలీహకు. బామ్మ ప్రభావం ఆమెపై చాలా ఉంది. ఎప్పుడూ నవ్వుతూ ధైర్యంగా ఉండే ఆమె... క్యాన్సర్‌తో పోయింది. తన చుట్టూ ఉన్న.. తను చూసిన ఎందరో స్ఫూర్తిమంతులైన మహిళల గురించి మనవరాలుకు చెప్పేదామె. అందుకే 'నేనిలా ఉన్నానంటే.. దానికి కారణం బామ్మే' అంటుంది మలీహ.

నాన్న స్ఫూర్తి : విజయవంతమైన ప్రతి మగాడి వెనుక... ఓ మహిళ ఉంటారనేది పాత సామెత. కానీ... మా కుటుంబంలో అలా కాదంటుంది. ఎందుకంటే తండ్రివల్లే తాను ఫెమినిస్ట్‌ను కాగలిగానని చెబుతుంది. ఆయన చాలా కష్టపడి ఎదిగొచ్చిన మనిషి. సృజనశీలి. తను కలుగచేసుకోకపోయినా.. కూతురి ప్రతి పనిలో ఆయన ప్రభావితం చేశాడు. అందుకే తన ఆలోచనలన్నీ నాన్న స్ఫూర్తేనంటుంది. యూకేలోని సజెక్స్ యూని వర్సిటీలో న్యూరోసైన్స్‌లో చదువుతున్న మలీహా.. చిత్రకారిణిగా... మహిళలు, లైంగిక హింస, మానసిక ఆరోగ్యం, మహిళల హక్కులపైనే ఎక్కువగా కేంద్రీకరిస్తుంది. తన పుస్తకంలోని చిత్రాలన్నీ తను గీసుకున్నవే కావడం విశేషం.



భారత్‌తోనూ అనుబంధం : ఇక ఈ పుస్తకం రాయడం కోసం ఆమె కొన్ని ఇంటర్వ్యూలు చేసినప్పుడు... వాళ్ల కథలు విని ఏడ్చింది. ఆమె పుస్తకంలో అసాధారణమైన మహిళలున్నారు. అన్నీ పోగొట్టుకుని ఫీనిక్స్‌లాగా ఎదిగొచ్చినవాళ్లున్నారు. 'పాకిస్తాన్‌లో పుట్టినందుకు నేనెంతో గర్వంగా ఫీలవుతాన'ని చెప్పే మలీహ.. ఉద్యమకారిణి వీరూ కోహ్లీ, మౌంట్ ఎవరెస్ట్ ఎక్కిన మొట్టమొదటి పాకిస్తానీ మహిళ సమీనా బేగ్ గురించి కూడా రాసింది. తన పుస్తకం ద్వారా పాకిస్తాన్ మహిళల మరో కోణాన్ని ప్రపంచం చూడగలుగుతుందని చెబుతుంది.

అయితే ఆమె కేవలం పాకిస్తాన్‌కే పరిమితం కాలేదు. ఇండియాపైన ప్రేమ ఉంది. మలీహ తండ్రి పుట్టిందిక్కడే. విభజన తరువాత పాకిస్తాన్‌కు వెళ్లిపోయారు. అయినా తన మీద భారతదేశం ప్రభావం చాలా ఉంటుందని చెబుతుందామె. అందుకే భారతదేశంలో మహిళల గురించి మరో పుస్తకం తీసుకురానుంది. అలాగే దక్షిణాసియాలోని బంగ్లాదేశ్, శ్రీలంకలోని మహిళలపైనా దృష్టి సారిస్తున్నది.

❄

బట్టలే కాకుండా...



వాషింగ్ మెషిన్‌ను మనం బట్టలు ఉతకడం కోసం మాత్రమే ఉపయోగిస్తాం. అయితే బట్టలే కాకుండా ఇంకొన్ని వస్తువులు కూడా మనం వాషింగ్ మెషీన్‌లో శుభ్రపరచవచ్చు.

- క్రీడాకారులకు స్పోర్ట్స్ గేర్ గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆటలాడేటప్పుడు వీటిని ధరించడంతో చెమట, దుమ్మూధూళి పట్టుకుని ఉంటుంది. అలాంటి వాటిని తుడిచివేస్తే శుభ్రం కావు. కచ్చితంగా ఉతకాల్సిందే. ఆ గేర్‌ను మెషకవర్‌లోగానీ, పిల్లో కవర్‌లో గానీ వేసి... వాషింగ్ మెషీన్‌లో వేసి శుభ్రం చేయాలి. పిల్లో కవర్ దానికి ఎలాంటి డ్యామేజ్ కాకుండా కాపాడుతుంది. స్పోర్ట్స్ గేర్ శుభ్రమవుతుంది. కాకపోతే మైల్డ్ సోప్‌ను ఉపయోగించాలి. సైకిల్ నెమ్మదిగా తిరిగేట్టు చూసుకోవాలి.
- ఇప్పుడు ప్లాస్టిక్ మీద నిషేధం కొనసాగుతోంది. దాంతో జూట్ లేదా బట్ట సంచులు ఉపయోగిస్తున్నారంతా. కూరగాలు తెచ్చిన తరువాత, లేదంటే ఉపయోగించిన తరువాత అవి దుమ్ముబారిపోతాయి. అలాంటి వాటిని చేతులతో కాకుండా.. వాషింగ్ మెషీన్‌లో వేయొచ్చు.
- కిచెన్ యాక్సెసరీస్ అంటే. ఓవెన్‌కోసం ఉపయోగించే గ్లౌజులు, క్లీనింగ్ మ్యాట్స్, రబ్బర్ చాపర్ బేస్, ఇతరత్రా ఉంచే బ్యాగులన్నింటినీ వాషింగ్ మెషీన్‌లో వేసి ఉతికేయొచ్చు. యోగా మ్యాట్స్‌ను కూడా మెషీన్‌లో సులభంగా ఉతకొచ్చు. అయితే అవొక్కటే కాకుండా... కొన్ని టవల్స్ కూడా వేసి.. నెమ్మదిగా తిరిగేలా చూసుకోవాలి. వేడి నీటిని అస్సలు ఉపయోగించొద్దు. కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లకు మౌస్‌ప్యాడ్స్ ఉంటాయి. అవి కూడా తొందరగా మాసిపోతాయి. వాటిని కూడా మెషీన్‌లో ఉతకొచ్చు. అయితే వీటికి వేడి నీటిని వాడినా ఇబ్బందే ఉండదు.
- స్నీకర్స్.. అవేనండి కాన్వాస్ షూస్. వాటిని ఉతకడం అనేది పెద్ద టాస్కే చాలా మందికి. వీటిని వాషింగ్ మెషీన్‌లో చల్లని నీళ్లతో ఉతికితే సరిపోతుంది. అయితే వాటితోపాటు కొన్ని టవల్స్ వేసి... డెలికేట్ మోడ్‌లో పెట్టి మరీ ఉతకాలి సుమా! బేస్‌బాల్ క్యాప్, తలకు పెట్టుకుని క్యాప్ వంటివి కూడా మెషీన్‌లో ఉతికేయొచ్చు.

❄

మానవి మీ స్పందన

'మానవి' పేజీలు మీకెలా ఉన్నాయి? ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? మీ కుటుంబ సభ్యుల, మిత్రుల స్పందన ఎలా ఉంది? 'నవతెలంగాణ' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు ఇ-మెయిల్ navamaanavi@gmail.com కు తెలియ జేయండి.

మా చిరునామా
మానవి, నవతెలంగాణ దినపత్రిక
ఎం.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, 1-8-664, అజామాబాద్, ఆర్.టి.సి. కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 020. లేదా 94900 99016కు ఫోన్ చేయండి. ఇప్పటికే మా ప్రయత్నాలను అభినందిస్తూ స్పందిస్తున్న వారికి కృతజ్ఞతలు.



తాత్కాలిక ఉపశమనం కాదు! శాశ్వత నివారణోపాయం కావాలి!!



దివికుమార్

ఈ నెల మొదటివారంలో ప్రధాని నరేంద్రమోడీ రిజర్వేషన్ల దాడి (ప్రతిపక్షాలపై సర్జికల్ స్ట్రైక్) చేయటానికి ముందే వెలువడిన జనవరి 'ప్రజాసాహితి' సంపాదకీయంలో వాక్యాలను ఒక్కసారి గుర్తుచేస్తాను. "దళితులకు కేటాయించిన రిజర్వేషన్లతో వారి నిరుద్యోగ సమస్య పరిష్కారమైనట్టేనని ప్రచారం చేసిన పాలకవర్గాలే, అగ్రకులాలలోని మధ్యతరగతి ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యకు దళితులకిచ్చిన రిజర్వేషన్లే కారణమన్నట్టు చెప్పారు. నిజానికి రిజర్వేషన్లనేవి ఉద్యోగావకాశాలను పెంచవు. పంచుతాయి. అంతవరకే! నిరుద్యోగానికి మూలకారణమైన వ్యవసాయ - పారిశ్రామికరంగాల సంక్షోభాన్ని పరిష్కరించకుండా, ప్రశ్నించే యువతరాన్ని పక్కదారి పట్టించే ప్రచారాలకు ఒడిగడుతున్నారు. ఇపుడు కులాలవారీ రిజర్వేషన్లే పరిష్కారమన్న భ్రమల్ని పాలకపక్షాలే పెంచిపోషిస్తున్నాయి. తద్వారా కులాల కుంపట్లను రాజేసి, తమతమ కులస్తులు మాత్రమే అణగారి పోతున్నట్టు మిగిలిన అందరూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నట్టు భ్రమాత్మక భావాలను పోషిస్తున్నారు."

గడిచిన 20 సంవత్సరాలుగా చట్టసభలలో మహిళా రిజర్వేషను (33%) గురించి ప్రతి ఎన్నికల ముందూ పాలక వర్గాలు వాగ్దానాలు గుప్పిస్తూనే వున్నాయి. దాని ఆమోదానికి పార్లమెంటులో బిల్లు రూపంలో ప్రవేశపెట్టే పది సంవత్సరాలు పైనయింది. కానీ దానికి అతీగతీ లేకుండా నేలమాళిగలో వుంచేశారు. 41/2 సంవత్సరాలపాటు ఊసెత్తకుండా, పార్లమెంటు సమావేశాల ఆఖరిరోజున, అకస్మాత్తుగా ప్రస్తుతం అమలులో వున్న రిజర్వేషన్ల పరిధి వెలుపలనున్న ఆర్థిక బలహీన వర్గాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ మెరుపు వేగంతో, బిల్లు రూపంలో ప్రవేశపెట్టిన వెంటనే కేవలం 2 రోజులలో చట్టంగా ఆమోదించారు. వెలుపల సమాజంలో చర్చకే కాదు పార్లమెంటులో కూడా చర్చకు కనీస అవకాశాన్ని యివ్వకుండా హడావుడిగా పని కానిచ్చేశారు. ఈ చట్టం సుప్రీంకోర్టు గతంలో యిచ్చిన తీర్పుల ప్రకారం, రాజ్యాంగ రూపకర్తల ఆదేశిక సూత్రాల ప్రకారం చెల్లదని అనేకమంది అభిప్రాయపడుతున్నారు. అయినా మోడీ ప్రభుత్వ తక్షణ లక్ష్యం అది ఆమోదం పొందటంకాదు, నాలుగు నెలల్లో రానున్న పార్లమెంటు ఎన్నికలలో అగ్రకులాలు అనుకునేవారిని దీని సాకుతో తమ వెనుక ఓటు బ్యాంకుగా నిలబెట్టుకోవటం ద్వారా గెలుపును సాధించటం!

రిజర్వేషన్ల ద్వారా ఉపాధికల్పన అనేది - వంద ఉద్యోగాలకు వందమంది ఉద్యోగార్థులే వుంటే పంపిణీ సమస్య వుండదు. కానీ నిరుద్యోగసమస్య ఎంత తీవ్రంగా వుందో మొహాన గుద్దినట్టుండే ఒక్క ఉదాహరణ చూద్దాం. మూడేండ్లక్రితం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 386 ప్యూన్ పోస్టుల భర్తీకోసం ప్రకటన యిస్తే 23 లక్షలమందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అందులో 255 మంది పీహెచ్‌డీలు, 2 లక్షల 22 వేలమంది ఇంజనీర్లు వున్నారు. పై ఉద్యోగానికి కావాల్సిన కనీస అర్హత 5వ తరగతి చదివి వుండటం, సైకిల్ తొక్కటం వచ్చి వుండటం. లభించే నెల జీతం రూ. 16,000 అత్యంత తీవ్రమైన పై పోటీలో ప్యూను ఉద్యోగం పొందినవారి సంతానం, అంతకు 4 రెట్లు (8 లక్షల రూ॥లు) ఆర్థిక స్థితిమంతుల బిడ్డలతో పోటీపడి ఉద్యోగం పొందే ఏర్పాటును ప్రస్తుత 10% కోటా చట్టం యిస్తోంది. 5 ఎకరాల భూమి, వెయ్యి చదరపు అడుగుల యిల్లు, 8 లక్షల రూ॥ల వార్షిక ఆదాయానికి లోబడినవారందరూ 10% కోటా పరిధిలోకి వస్తారు. ఇది వెనుకబడిన గ్రామీణుల అవకాశాలను కుదించే వివక్షను చట్టబద్ధం చేసినట్టవుతుంది. రూ.8 లక్షల వార్షికాదాయం ఆర్థిక బలహీనతను కొలిచే ప్రమాణమయినప్పుడు, ఈ తరహా బలహీనుల నుండి (నెలకు 66 వేల రూ॥ల ఆదాయం కంటే తక్కువ వున్నవారి నుండి) ఆదాయం పన్ను వసూలు చేయటంలో ఔచిత్యమేముంటుంది?

ఇటీవలి భారత లేబర్ బ్యూరో 5వ వార్షిక నివేదిక (2015-16) ప్రకారం నెలకు 50 వేల రూ॥ల నుండి ఒక లక్ష రూ॥ల దాకా ఆదాయం కలవారు (పల్లెలు + పట్నాలు కలుపుకుని) ఒక వెయ్యిమందికి 18 మంది మాత్రమే! అంటే సంవత్సరానికి 6 లక్షల నుండి 12 లక్షల రూ॥ల ఆదాయంకలవారన్నమాట. దీన్ని ప్రస్తుత 10 శాతం కోటా చట్టం విధించిన పరిమితికి సమన్వయిస్తే దేశంలో నూటికి 99 మంది వార్షిక ఆదాయం 8 లక్షల రూ॥ల కంటె తక్కువని తేలుతుంది. అత్యధిక సంపన్నులయిన తొమ్మిదిమంది మొత్తం దేశ సంపదలో సగంకంటే ఎక్కువ అనుభవిస్తున్నారనీ, ఒక్కశాతం ధనస్వాముల మొత్తం సంపద పెరుగుదల ఒక్కరోజుకి 2200 కోట్ల రూపాయలనీ, గడిచిన సంవత్సరంలో ఈ ఐశ్వర్య వంతుల సంపద 39 శాతం వృద్ధిచెందితే, మొత్తం జనాభాలో సగంమంది పేదల సంపద నూటికి 3 వంతులు మాత్రమే పెరిగిందనీ ఇటీవలే (23 జనవరి 2019) "ఆక్స్‌ఫాం" (ప్రపంచ ఆర్థిక వేదిక) ప్రకటించింది. సుమారు 14 కోట్ల నిరుపేద జనాభా (10 శాతం) గడిచిన 15 సంవత్సరాల కాలంలో అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉక్కిరిబిక్కిరవుతూ దుర్భర జీవితాల్ని గడుపుతున్నట్టు కూడా 'ఆక్స్‌ఫాం' చెప్పింది. అదే పైశ్రేణి 10 శాతం వారి సంపద 77 శాతం పేదవర్గాల మొత్తం సంపదతో సమానంగా వున్నట్టు కూడా అదే నివేదిక ప్రకటించింది. 10శాతం కోటా రిజర్వేషను ప్రకారం, ముస్లిములతో సహా అగ్రకులాల వారిలో గల నిరుపేద, పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలు నెలకు రూ.50 వేలకుపైగా ఆదాయం పొందే కుటుంబాల బిడ్డలతో పోటీపడి విద్య, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నమాట! ఇదెంత హాస్యాస్పదం!!

పోనీ ఉపాధి అవకాశాలేమయినా ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయా అంటే.... సరిగ్గా అవి వెనక్కి ప్రయాణిస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యసంస్థ (ఐఎంఎఫ్) ఆదేశాల ప్రకారం ప్రభుత్వ రంగంలో విద్య, ఉపాధి అవకాశాలను ఘోరంగా కత్తిరించిపారేశారు. ఉద్యోగాల కల్పన ఎంత అన్న సంగతి అలా వుంచినా ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు లేవు. కేవలం కేంద్ర ప్రభుత్వ రంగంలో 60 లక్షల ఉద్యోగాలు ఖాళీగా వున్నా భర్తీచేయటం ఆపేశారు. పెద్దనోట్ల రద్దు తర్వాత, జీఎస్టీ అమలు ఫలితంగా 35 లక్షల ఉద్యోగాలు నష్టపోయినట్లు పారిశ్రామిక వర్గాలే ప్రకటిస్తున్నాయి. కనుక.... సారాంశంలో లేని ఉద్యోగాలకు, వందమంది నిరుద్యోగులలో ఒక్కరికి కూడా రాని ఉద్యోగాలకు నిర్దాక్షిణ్యమైన పోటీలుపడి, ఆదాయం, కులం సర్టిఫికెట్లకు లంచాలు పోసి ప్రవేశ పరీక్షలకు వేల - వేల రూపాయల ఫీజులకు తగలేసి, పొరపాటున ర్యాంకు తెచ్చుకున్నా, లక్షల రూ॥ల లంచాలు సమర్పించు కుంటేగాని రాని ఉద్యోగాలపేరుతో పాకులాడుతున్న హైడ్రామా, ఈ రిజర్వేషన్లు. నిన్న రైల్వేశాఖలో ఉద్యోగాల గురించి ఓ ప్రకటన వెలువడింది. మొత్తం ఉద్యోగాలలో (15 లక్షలు +) సుమారు 19 శాతం (2.82 లక్షలు +) ఖాళీలుండగా, వీటికి తోడు రెండేండ్లలో 99000 మంది రిటైర్ అవుతుండగా, ఒక లక్షా 31 వేల పోస్టులు త్వరలో భర్తీ చేయనున్నామని ప్రకటించారు. నిజంగానే ప్రకటించినమేరకు భర్తీచేసినా ఇంకా భర్తీచేయవలసిన ఉద్యోగాలు మిగిలే వుంటాయి. అదే ప్రకటనలో వున్నట్టు రెండేండ్లలో మరో లక్ష భర్తీ చేసినా లక్షన్నర ఖాళీ ఉద్యోగాలు అలాగే వుండిపోతాయి. కొత్త ఉద్యోగాల కల్పన సంగతి అలా వుంచి పదవీ విరమణ పొందినందువల్ల ఏర్పడిన ఖాళీ పోస్టులను కూడా పూర్తిగా భర్తీ చేయటానికి ఈ పాలకులు సిద్ధంగా లేరు అన్నది స్పష్టం.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో కార్మికుల సంఖ్య 2014 నుండి 2018 మధ్య 12.8 లక్షల నుండి 10.9 లక్షలకు దాదాపు 13 శాతం తగ్గిపోయింది. కాగా అదే కాలంలో తాత్కాలిక కార్మికుల సంఖ్య 3.3 లక్షల నుండి 3.8 లక్షలకు పెరిగింది. మొత్తం కార్మికుల్లో వీరి శాతం 26 నుండి 35 శాతానికి పెరిగింది. ప్రభుత్వరంగంలోనే ఉద్యోగాలను తగ్గించే, ఏ రకపు రిజర్వేషన్లు రక్షణలూ వర్తించని ఉద్యోగులను పెంచుతూ వస్తున్న గత కాంగ్రెసు పాలనలోలాగే నేటి బీజేపీ కూడా ఆర్థిక బలహీనవర్గాలకు రిజర్వేషన్లపేరిట మరో వంచనకు తెరలేపింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ 2014 ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసిన బీజేపీ నేత నరేంద్రమోడీ, తన ప్రభుత్వ వైఫల్యాలకు జవాబు యిచ్చుకోలేని స్థితిలో, దాన్ని కప్పిపుచ్చుకోవటానికి విసిరిన ఎన్నికల వల - ఈ 10% రిజర్వేషన్లు. దీనివల్ల అగ్రకులాలు, ముస్లిములలో గల నిజమైన పేద - మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు లభించే అవకాశాలు చాలా తక్కువ. ఉన్న ఉద్యోగాలన్నీ ఆయా కులాల, వర్గాలవారీ దామాషా ప్రకారం పంపిణీ చేసినా, నేటి నిరుద్యోగ సంక్షోభానికి అసమానతలను పెంచే ఈ వ్యవస్థలో నివృత్తి లేదు. పెచ్చరిల్లుతున్న ఆర్థిక అసమానతలను అగ్రకులాలతో సహా మొత్తం పేద, మధ్యతరగతివర్గాల విద్యార్థి యువజనులు ప్రశ్నించకుండా, అందుకు కారకులైన దోపిడీ పాలక వర్గాలను నిలదీయకుండా ఈ సమస్యకు నిజమైన పరిష్కారానికి దారి ఏర్పడదు.

సెల్ : 9440167891

లఘు పరిశ్రమలకు ప్రభుత్వం మొండి చేయి




సి.కనకదుర్గ

మన దేశంలో దాదాపుగా పన్నెండు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న లఘు పరిశ్రమలు గాలిలో పెట్టిన దీపం వలే విలవిల్లాడడం దురదృష్టం. వీటిపై ఆధారపడి జీవిస్తున్న వారి ఆర్థిక భద్రత అగమ్యగోచరంగా తయారైంది. మౌలిక సమస్యలైన రుణ సదుపాయం, విపణితో అనుసంధానం, ఆధునిక పరిజ్ఞానం అలభ్యత, నిపుణత కలిగిన కార్మికుల కొరత, వ్యవస్థాగత సహకారం కొరవడడంతో లఘు పరిశ్రమలు అభివృద్ధిలో తిరోగమనం వైపు మళ్లి ఎన్నో ఆధారపడిన జీవితాలను రోడ్డుకెక్కించాయి. మూలిగే నక్కపై తాటిపండులా పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, వంటి కారణాల వలన ఈ అదనపు భారాన్ని మోయలేక చిన్న పరిశ్రమలు కుదేలైపోయాయి. ఎన్నో కమిటీలు సిఫారసులు చేసిన మీదట కూడా బ్యాంకుల నుండి చిన్న పరిశ్రమలకు లభించే రుణాలు ఎండమావిని తలపిస్తున్నాయి. మన దేశం లఘు పరిశ్రమల అభివృద్ధి అనే మాటలతోనే మీనమేషాలు లెక్కిస్తూ కాలయాపన చేస్తుంటే, వాటి ఉత్పత్తులను అంతర్జాతీయ విఫణిలో చౌకగా లభింపజేస్తూ జపాన్, జర్మని, కొరియా దేశాలు దూసుకుపోతున్నాయి. కార్పొరేట్లకు, బడా పారిశ్రామిక వేత్తలకు ఎర్ర తివాచీలు పరిచి అనేక రూ.వేల కోట్లను అనేక కారణాలతో ధారాదత్తం చేస్తున్న మన ప్రభుత్వాలు లఘు పరిశ్రమలను ఆదుకోవడంలో తీవ్ర అలక్ష్యం చూపిస్తున్నాయి. మన దేశ జనాభాలో యువత శాతం ఎక్కువగా వుందన్నది నిర్వివాదాంశం. ముఖ్యంగా గ్రామీణ యువత అయితే అవగాహనా రాహిత్యం, సరైన శిక్షణ, ముందు చూపు లేకపోవడం, నిరక్షరాస్యత, ప్రభుత్వం నుండి ప్రోత్సాహం కరువవడంతో సరైన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. వారిని ప్రోత్సహించి, లఘు పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ ఇస్తే దేశంలో విజృంభిస్తున్న నిరుద్యోగ సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చు. అమెరికా, కెనడా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఇంగ్లండ్ వంటి దేశాలు లఘు పరిశ్రమల అభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాయి. అదే మన దేశానికి వస్తే, వీటి అభివృద్ధికి 45 లక్షల కోట్ల నిధులు అవసరమైతే, బ్యాంకుల నుండి అందులో అందే రుణం 18 శాతంలోపే వుండడం, వీటి అభివృద్ధి పట్ల ప్రభుత్వాలకు ఎంత చిత్తశుద్ధి వుందో తెలియజేస్తోంది. హస్త కళలు, జనపనార వస్తువులు, పాద రక్షలు, ఆట వస్తువుల తయారీలో గ్రామీణ యువతకు శిక్షణ అందించి రుణ సదుపాయం కలుగజేస్తే మన దేశం ఆర్థికంగా మంచి పురోభివృద్ధి సాధించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి.

సెల్ : 7674887456

మోడీ రూలింగ్ - మేడ్ ఇన్ కార్పొరేట్స్



ఎం.చుక్కయ్య

కేంద్రంలో మరో 3 నెలలు మాత్రమే అధికారంలో వుండే మోడీ ప్రభుత్వం 2019-20 మొత్తం బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం ఆశ్చర్యకరం. ఇది యావత్ భారత ప్రజానీకాన్ని మోసం చేయడమే! లోక్ సభ ఎన్నికల తరువాత వచ్చే ప్రభుత్వం ఆ బాధ్యతను నెరవేర్చాలి. కానీ మోడీ ప్రభుత్వం చేస్తున్నదేమిటి? అసలు మోడీ అధికారంలోకి వచ్చిన ఈ మొత్తం కాలాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఆయన కార్పొరేట్ శక్తుల కు ఎలాంటి అండదండలు ఇస్తున్నారో అర్థం చేసుకోవడం పె ద్ద కష్టం కాదు. రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసారు. సంఘ్‌పరివార్ శక్తుల ద్వారా మతోన్మాదాన్ని సర్వాంతర్యామిగా మార్చేస్తున్నారు. ప్రశ్నించే గొంతుల్ని సంఘ్‌పరివార్ శక్తులు కాల్చివేతలకు, బెదిరింపులకు గురిచేస్తున్నాయి. అర్బన్ నక్సల్స్, దేశద్రోహుల పేరుతో కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తున్నారు. దేశాన్ని తన గుప్పిట్లో పెట్టుకోవడానికి శతవిధాల ప్రయత్నిస్తూ పరిస్థితిని అప్రకటిత ఎమర్జెన్సీగా మార్చేశారు. తన అను యాయ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను మాత్రమే కాపాడు తూ, అసంఖ్యాకులైన అసంఘటిత కార్మికులను, నిరుద్యోగుల ను, రైతులను, వ్యవసాయ కూలీలను, మహిళలను, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను కుదేలు చేశారు. బహుముఖ వ్యూ హంతో ప్రపం చీకరణ విధానాలను తు.చ. తప్పకుండా అమలు చేస్తూ దేశా న్ని కార్పొరేట్ శక్తులకు స్వర్గధామం చేస్తు న్నారు. పై విషయాల వెలుగులోనే గత బడ్జెట్‌లను నెమరవేసుకోవాలి.

కేంద్ర బడ్జెట్ బండారం

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ఏటా అమలు చేయాలంటే 80వేల కోట్ల రూపాయలకు పైగానే కావాలి. కాని ఈ బడ్జెట్‌లో 60వేల కోట్లే కేటాయించారు. గత బడ్జెట్‌లో 55వేల కోట్లే కేటాయించారు. వ్యవసాయ కూలీలు పోరాడి సాదించుకున్న ఉపాధి హామీ పథకంపట్ల బీజేపీ ప్రభుత్వం మొదటి నుండీ సవతి తల్లి ప్రేమనే ప్రదర్శిస్తోంది. 2019-20 సం॥ బడ్జెట్‌లో కేంద్రం గోసంరక్షణకు 750 కోట్లు కేటాయించింది. దీని ముద్దుపేరు రాష్ట్రీయ కామదేను అయోగ్. ఇదే సందర్భంలో అసంఘటిత రంగంలోని కార్మికుల పించన్‌లకు 500 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే బీజేపీ ప్రభుత్వ హయాంలో మనుషులకంటే పశువులకే విలువ ఎక్కువైంది. మధ్యతరగతి ప్రజల ఓట్లు దండుకు నేందకు కుటిల నీతిని ప్రదర్శించింది. ఇటీవల కేంద్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన ఇబిసి రిజర్వేషన్ (ఎకానమిక్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్)ల ఆర్థిక పరిమితి 8 లక్షలు విధించారు. కాని ఉద్యోగు ల ట్యాక్సుల పరిమితి 2.5 లక్షల నుండి 5 లక్షలకు పెంచారు. ఎందుకు ఈ వ్యత్యాసం? ఉద్యోగులకు కూడా ఇబిసి ఆర్థిక పరి మితిలాగానే ట్యాక్స్‌ల పరిమితిని 8 లక్షల వరకు పన్ను మిన హాయింపు ఇవ్వాలి. 2019-20 బడ్జెట్‌లో 15 మంది పారిశ్రా మికవేత్తలకు 3.5 లక్షల కోట్లు ఋణమాఫి చేసారు. రైతులకే మో ఏటా 6 వేలు (నెలకు 500, రోజుకు 17 రూపాయలు) మూడు దఫాలుగా ముష్టి వేస్తున్నారు. ఇదేనా రైతుల బడ్జెట్. రైతులకు మేలు చేస్తానని బడ్జెట్‌లో ప్రకటించారు. దీనికి 60 వేల కోట్లు కేటాయించారు. ఈ ధనం 12 కోట్ల రైతులకు వర్తిస్తుంది. కాని రాఫెల్ కుంబకోణంలో ఒక్క అనిల్ అంబానీకే 30 వేల కోట్లు అప్పనంగా కట్టబెట్టారు. అంబానీల మీద ఉన్న ప్రేమ రైతుల మీద లేదనడానికి ఇంతకన్న నిదర్శనం ఏమిటి?

2019-20లో ఆహార సబ్సిడీ 1,84,000 కోట్లు. గత బడ్జెట్‌లో 1,71,000 కోట్లు. అదనం 13వేల కోట్లే. అనిల్ అంబానీ ఆహారానికి 30వేల కోట్లు. పేదలకు పెద్దపీట వేయడం అంటే ఇదేనా..? అసలు దేశ జిడిపిలో అసంఘటిత కార్మికుల వాటా నేటికి 50%నికి పైబడే వుంది. వ్యవసాయ రంగం ద్వారా 17% వుంది. బడ్జెట్‌లో వీరికి కేటాయింపుల శాతాలను పరిశీలిస్తే ఆశ్చర్యమేస్తుంది. పెద్దనోట్ల రద్దుతో, జిఎస్టీ వలన మొదటిగ నష్టపోయింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలే. అంతేకాక ఈ పరిశ్రమల్లో పనిచేస్తు న్న కోట్లాది మంది కార్మికులు వీధుల పాలైనారు. పెద్ద నోట్ల రద్దు, జిఎస్టీ విధానం వలన లాభం చేకూరింది ఎవరికి? కేంద్ర ఆర్థిక మంత్రి 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం 80వేల కోట్లుగా ప్రకటించారు. ఇప్పటికే 35వేల కోట్ల విలువ వాటాలను అమ్మేసారు. దానికి ముందు 2017-18 లో లక్ష కోట్ల పిఎస్‌యు (పబ్లిక్ సెక్టార్ యూనిట్స్) వాటాలను అమ్మేసారు. అంతే గాక నాటి నుండి నేటి వరకు ఓ ఆర్థిక సర్వే ప్రకారం మొత్తం కార్పొరేట్ సంపన్నులకు గత రెండేండ్లలో 26 లక్షల 4 వేల 100 కోట్లు ఋణాలు ఇచ్చారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు 4,500 కోట్లు మాత్రమే ఋణాలు ఇచ్చారు. దీన్ని బట్టి మోడీ కార్పొరేట్ శక్తుల వైపా? చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి వైపా...? 2019-20లో బడ్జెట్‌లో చిన్న పరిశ్రమల ఊసే లేదు. ఒక వైపు ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అమ్మడం. రెండోవైపు కార్పొరేట్ శక్తులకు ఋణమాఫీ చేయడం, ఋణాలు ఇవ్వడం, కార్పొరేట్ మొండి బకాయిదారులను వెనుకవేసుకరావడం, ఇవన్నీ ఏమి తెలుపుతున్నాయంటే " మోడీ దారులన్ని కార్పొరేట్ శక్తుల బలోపేతం చేయడానికే..." 2019-20 బడ్జెట్ యావత్ దేశాన్ని ఉద్ధరించబోతుందని అన్ని వర్గాల ప్రజానీకాన్ని అభివృద్ధి దిశవైపు తీసుకెలుతుందని ఆస్థాన ఆర్థిక పండితులు తెగ పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. కాని ఇది ప్రజలను వంచించే బడ్జెట్, ఎన్నికల్లో ఓట్ల కొనుగోలుకు ఎరవేసే బడ్జెట్. మోడీ ఎరను మింగకండి, మోస పోకండి, నిజాలను విశ్లేశించండి, ప్రజలకు వాస్తవాలు చెప్పండి.


సెల్ : 9490300733

ఆదివాసీల అపురూప వేడుక నాగోబా దర్బార్



పెనుక ప్రభాకర్

ఆదివాసీ సంస్కృతి పెనవేసుకున్న అపురూపమైన వేడుక నాగోబా జాతర ఆదివాసీలు తమ ఆరాధ్యనీయమైన నాగోబాను అర్చిస్తూ ఎంతో ఘనంగా జరిపే ఈ పండుగ(జాతర) ప్రాచీనమైనది. ఎన్నో విశిష్టతలు కలిగినది. ప్రతి యేటా పుష్య మాసం రాగానే తెలంగాణలో ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఈ జాతర జరుగుతుంది. అప్పటి వరకు నిర్మానుశమైన అటవీ ప్రాంతం జాతర నిర్వహించే సమయంలో జనసంద్రమైపోతుంది. ఆదిమ గిరిజనుల్లో గోండు తెగకు చెందిన మేస్రం వంశస్తులు నాగోబాకు పూజలు నిర్వహిస్తున్నారు. వందల ఏండ్ల నుంచి ఈ సంప్రదాయం ఏ మాత్రం మార్పు లేకుండా కొనసాగుతూ ఉండటం విశేషం. ముఖ్యంగా తాతల సంప్రదాయం ప్రకారం నాగోబాను పూజిస్తే పంటలు సమృద్ధిగా పండుతాయని, శాంతి నెలకొంటుందని, రోగాలు మాటుమాయం అవుతాయని భక్తులు విశ్వసిస్తారు. మేస్రం వంశీయులు జాతరకు ముందు రోజు నాటికీ ఎక్కడెక్కడో ఉన్న వారంతా కేస్లాపూర్‌లో జమ అయి ఆలయం పక్కన విడిది చేస్తారు. తరువాత పరదన్, కాటోడాలు ఏడ్ల బండ్ల మీద ఊరూరు తిరిగి జాతరకు ఆహ్వానిస్తారు. తిరికొండకు వెళ్లి కమ్మరి వాళ్ల దగ్గర పూజల కుండలు సిద్ధం చేస్తారు. తిరుగు ప్రయాణంలో పౌర్ణమి రోజున కేస్లాపూర్‌లో పూజలు నిర్వహించి మడవి వంశం ఇంట్లో బస చేస్తారు. తదుపరి మేస్రం వంశస్తులు పవిత్ర గోదావరి జలాలను తీసుకురావడానికి కాలినడకన ఎనబై, తొంబై మైళ్లు నడిచి వెళ్తారు. సుమారుగా ఎనిమిది గ్రామాలలో బస చేసుకుంటూ వెళ్తారు. గోదావరి నదిలో పూజ నిర్వహిస్తారు. కాటోడ ఇంట్లో పూజలు నిర్వహించి కుండల్లో, పాత్రల్లో గోదావరి జలాలను తీసుకొని తిరిగి కేస్లాపూర్ పయనమవుతారు. మధ్యలో ఇంద్రవెల్లిలోని ఇంద్రాయి గ్రామం వద్దకు చేరుకొని ఇంద్రాయి దేవతను పుజిస్తారు. అదే రోజు కేస్లాపూర్ ఆలయ ప్రాంగణంలోని మర్రిచెట్టు దగ్గరకు చేరుకొని 'తుమ్' అంటే చనిపోయిన పెద్దలను స్మరించుకుంటూ అందరు కలిసి విడిది చేస్తారు. మర్రిచెట్టు నుంచి గుడి దగ్గరకు వెళ్లి కోనేరు నీటితో ఆడపడుచులు ఆలయాన్ని శుద్ధిచేస్తారు. సాయంత్రం గోదావరి జలంతో శుద్ధి చేసి మహా పూజ పుష్య అమావాస్య రోజున నిర్వహిస్తారు. మరుసటి రోజు నుండి ప్రధాన జాతర ప్రారంభం అవుతుంది. ఈ జాతరకు ఆంధ్రప్రదేశ్, ఛతీస్‌ఘడ్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆదివాసులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు.



బెటింగ్ (కొత్త కోడళ్ల పరిచయం) సంప్రదాయం ప్రకారం మేస్రం కుటుంబాల్లో కొత్త కోడళ్లుగా వచ్చిన వారు నాగోబా దర్శనానికి తప్పనిసరిగా రావలిసి ఉంటుంది. పరిచయం కావలిసిన వధువులను 'బేటి కోరియాడ్' అని అంటారు. ఆ పరిచయం తరువాత మాత్రమే నాగోబా పూజలకు వారిని అనుమతిస్తారు.

జాతరలో నాగోబా దర్బార్

కొమురం భీం పోరాటం తరువాత ఆదివాసీల జీవనంపై అధ్యయనం చేయడానికి వచ్చిన మానవ పరిణామ శాస్త్రవేత్త 'హైమన్ డార్ఫ్'కి వచ్చిన ఆలోచనే గిరిజన దర్బార్ లేదా నాగోబా దర్బార్. హైమన్ డార్ఫ్ అయన భార్య ఎలిజిబెత్‌తో కలిసి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా మర్లవాయి గ్రామానికి వచ్చారు. ఆ సమయంలో కేస్లాపూర్ గ్రామంలో నాగోబా జాతర జరుగుతుండడం వివిధ రాష్ట్రాల ఆదివాసీలు వారి కష్టసుఖాలను పంచుకోవడం గమనించిన హైమన్ డార్ఫ్ ఇది సరైన వేదికని దర్బార్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అనుమతితో అది మొదలు 1946 నుంచి నాగోబా జాతర నాలుగోవ రోజు 'దర్బార్' నిర్వహించడం ఆదివాసుల ఆనవాయితీగా మారింది. మహనీయుడు హైమన్‌డార్ఫ్ ఆలోచనైన ఈ దర్బార్ 73 వసంతాలుగా అనేక ఆదివాసీల సమస్యలను చర్చిస్తున్నది. ఈ దర్బార్‌కి హైమన్ డార్ఫ్ శిష్యులు కూడా వస్తారు. ప్రతి ఏట జైనుర్లోని మర్లవాయిలో హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతిని జరుపుతున్నారు. ఆదివాసీ సంస్కృతికి అద్దంపట్టే ఈ నాగోబా జాతర వారికో అపురూప వేడుక.

సెల్ : 9494283038

కథలంటే కథలే



జి.మధుకర్

మానవుడు నిరంతరాన్వేషి. పరిణామ క్రమం మొదలు అభివృద్ధి దిశగా నడుస్తున్నాడు. ఆహార సేకరణ, నిప్పు కనుకొనడం, రాతి యుగం, ఇనుము యుగం, వ్యవసాయం, భాష మొదలైన మార్పులు మానవుని జీవనంలోని భాగాలు. అదేసమయంలో పరిశోధన చేసే పరిపక్వత లేని మానవుడు వాస్తవాలను గుర్తించలేని స్థితిలో అందమైన కథలు రాయటం మొదలుపెట్టాడు. ఈ కథలు నరుడి కల్పనా శక్తికి తార్కాణాలు. నాటి కథలనే నేడు పురాణాలంటున్నాం. వీటిని ఎవరు రాశారు, ఎంత మంది రాశారు? అన్న విషయం ఎవరికీ తెలియదు. కానీ ఇవి జానపదం, గేయం, దేవాలయాలపై బొమ్మలు, మాటల రూపంలో ఒకరి నుండి ఒకరికి ప్రచారమవుతాయి. వారి వారి జీవన విధానాలకు, సంస్కృతులకు అనుగుణంగా రూపొందుతాయి. అందులోని సృష్టి కథలను పరిశీలిస్తే చాలా చమత్కారంగా ఉంటాయి. మనల్ని ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఉదాహరణకు మానవుని పుట్టినిల్లు అయిన మధ్య ఆఫ్రికాలోని బంటు జాతికి చెందిన బాస్వాంగా తెగలవారి పురాణంలో, మొదట్లో ఉన్నది నీరు, చీకటి, వారి దేవదేవుడు 'బూంబా'. ఒకసారి బూంబాకు అజీర్తి చేస్తే కడుపులో నుండి సూర్యుడిని కక్కుకుంటాడు. దీంతో సూర్యుడి వేడి కారణంగా కొంత నీరు ఆవిరై భూభాగం బయటపడుతుంది. ఇంకా బాధగా ఉన్న బూంబా ఈసారి చంద్రుడు, నక్షత్రాలు, జంతువులు, చివరగా మనిషిని కక్కుకున్నాడు. చైనా పురాణంలో బ్రహ్మాండం నుండి పుట్టిన పంగు (దేవుడు) భూమిని, ఆకాశాన్ని పుట్టించిన తరువాత అవి కలుసుకోకుండా 18 వేల ఏండ్ల పాటు నిలబడతాడు. పంగు చనిపోయిన తర్వాత శరీరం నుండి మూలకాలు, స్వరం పిడుగులు, ఒక కన్ను సూర్యుడు, మరొకటి చంద్రుడిగా, వెంట్రుకలు నక్షత్రాలుగా, రక్తం నదులుగా, కాళ్లూ చేతులు నాలుగు దిక్కులుగా ఏర్పడ్డాయని అక్కడి వారి నమ్మకం. దేవుడి ఆదేశం మేరకు సృష్టి పుట్టిందని, మాయన్ల దేవుడు "గూకుక మార్క్స్" భూమి అని ఉచ్చరించగానే నీరు వెనక్కి వెళ్లిపోయి భూమి వచ్చిందంటారు. యెహోవా వెలుగు కమ్ము అనగానే వెలుగు వచ్చిందని విశ్వమంతా ఆరు రోజుల్లో సృష్టించబడిందని పాలస్తీనాలో పుట్టిన జుడేయో క్రిస్టియన్ మతాల నమ్మకం. ఇలా ఒక్క వాక్కుతో పుట్టిన సృష్టి కథలు చాలా ప్రాంతాలలో అనేక రకాలుగా ఉన్నాయి. భారత దేశంలోని హిందూ మతంలో కూడా ఈ కోవకు చెందిన కథలు కోకొల్లలు. తంజావూరు చోళ రాజులు రాజ్యాన్ని విస్తరించే క్రమంలో కాంబోడియాను ఆక్రమించారు. ఈ ప్రాంతంలోని "అంకుర్ వాట్"లో ఐదు వందల ఎకరాల మేరా ఒక పెద్ద హిందూ మందిరాన్ని కట్టారు. ఆలయ బొమ్మలు కొన్ని సృష్టి కథలకు ప్రతిబింబాలుగా ఉన్నాయి. మనం ఇప్పటిదాకా విష్ణువు ఆదేశం మేరకు ఈ సృష్టి పుట్టిందని, బ్రహ్మ తల, భుజాలు, తొడల, పాదాల నుండి మానవుడు పుట్టినట్టుగా కథలు విన్నాం. కానీ ఈ కథలో విష్ణువు తాబేలుగా మందర పర్వతం కవ్వంగా, వాసుకి తాడుగా దేవదానవులు పాల సముద్రాన్ని చిలకరిస్తారు. దాంతో భూమి, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, దేవాశ్వం, పవిత్ర గోవు, లక్ష్మీదేవి, అమృతం, చివరగా నరులు ఉద్భవించినట్టు ఈ కథ చెబుతోంది. ఈ కథలన్నింటినీ ఇంత అందంగా చిత్రీకరించిన ఆనాటి మనిషికి మనం జేజేలు పలకాలి. అతని కల్పనా చాతుర్యానికి మెచ్చుకోవాలి. కానీ ఈ కథలను నమ్మేవారు నేటికీ ఉన్నారు. ఒకవేళ సృష్టి అనేది సృష్టించబడితే ఇన్ని రకాలుగా జరుగుతుందా? మరి ఇందులో ఏ కథ వాస్తవమై ఉంటుంది? అయినా.... కథలు వాస్తవం కావడం ఏంటీ? కథలు ఎప్పుడూ కథలే. వాటికి నిజ నిర్ధారణలు ఉండవు. ఎందుకంటే ఊహా కల్పితాలు కాబట్టి. వాస్తవాలను మరుగున పడేయాలని పనిగట్టుకొని కొందరు కల్పితాలను ప్రచారం చేస్తుంటారు. రాజకీయ నాయకులే వీటిని ప్రోత్సహించి అధికారంలోకి వస్తున్నారు. ఫలితంగా ప్రజల్లో మూఢవిశ్వాసాలు పెరిగి దేశం తిరోగమనం వైపు సాగుతుంది. ఇప్పటికైనా జనాలను చైతన్యం వైపు, శాస్త్రీయ దృక్పథం వైపు నడిపించే బాధ్యత మనందరి మీదా ఉంది.

సెల్ : 9542427287

మన విద్యా విధానం తీరుమారాలి



ముగ్గు సందీప్

భారతదేశం తన విద్యా మేధస్సును ప్రపంచ దేశాలకు అందించిన గొప్పదేశం. కానీ ఈనాడు మనదేశంలో విద్యా వ్యవస్థ కుంటుపడే ప్రమాదం ఏర్పడింది. విద్య విద్యార్థుల సృజనాత్మకతను పెంచే విధంగా లోక జ్ఞానాన్ని, బుద్ధివికాసాన్ని పెంపొందించే విధంగా ఉండాలి. కానీ ప్రస్తుతం మన విద్యావ్యవస్థలో చాలా లోపాలున్నాయి. ప్రస్తుత విద్యా విధానం సృజనాత్మకతను పెంచేదిగా కాకుండా ఏదో ఒక ఉపాధి కోసం మాత్రమే అన్నట్టుగా ఉంది. కనీసం ఆ ఉద్యోగ అవకాశాలను కూడా మన ప్రభుత్వాలు కల్పించలేకపోతున్నాయి. జ్ఞానం అనేది ప్రధానంగా రెండు రకాలు 1.భౌతిక జ్ఞానం: ఇది వాస్తవిక దృక్కోణాన్ని పెంపొందిస్తుంది. 2.అధ్యాత్మిక జ్ఞానం. ఇది కంటికి కనిపించదు. మన దేశంలో భౌతిక జ్ఞానం ఉన్నప్పటికీ అధ్యాత్మిక జ్ఞానం వలన అనేక మూఢ నమ్మకాలు సమాజాభివృద్ధిని వెనుకకు నెట్టేస్తున్నాయి. కాబట్టి మారుతున్న సమాజంలో విద్య అనేది శాస్త్రీయ దృక్కోణాన్ని పెంపొందించే విధంగా ఉండాలి. నిజానికి భారతీయ విద్యా వ్యవస్థ ఇలా కావడానికి ప్రధాన కారణం పాలకవర్గాలు, ప్రభుత్వ విధానాలు. నేడు తల్లిదండ్రులను తమ పిల్లలు ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, ఇంజనీర్లుగా తయారు కావాలని మాత్రమే కోరకునే స్థితికి తెచ్చారు. ఫలితంగా తల్లిదండ్రుల ఈ ఆకాంక్షను ప్రైవేటు విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రస్తుత సమాజంలో కళా సాహిత్యాలు, సామాజిక శాస్త్రాలు ఆదరణకు నోచుకోవటం లేదు. '66 కళల్లో ప్రతి మనిషి ఏదో ఒక కళ కలిగి ఉండాలని' చరిత్రకారుడు రాహుల్‌సాం కృత్యాయన్ పేర్కొన్నారు. ప్రభుత్వం, తల్లిదండ్రులు వీటి పట్ల ఎలాంటి ఆసక్తిని చూపటం లేదు. అందుకే మన విద్యావిధానం మానసిక వికాసాన్ని విలువలతో కూడిన చైతన్యాన్ని పెంపొందించలేకపోతున్నది. అంతేకాదు, ప్రతి మనిషికీ ప్రాథమిక అవసరాలైన ఆహారం, దుస్తులు, గృహవసతి, విద్యా, వైద్యాలను కల్పించలేని దుస్థితిలో మన విద్యా విధానం ఉన్నది. కార్పొరేట్ హంగులను రూపుదిద్దుకుంది. దీని వలన తల్లిదండ్రులు తీవ్రమైన ఆర్థిక భారాన్ని అనుభవిస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు విధించిన ఫీజులను ప్రభుత్వం కట్టడి చేయడంలో విఫలమవుతోంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యా ప్రమాణాలను నెలకొల్పడంలోనూ వైఫల్యం చెందింది. నాణ్యమైన విద్యను కేవలం ప్రైవేటు విద్యా సంస్థలు అందిస్తాయన్న అపోహలో మనం బతుకుతున్నాం. ప్రైవేటు విద్యా సంస్థలు పట్టుగూళ్లుగా మారి విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్య ప్రాథమిక లక్ష్యం విజ్ఞానాభివృద్ధికి తద్వారా సమాజాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఉండాలి. అయితే ఈ సామాజిక దృక్పథం మన ప్రభుత్వాలకు కానీ, తల్లిదండ్రులకు గాని, మెజార్టీ ఉపాధ్యాయ బృందానికి గాని లేకపోవటం చాలా బాధాకరం. మన చదువులు జ్ఞానానికి చిహ్నంగా కాకుండా జ్ఞాపకశక్తికి మాత్రమే ప్రతీకలు అవుతున్నాయి. మనది వ్యవసాయ ఆధారిత దేశం. కాని వ్యవసాయం అనేది ప్రధాన పాత్ర భాగంగా లేని దుస్థితి మనదేశ విద్యా వ్యవస్థలో ఉంది. వ్యవసాయ రంగంలో వినూత్నమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ఎంఎస్ స్వామినాధన్ గురించి ఇప్పటికీ మన దేశంలో అధిక మందికి పూర్తిగా తెలియదు. కాబట్టి వ్యవసాయ రంగ విద్యా విధానాన్ని అభివృద్ధి చేసుకోగలిగితే వ్యవసాయం అభివృద్ధి అవుతుంది. తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఫలితంగా దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశముంది. ఈ పారిశ్రామిక అభివృద్ధి ఫలితంగా ఉద్యోగ అవకాశాలు విరివిగా పెరుగుతాయి. ఈ రకంగా వ్యవసాయం, పరిశ్రమలు రెండుకాళ్ల మీద నడిచే సమాజంగా భారతదేశం అభివృద్ధి చెందుతుంది. తద్వారా తృతీయ రంగమైన సేవా రంగం కూడా అభివృద్ధిచెంది కోట్లాది మందికి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. దీని ఫలితంగా అన్ని రంగాల్లో స్వయ సమృద్ధిని సాధించగలం. విద్య అనేది మన చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకొని, జీవితంలో తలెత్తే వివిధ సమస్యలను స్వయంగా పరిష్కారం చేసుకోగలిగే చైతన్యాన్ని, సామర్థ్యాన్ని ఇవ్వాలి. యూరఫ్, చైనా, అమెరికాల్లో దేశ అవసరాలకు తగినట్టుగా వారు విద్యారంగాన్ని అభివృద్ధి చేసుకున్నారు. తద్వారా ఆ దేశాలు అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉన్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51/ ఏహెచ్ ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయమైన దృక్కోణాన్ని అలవరుచుకోవాలి. అంటే విద్య అనేది మానవునిలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఉండాలి. కానీ ప్రస్తుత విద్యా విధానంలో ఇది సాధ్యపడుట లేదు. ప్రపంచీకరణ, సరళీకరణ ప్రభావంతో మన దేశ విద్యా రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. సాంకేతిక అభివృద్ధి మన జ్ఞానాన్ని పెంపొందించేందుకు అనేక విధాలుగా తోడ్పడుతుంది. అదే సందర్భంలో ఈ సాంకేతికత మానవ సంబంధాలను పెంపొందించేదిగా ఉండాలే తప్ప సాంకేతిక బానిసత్వానికి దారి తీయకూడదు.

ఒక మంచి పత్రికా సంపాదకుడు ప్రజల పక్షాన నిలవాలి. ఒక మంచి న్యాయవాది న్యాయం పక్షాన నిలవాలి. ఒక మంచి ప్రభుత్వ ఉద్యోగి అవినీతికి పాల్పడకుండా ఉండాలి. ఈ విధంగా మన విద్యా విధానం విద్యార్థుల్లో మంచి లక్షణాలను నింపేదిగా ఉండాలి. కానీ నేడు ఒక విద్యార్థిని సమాజంలో ఉన్నతమైన వ్యక్తిగా తీర్చిదిద్దే ఉపాధ్యాయు వృత్తికి గౌరవం తగ్గిపోతుంది. ఇది చాలా బాధాకరమైన విషయం. ప్రస్తుతం మన భారతదేశంలో ఉన్నత చదువులు చదివే వారి సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతుంది. పరిశోధన రంగంలో విద్యనభ్యసించే వారి సంఖ్య కూడా ఏటేటా తగ్గిపోతున్నది. దీనికితోడు ప్రస్తుతం మన విద్యా వ్యవస్థ నైపుణ్యం, సామర్థ్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించే విధంగా ఎంత మాత్రం లేదు. ఇది సమాజ ప్రగతికి ఉపయోగపడదు. మరోవైపు నేటి విద్యా వ్యవస్థలో నైతిక విలువలు కరువయ్యాయి. కాబట్టి విద్య అనేది ప్రతి ఒక్కరిని సంస్కారవంతుడిగా, సమాజం పట్ల బాధ్యతగా మెలిగే ఉన్నతమైన వ్యక్తిగా మలిచే సాధనంగా ఉపయోగపడాలి. ఈ మార్పు కోసం ప్రభుత్వాలూ, ప్రజలూ కలిసికట్టుగా కృషి చేయాలి. దేశం అభివృద్ధి పథంలో నడవడానికి ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర నిర్వర్తించాలి.

సెల్ :7013751538

రచయితలకు సూచనలు

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. ప్రత్యేక సందర్భానికి సంబంధించిన వ్యాసమైతే దానిని గురించి కవరింగ్ లెటర్ రాయండి. వ్యాసం మొదటి పేజీ మీద పంపిస్తున్న తేదీ వేయండి.


వ్యాస రచయితలు తమ వ్యాసంతోపాటు పూర్తి పోస్టల్ చిరునామా కూడా పంపించాలని కోరుతున్నాం. ఇప్పటికే వ్యాసాలు పంపినవారు కూడా తమ అడ్రెస్‌లు పోస్టల్ ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ పంపించాలని మనవి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

మానవత్వం మంటగలుస్తున్నదా?



డా.పోలం సైదులు

అమ్మ గురించి నాలుగు మాటలు చెప్పమంటే నాలుగేంటి, నలభై చెబుతామంటారు. కానీ సమాజంలో వృద్ధాశ్రమాల అవసరం ఎందుకొచ్చింది, తమ పుత్ర సంతానంతో అష్టకష్టాలు పడుతున్న పరిస్థితి కొంతమంది అమ్మలకెందుకు కలిగిందో ఆలోచించాల్సిన అవసరమున్నది. కడుపులో పురుడు పోసుకున్నప్పుడు అమ్మకు కలిగే ఆనందాన్ని దేనితో వెలకట్టలేమన్నది జగమెరిగిన సత్యం. తన ప్రాణంకంటే మిన్నగా పిల్లలను చూసుకుంటూ, అల్లారుముద్దుగా గోరుముద్దలు తినిపిస్తూ, కంటికి రెప్పలా కాపాడుకున్న విషయం సైతం అందరికీ తెలిసిందే. ఇంత తెలిసినా సమాజంలో ఇంకా అమ్మలు కష్టాలు పడుతున్నారంటే కారణమేమిటి? ప్రత్యేకంగా ధనవంతులు, ఉద్యోగస్తులే వారి తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో వుంచుతున్నారంటే కారణం నేటి సమాజంలో మానవ సంబంధాలకంటే ఎక్కువ ప్రాముఖ్యత ఆర్థిక సంబంధాలకే ఇస్తున్నారని అర్థంగాక మానదు.

ఇంకొకరు భార్యమూలంగా వృద్ధాశ్రమంలో చేర్చుతారు. పని చేసేంత ఓపిక, శక్తి ఉన్నంతవరకు ఇంట్లో అన్ని పనులకు వాడుకొని, చేతగాని సమయమొస్తే చాలు, ప్రతిదానికి వారిపై అరుస్తూ, చీటిమాటికి మాటలంటూ వారి మనసుకు బాధ కల్గించేలా, తమకు తాము ఇంట్లోనుండి బయటికెళ్లేలా చేస్తుంటారు. మనకూ అలాంటి దుస్థితి రావచ్చు. మనం వృద్ధులను అగౌరవ పరిచినప్పుడు ఇంట్లో పిల్లలు చూస్తే నేర్చుకొని భవిష్యత్‌లో ప్రయోగించలేరని చెప్పగలమా! కాబట్టి ప్రతి ఒక్కరు వృద్ధాప్యంలో వున్న తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా వుంటూ, చిన్నతనంలో మననెలా చూసుకున్నారో, వారిని సైతం ఆలా చూసుకుంటూ, ఇంట్లో పిల్లలకు సైతం వారి ప్రేమను పంచాలి. అమ్మ, నాన్నల ప్రేమకు నోచుకోని వారు అప్పుడప్పుడు వారు లేని లోటును వివరిస్తూ కన్నీటి పర్యంతం కావడం కూడా అప్పుడప్పుడు చూస్తూనే ఉంటాం. వాస్తవానికి ఏదైనా మనదగ్గర వున్నప్పుడు దాని విలువ తెలియదు. దూరమైతే తెలుస్తుంది. వృద్ధాశ్రమాల్లో తల్లుల మనోవేధనను ఆపడం ఎవరితరం కాదు.

సెల్ : 9441930361

ఎస్సారెస్పీ కింద యాసంగి పంటకు
ఈనెల 10 నుంచి నీటి విడుదల

- ప్రజాప్రతినిధులు, అధికారుల సమీక్షా సమావేశంలో నిర్ణయం


మాట్లాడుతున్న ఈటల

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

ఎస్సారెస్పీ కింద యాసంగి పంటకు ఈ నెల 10 నుంచి ఒక విడత నీరు విడుదల చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. బుధవారం జలసౌధలో కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాల ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశమై ఎస్సారెస్పీ నీటి విడుదల, పునరుజ్జీవన పనులు ప్రగతి గురించి చర్చించారు. ఈ సమావేశానికి హాజరైన మాజీ ఆర్థిక మంత్రి, హుజూరాబాద్ శాసనసభ్యుడు ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ ద్వారా 14.40 లక్షల ఎకరాలకు సాగునీరందించటానికి పునరుజ్జీవ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద గతంలో ఎన్నడూ 5 లక్షల ఎకరాలకు మించి సాగునీరందించలేదని గుర్తు చేశారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను తాము ఆదేశించినట్టు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్‌ను బలోపేతం చేయాల్సి ఉందని ఆయన అన్నారు. చెరువులు, కుంటలను నింపాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్టు ఆయన వెల్లడించారు. దీనితో భూగర్భ జలాలు, మత్స్య సంపద పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

'సింగరేణి'పై ఏసీబీ రైడ్ !

ఐదు బృందాలతో తనిఖీలు

- సూత్రధారి సంపత్ నివాసంలో సోదాలు.. హైదరాబాద్‌లో అరెస్టు

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి సంస్థలో వెలుగు చూసిన బోర్డు మెడికల్ కుంభకోణం నేపథ్యంలో కొన్ని రోజులుగా సింగరేణి ఏరియాలోని ఆరు జిల్లాల్లో ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయి. ఐదు బందాలుగా ఏర్పడి కార్మికులు, అధికారులను దఫాలుగా విచారిస్తున్నారు. బోర్డు మెడికల్ కుంభకోణానికి అసలు సూత్రధారిగా కొత్తగూడెంకు చెందిన జీకే.సంపత్ కుమార్‌ను భావిస్తున్నారు. అతను కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో క్లర్క్‌గా పని చేశా డు. అనేక ఆరోపణల నేపథ్యంలో ఇటీవలే అతన్ని సస్పెండ్ చేశారు. ఆయన ఇంట్లో మంగళ వారం అర్ధరాత్రి నుంచి ఏసీబీ అధికారులు మకాం వేశారు. కీలక పత్రాలను, పలు విలువైన డాక్యుమె ంట్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 18 గంటల పాటు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆయన బంధువులు, అనుచరుల ఇండ్లల్లో కూడా సోదాలు నిర్వహిస్తున్నారు. కొత్తగూడెం సింగరేణిలో



ఎలక్ట్రి షన్‌గా పని చేస్తున్న మరో ఉద్యోగి మల్లం ప్రభాకర్‌ను సైతం అతడి ఇంట్లో ఏసీబీ ప్రత్యేకంగా విచారి స్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా బోర్డు మెడికల్ కుంభకోణం జరుగుతున్న ఈ విషయంపై సింగరేణి యాజమాన్యానికి బాధితుల నుంచి అనేక ఫిర్యాదులు అందినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకో లేదనే విమర్శలున్నాయి. తాజాగా ఏసీబీ దాడులు మొదలయ్యాయి. ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న సంపత్ కుమార్‌ను హైదరాబాద్‌లో ఏసీబీ (సీఐయూ) అధికారులు అరెస్టు చేశారు. గురువారం అతడిని కోర్టులో హాజరు పరిచే అవకాశాలున్నట్టు సింగరేణి యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది.

నవచిత్రం


రజనీకాంత్

రాజకీయ నేపథ్యమే!

ఇటీవల '2.0', 'పేటా'తో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న రజనీకాంత్ నెక్ట్స్ సినిమాని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో తొలిసారి ఓ సినిమా చేయనున్నట్టు కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వినిపించాయి. దీనిపై అటు మురుగదాస్ నుంచి గానీ, రజనీకాంత్ నుంచిగానీ ఎలాంటి స్పందన లేదు. అయితే మురుగదాస్ దర్శకత్వంలోనే తన నయా సినిమా ఉంటుందని తెలుస్తుంది. ఈ సినిమా రాజకీయ నేపథ్యంలో ఉంటుందని సమాచారం. సమకాలీన రాజకీయ కథాంశంతో ఆద్యంతం సెటైరికల్‌గా ఉండబోతుందట. బలమైన కథతో మురుగదాస్ ఈ సినిమాని రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నట్టు కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. దీనికి 'కుర్చీ' అనే టైటిల్ వినిపిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై సినిమా తెరకెక్కనుంది. రజనీకాంత్ త్వరలో పూర్తి స్థాయి రాజకీయాల్లోకి వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ పొలిటికల్ సినిమా తన కెరీర్‌కి హెల్ప్ అవుతుందని భావిస్తున్నారట. అయితే ఈ సినిమాని సాధ్యమైనంత వరకు తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. గత రజనీ చిత్రాలు భారీ బడ్జెట్‌తో తెరకెక్కడంతో ఆ స్థాయి కలెక్షన్లు రాబట్టడంతో వెనకబడ్డాయి. ఈ నేపథ్యంలో రెగ్యులర్ బడ్జెట్‌కి కాస్త తక్కువయ్యేలా ఈ సినిమాని నిర్మించాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తున్నారు.

క్రేజీ డైరెక్టర్‌తో పవర్‌ఫుల్ పోలీస్


మహేష్‌బాబు

'పటాస్', 'సుప్రీమ్', 'రాజా ది గ్రేట్', 'ఎఫ్2'తో దర్శకుడు అనిల్ రావిపూడి వరుస విజయాలని అందుకున్నారు. ఇటీవల విడుదలైన 'ఎఫ్2' వంద కోట్లకుపైగా వసూలు చేసింది. ఈ నేపథ్యంలో అనిల్ రావిపూడి తాజాగా ఓ బంపర్ ఆఫర్‌ని అందుకున్నారట. మహేష్‌బాబు హీరోగా సినిమా చేసే అవకాశాన్ని దక్కించుకున్నట్టు తెలుస్తుంది. మహేష్ బాబు నటించిన 'దూకుడు', 'ఆగడు' సినిమాలకి అనిల్ రావిపూడి రైటర్‌గా పనిచేశాడు. ఇటీవల 'ఎఫ్2' సినిమా చూసిన మహేష్ ఓ కథని సిద్ధం చేసుకోమని అనిల్‌కి చెప్పారట. దీంతో ప్రస్తుతం ఆయన కథని సిద్ధం చేసే పనిలో ఉన్నారు. అయితే మహేష్‌ని ఓ పోలీస్ పాత్రలో చూపించాలని అనిల్ రావిపూడి భావిస్తున్నారు. తన మార్క్ వినోదం మేళవింపుతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం మహేష్‌బాబు 'మహర్షి' చిత్రంలో నటిస్తున్నారు. వంశీపైడిపల్లి దర్శకత్వంతో రూపొందుతున్న చిత్రమిది. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుంది. ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్నారు.

హైదరాబాద్‌కి మైనపు విగ్రహం..

మహేష్‌బాబు అభిమానులకి సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాడు మైనపు విగ్రహ బృందం. ఆయన మైనపు విగ్రహం కోసం గతేడాది కొలతలు తీసుకున్న విషయం విదితమే. అయితే దీని సింగపూర్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ప్రతిష్ఠించడానికి ముందు ఒక రోజు హైదరాబాద్‌లో ఉంచనున్నారు. మహేష్‌బాబు మల్టీప్లెక్స్ ఏఎంబీ సినిమాస్ థియేటర్‌లో ఓ రోజు సందర్శనార్థం ఉంచాలని నిర్ణయించారు. ఈ నెలాఖరులో దీన్ని ఏర్పాటు చేయనున్నారట.


షాలినీ పాండే, కళ్యాణ్‌రామ్

అందమైన చందమామే వస్తోంది

కళ్యాణ్ రామ్ హీరోగా, షాలినీ పాండే కథానాయికగా '118' చిత్రం రూపొందుతుంది. సినిమాటోగ్రాఫర్ కె.వి. గుహన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు నిర్మిస్తున్నారు. మార్చి 1న ఈ చిత్రం విడుదల కానుంది. 'శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని తొలిపాట 'చందమామే..'ని శుక్రవారం విడుదల చేయబోతున్నాం. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా టీజర్ ఇటీవల విడుదలై ఆకట్టుకుంటోంది. కళ్యాణ్ రామ్ పాత్ర తీరుతెన్నులు కొత్తగా ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకునేలా ఉంటుంద'ని చిత్ర బృందం తెలిపింది.

తిప్పరా మీసం



శ్రీవిష్ణు

శ్రీవిష్ణు హీరోగా రూపొందుతున్న చిత్రం 'తిప్పరా మీసం'. కృష్ణ విజయ్.ఎల్ దర్శకత్వంలో రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ ఓం సినిమా పతాకాలపై రిజ్వాన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'ఇందులో శ్రీవిష్ణు కొత్తగా కనిపిస్తున్నారు. ఫస్ట్‌లుక్‌లో గుబురు మీసాలు, ఫుల్ గడ్డం, పగిలిన అద్దాలు అతని పాత్ర తీరుతెన్నులని చూపిస్తుంది. 'అసుర' సినిమాతో విమర్శకుల ప్రశంసలందుకున్న దర్శకుడు కృష్ణ విజయ్ సినిమాని అత్యద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. హీరో శ్రీవిష్ణుతో ఆయనకిదే తొలి చిత్రం. యాక్షన్ డ్రామాగా రూపొందుతుంది. నిక్కి తంబోలి, రోహిణి కథానాయికలుగా నటిస్తున్నారు. అచ్యూత్ రామారావు, బెనర్జీ, రవిప్రకాష్, రవివర్మ, నవీన్ నేని, ప్రవీణ్, నేహ దేశ్ పాండే ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. చిత్ర షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి వేసవి కానుకగా విడుదల చేస్తాం' అని తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, సినిమాటోగ్రఫీ: సిద్.


అమృతా రావు

తెలుగులో మహిళల్ని వస్తువుగానే చూపిస్తారు!

'తెలుగులో హీరోయిన్లని కేవలం వస్తువులుగానే చూపిస్తారు. అందుకే నటించడం లేదు' అని అంటోంది అమృతా రావు. మహేష్‌బాబు నటించిన 'అతిథి' చిత్రంలో కథానాయికగా నటించి మెప్పించింది. ఆ తర్వాత మరే తెలుగు సినిమాలో నటించలేదు. దానికి కారణమేంటని అడిగిన ప్రశ్నకి అమృతా రావు స్పందిస్తూ, "అతిథి' సినిమా టైమ్‌లో నాకు తెలుగులో ఒకేసారి మూడు సినిమా ఛాన్స్‌లు వచ్చాయి. కానీ నేను ఒప్పుకోలేదు. తెలుగులో హీరోయిన్ల పాత్రలని చూపించే విధానం నాకు నచ్చలేదు. అలాంటి పాత్రలు నాకు సరైనవిగా అనిపించలేదు. 'అతిథి' ఒప్పుకోవడానికి కారణం అందులో నా పాత్ర, మహేష్ పాత్రతో సమానంగా ఉంటుంది. షూటింగ్ టైమ్‌లో మహేష్ ఫ్యామిలీతో కనెక్ట్ అయ్యాను. వారి ఇంటి నుంచే భోజనం వచ్చేది. ఓ సారి నమ్రత మా కోసం బ్రౌన్ రైస్ వండి పంపించింది. అది ఎప్పటికీ మర్చిపోలేను' అని తెలిపింది. బాలీవుడ్‌కే పరిమితమైన అమృతరావు 2013 నుంచి సినిమాలకు దూరంగా ఉంది. ఇటీవల 'టాక్రే' చిత్రంతో తిరిగి రీ ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం 'ది లెజెండ్ ఆఫ్ కునల్', 'సాస్టాంగ్' చిత్రాల్లో నటిస్తుంది.


ప్రియాంక చోప్రా

అది ముందు నిర్ణయించిందే

'మేం సాంప్రదాయాలు, కట్టుబాట్లకు విలువిస్తాం. అందుకే నా పేరులో నిక్ జోనాస్ పేరును కలుపుకున్నా' అని ప్రియాంక చోప్రా తెలిపింది. హాలీవుడ్‌కి చెందిన పాప్ సింగర్ నిక్ జోనాస్‌ని గతేడాది ప్రియాంక వివాహం చేసుకున్న విషయం విదితమే. ప్రస్తుతం కాలిఫోర్నియాలో అత్తారింట్లో ఎంజాయ్ చేస్తుంది ప్రియాంక. ఆమె నటించిన హాలీవుడ్ చిత్రం 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్?' చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఓ ఇంగ్లీష్ మీడియాతో ప్రియాంక మాట్లాడుతూ, 'పెళ్ళి తర్వాత నా పేరులో జోనాస్ పేరుని చేర్చుకున్నాను. ఇలా చేయాలని ముందే అనుకున్నాం. పెళ్ళి తర్వాత మేమంతా ఓ కుటుంబమయ్యాం. అందుకే నా పేరులో నిక్ పేరుని కలుపుకున్నా. అయినంత మాత్రాన నా గుర్తింపు ఏమాత్రం తగ్గదని భావిస్తున్నా. అయితే సింగిల్‌గా ఉన్నప్పటి జీవితానికి, పెళ్ళి తర్వాత జీవితం చాలా ఢిఫరెంట్‌గా ఉంది. కొత్త అనుభూతినిస్తుంది' అని తెలిపింది. 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్?' చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. దీంతోపాటు ప్రియాంక బాలీవుడ్‌లో 'ది స్కై ఈజ్ పింక్' చిత్రంలో నటిస్తుంది.


మహి వి రాఘవ్, దిల్‌రాజు, విజయ్ చిల్లా

ప్రేక్షకులందరూ ఆస్వాదించే యాత్ర

'ఇప్పుడున్న పరిస్థితుల్లో సినిమా భారీ ఓపెనింగ్స్ సాధిస్తేనే నిలబడతాయి. ఓపెనింగ్ కలెక్షన్లు ఇప్పుడు చాలా ముఖ్యం' అని దిల్‌రాజు అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర నేపథ్యాన్ని తీసుకుని రూపొందించిన చిత్రం 'యాత్ర'. వైఎస్‌గా మమ్ముట్టి నటించిన ఈచిత్రానికి మహి వి రాఘవ్ దర్శకత్వం వహించారు. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శశిదేవిరెడ్డి, విజయ్ చిల్లా సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దిల్‌రాజు మాట్లాడుతూ, 'వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర ఎంతటి సెన్సేషనల్ అయ్యిందో తెలిసిందే. దాన్ని ఐడియాగా తీసుకుని పాదయాత్రలో ఉన్న ఎమోషన్స్, మూమెంట్స్ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మమ్ముట్టి లాంటి లెజెండరీ నటుడు ఇందులో నటించడం గొప్ప విషయం. టీజర్, పాటలు విడుదలైనప్పుడు సినిమాని ఎప్పుడెప్పుడు చూద్దామా అనే ఎగ్జైట్‌మెంట్ కనిపించింది. రెండు రోజుల ముందే ఓవర్సీస్‌లో, ఏపీ,తెలంగాణలో ఆన్‌లైన్ బుకింగ్స్ బాగున్నాయి. చాలా స్ట్రాంగ్ ఓపెనింగ్స్‌ని రాబట్టబోతుందీ సినిమా. తొలిరోజు భారీ ఓపెనింగ్స్ రాబడితేనే రెవెన్యూలో మ్యాజిక్ జరుగుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఓపెనింగ్ కలెక్షన్లు తీసుకుంటేనే సినిమా నిలబడే స్థితి ఉంది. ఈ చిత్రాన్ని నైజాం, వైజాగ్‌లో మా సంస్థపై విడుదల చేస్తున్నాం. ఓ నాయకుడు జనాల కోసం ఏదైనా చేస్తాడని రాజశేఖర్‌రెడ్డి మంచి పథకాలు చేపట్టి చూపించారు.
ఎన్టీఆర్ తర్వాత మన రాష్ట్రంలో ఒక ఇమేజ్ బిల్డ్ అయ్యింది రాజశేఖర్‌రెడ్డికే. అలాంటి గొప్ప వ్యక్తి జీవితం ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా పెద్ద హిట్ కావాలి' అని అన్నారు. 'మనకి అభిప్రాయ భేదాలు ఉండవచ్చు. ఎవరి ఆలోచనలు వారివై ఉండవచ్చు. అంత మాత్రాన ఎవరినీ అగౌరవపరచకూడదు. ఎవరినీ అసహ్యించుకోకూడదు. వైఎస్ఆర్ సినిమా చేస్తున్నాం. ఈ విషయం అందరికీ ఇష్టం ఉండొచ్చు, ఇష్టం లేకపోవచ్చు. అంత మాత్రాన దయజేసి అగౌరవపరచవద్దు. ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంత క్యూరియాసిటీతో ఉన్నారో, నేను కూడా అంతే ఆతృతగా వెయిట్ చేస్తున్నా' అని దర్శకుడు మహి వి రాఘవ్ తెలిపారు. నిర్మాత విజయ్ చిల్లా చెబుతూ, 'ఇది పొలిటికల్ చిత్రం కాదు. కాంట్రవర్సీలు లేవు. రాజశేఖర్‌రెడ్డి వ్యక్తిత్వం, స్ఫూర్తికి సంబంధించినది. సినిమా నచ్చితే అందరికి చెప్పండి. రాజశేఖర్‌రెడ్డి అభిమానులే కాదు, ప్రతి ఒక్కరు ఆస్వాదించేలా ఉంటుంది' అని అన్నారు.

అద్భుతమైన విజువల్స్‌తో సువర్ణ సుందరి


పూర్ణ, సాగర్, బి.గోపాల్, సూర్య, తమ్మారెడ్డి భరద్వాజ, సాక్షి చౌదరి

జయప్రద, పూర్ణ, సాక్షి చౌదరి, రామ్, ఇంద్రా ప్రధాన పాత్రధారులుగా సూర్య ఎం.ఎస్.ఎన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సువర్ణ సుందరి'. ఎస్.టీమ్ పిక్చర్స్ పతాకంపై ఎం.ఎల్.లక్ష్మి నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం మంగళవారం జరిగింది. అతిథిగా విచ్చేసిన ప్రముఖ దర్శకుడు బి.గోపాల్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బాగుంది. వీఎఫ్ఎక్స్ వర్క్ సూపర్. అన్ని షాట్స్ చాలా బాగా తీశారు. కంటెంట్ బాగుంది. సినిమా పెద్ద హిట్ కావాలి' అని అన్నారు. 'ఇలాంటి సినిమాలు రావాల్సిన అవసరం ఉంది. దాని వల్ల కొత్త టెక్నీషియన్స్ పరిచయం అవుతారు. డైరెక్టర్ కథ బాగా రాసుకున్నారు. ఇదొక మంచి చిత్రమవుతుంది' అని దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. చిత్ర దర్శకుడు చెబుతూ, 'సినిమాని చాలా స్పెషల్‌గా తెరకెక్కించాం. ప్రతి ఒక్క ఆర్టిస్టు ఎంతో సహకరించి బాగా నటించారు. వీఎఫ్ఎక్స్ కోసం ఏడాదిన్నరగా పనిచేశాం. దీంతో ఆలస్యమైంది. ఆలస్యమైనా ఫలితం బాగా వచ్చింది. అందరిని ఆకట్టుకుంటుంది' అని తెలిపారు. 'ఒక మనిషికి సహనం అంటే సూర్య నుంచే నేర్చుకోవాలి. ప్రతి ఒక్కరికి తమ పాత్రల గురించి వివరించి తనకి ఏం కావాలో అది రాబట్టుకున్నారు. ఫైట్ మాస్టర్‌కి థ్యాంక్స్. హీరో రామ్ బాగా నటించాడు. సాక్షితో మా సన్నివేశాలు ఫన్నీగా జరిగాయి. టీమ్‌కి అభినందనలు' అని పూర్ణ తెలిపారు. సాక్షి చౌదరి చెబుతూ, 'ఇదొక అద్భుతమైన చిత్రం. మమ్మల్ని బాగా చూపించిన కెమెరామెన్‌కి థ్యాంక్స్' అని చెప్పింది. చిత్ర హీరో రామ్ చెబుతూ, 'సాయికార్తీక్ వల్ల ఇందులో నటించే అవకాశం వచ్చింది. నాకిది తొలి చిత్రం. పూర్ణ లాంటి అనుభవం ఉన్న నటులతో నటించడం అదృష్టంగా భావిస్తున్నా' అని చెప్పారు.


కరీనా కపూర్

నా లైఫ్‌కి నేనే స్టార్!

'నా జీవితానికి నేనే స్టార్‌ని. నా ఛాయిస్‌ని ఎవరూ శాసించలేరు' అని అంటోంది కరీనా కపూర్. సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత మరింత జోష్‌తో దూసుకుపోతుంది కరీనా. తాజాగా ఆమె మాట్లాడుతూ, 'నా శక్తి సామర్థ్యాలేంటో నాకు తెలుసు. అవి నన్ను రక్షిస్తున్నాయి. ఇతరులు ఏం చేస్తున్నారనేది నేనెప్పుడూ పట్టించుకోను. నాకు ఆ బాధా లేదు. ఓ వ్యక్తిగా నేను నా స్థానంలో చాలా సౌకర్యంగా ఉన్నా. ఇతరుల నుంచి ఏదీ ఆశించలేదు. ప్రతి సారి బెటర్‌గా చేసేందుకు ప్రయత్నిస్తున్నా. నన్ను నేను మెరుగుపరుచుకునే ప్రయత్నం చేస్తున్నా' అని తెలిపింది. ప్రస్తుతం ఆమె 'గుడ్‌న్యూస్' చిత్రంలో నటిస్తుంది. అక్షయ్ కుమార్, దిల్జిత్ దోసాంజే, కైరా అద్వానీ ప్రధాన పాత్రధారులు. ఈ చిత్రం గురించి చెబుతూ, 'అక్షయ్‌తో కలిసి నటించడం చాలా హ్యాపీగా ఉంది. ఇదొక అమేజింగ్ ఫిల్మ్. చాలా బాగా వస్తోంది. అందరిని ఎంటర్‌టైన్ చేసేలా ఉంటుంది. సినిమాపై ఆడియెన్స్ రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నా' అని పేర్కొంది. ఇదిలా ఉంటే కరీనా ఓ కొత్త ఆఫర్‌ని అందుకుంది. విజయవంతమైన సినిమా 'హిందీ మీడియం'కి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రంలో ఇర్ఫాన్ ఖాన్ సరసన నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతోపాటు 'తఖ్త్'లో నటిస్తోంది.

ఎంతవారలైనా శిక్షార్హులే


గురు చిందేపల్లి, జి. సీతారెడ్డి

గురు చిందేపల్లి దర్శకత్వంలో రామదూత ఆర్ట్స్ పతాకంపై జి.సీతారెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'ఎంతవారలైనా'. అద్వైత్, జహీదా శ్యామ్, అలోక్ జైన్, సీతారెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం గురించి దర్శకుడు గురు చిందేపల్లి మాట్లాడుతూ, 'ఎంతవారలైనా కాంత దాసులు కావచ్చు. కనక దాసులు కావచ్చు. కానీ తప్పు చేసినప్పుడు ఎంతవారలైనా కూడా కచ్చితంగా శిక్షార్హులే అనే పాయింట్ ఆధారంగా రూపొందిస్తున్న హర్రర్ థ్రిల్లర్ చిత్రమిది' అని అన్నారు. 'దర్శకుడు గురు చిందేపల్లి నా చిరకాల మిత్రుడు. సినిమా మీద ఉన్న ప్యాషన్‌తో నిర్మాతగా మారాను. నటన మీద ఉన్న ఆసక్తితోనే డైరెక్టర్ ప్రోత్సాహంతో సినిమాలో ఓ పాత్ర పోషించా. గురు చిందేపల్లి చెప్పిన కథ ఎంతో నచ్చి ఈ సినిమా చేశాం. హైదరాబాద్, మైసూర్, బెంగుళూర్‌లో దాదాపు 60 రోజుల పాటు షెడ్యూల్ చేశాం. షూటింగ్ దాదాపు పూర్తి కావచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ప్రారంభమైంది. త్వరలోనే ఫస్ట్‌లుక్‌ని రిలీజ్ చేస్తాం' అని నిర్మాత జి.సీతారెడ్డి తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సుక్కు, కెమెరా: ఎస్.మురళీమోహన్‌రెడ్డి, ఎడిటింగ్: వి.నాగిరెడ్డి. ఆర్ట్: బాబ్జీ.

కాలిపోయిన దీపిక ముఖాన్ని చూస్తారు


మేఘనా గుల్జార్

దీపికా పదుకొనె ప్రస్తుతం మేఘనా గుల్జార్ దర్శకత్వంలో 'ఛపాక్' చిత్రంలో నటించబోతుంది. యాసిడ్ దాడి బాధితురాలు లక్ష్మీ అగర్వాల్ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రమిది. ఈ సినిమా గురించి దర్శకురాలు మేఘనా గుల్జార్ చెబుతూ, 'నేను తెరకెక్కించబోయే 'ఛపాక్' సినిమాలో మీకు తెలిసిన దీపికా పదుకొనెని చూడరు. పూర్తిగా కాలిపోయిన దీపిక ముఖాన్ని చూస్తారు. లక్ష్మీ అగర్వాల్‌కి, దీపికకి దగ్గరిపోలికలున్నాయి' అని తెలిపింది. 'దీపిక అద్భుత నటి. నా పాత్రలో అద్భుతంగా నటిస్తుందని నమ్ముతున్నా' అని లక్ష్మీ అగర్వాల్ తెలిపారు.

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెలకోసారి విధిగా పంచాయతీ సమావేశాన్ని, రెండు నెలలకోసారి గ్రామ సభను నిర్వహించాలని తెలిపారు. వివాహ రిజిస్ట్రేషన్, జనన, మరణ రికార్డుల నిర్వహణ కూడా పంచాయతీల ఆధ్వర్యంలోనే జరగాలని సూచించారు. గ్రామంలో వ్యక్తిగత ఆస్తుల మ్యుటేషన్ (పేరు మార్పిడి)పై కూడా కొత్త పంచాయతీలు నిర్ణయం తీసుకోవాలన్నారు.



కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణనిచ్చే రిసోర్సు పర్సన్స్‌తో సీఎం కేసీఆర్ బుధవారం ప్రగతి భవన్‌లో సమావేశమయ్యారు. గ్రామాల్లోని రోడ్లపై చెత్తవేసే వారికి రూ.500 జరిమానా విధించాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించటానికి వీలుగా ట్రై సైకిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. డంపింగ్ యార్డులను ఏర్పాటు చేయాలి, వాడని బావులను, బోర్లను వెంటనే పూడ్చేయాలని సూచించారు. ప్రతీ ఇంటిలో కచ్చితంగా మరుగుదొడ్డి నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో వైకుంఠ ధామాలు (శ్మశాన వాటికలు) నిర్మించేందుకు వీలుగా పంచాయతీలు స్థలాలను కేటాయించాలని సూచించారు. ఒకవేళ పంచాయతీకి సంబంధించిన స్థలం లేకుంటే ప్రభుత్వ భూమిని వాడుకోవాలన్నారు. ఇవి రెండూ లేకుంటే పంచాయతీ నిధులతో కొనుగోలు చేయాలని సూచించారు. దాతలు ముందుకొస్తే వారి భూమిని తీసుకోవాలని, అన్ని గ్రామాల్లో ఆర్నెల్లలోగా శ్మశాన వాటికల నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు.

తెలంగాణ గ్రామాల్లో 2.02 కోట్ల జనాభా ఉందని సీఎం ఈ సందర్భంగా తెలిపారు. 14వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధికి ఏటా రూ. 1,628 కోట్లు వస్తాయి.. అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా జోడిస్తుంది.. ఆ ప్రకారంగా మొత్తం రూ.3,256 కోట్లు సమకూరుతాయి. దీని ప్రకారం ఒక్కో మనిషికి రూ.1,116 చొప్పున 500 జనాభా కలిగిన గ్రామానికి ఏటా రూ.8 లక్షలు వస్తాయి. జనాభా ఎక్కువున్న గ్రామాలకు ఇంకా ఎక్కువ నిధులొస్తాయి. ఇవిగాక రూ.3,500 కోట్ల మేర ఉపాధి హామీ నిధులు సమకూరుతాయి. వీటన్నింటినీ సమర్థవంతంగా వాడుకోవాలి. ఇవిగాక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద గ్రామాల అభివృద్ధి కోసమే రూ.480 కోట్లు వస్తాయి. ఇలా మూడు మార్గాల ద్వారా పంచాయతీలకు ఏడాదికి రూ.7,236 కోట్లు సమకూరుతాయని సీఎం చెప్పారు.

పంచాయతీలకు నిధులిస్తాం, విధులిస్తాం, బాధ్యతలను అప్పగిస్తాం, అన్నీ ఇచ్చినా కూడా పనిచేయని పంచాయతీల విషయంలో మాత్రం సీరియస్‌గానే ఉంటామని సీఎం హెచ్చరించారు. ప్రభుత్వం సమకూర్చిన నిధులను ఎలా ఖర్చు పెడుతున్నారో తెలుసుకోవటానికి వీలుగా 25 ఆకస్మిక తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒక బృందంలో నేనే ఉంటాను, దూర ప్రాంతాల్లో పర్యటించటానికి హెలికాప్టర్లు కూడా సమకూరుస్తాం. ఇలాంటి తనిఖీల ద్వారా ఏయే నిధులను ఎక్కడెక్కడ ఎలా ఖర్చు చేస్తున్నారనే విషయాలను ఆరా తీస్తాం, ఇంటెలిజెన్స్ ద్వారా కూడా సమాచారం తెప్పించుకుంటాం. ఎక్కడ తేడా వచ్చినా సర్పంచ్, గ్రామ కార్యదర్శులను సస్పెండ్ చేస్తాం. ఇందుకోసం చట్టంలో కూడా నిబంధనలు పొందుపరిచామని హెచ్చరించారు.

వీధి దీపాలు, ఇతరత్రా అవసరాల కోసం వాడే కరెంటుకు స్థానిక సంస్థలు బిల్లులను సరిగా చెల్లించటం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ సంస్థలకు పంచాయతీలు రూ.2,750 కోట్లు, మున్సిపాల్టీలు రూ.455 కోట్లమేర బకాయిలున్నాయి. మొత్తంగా రూ.3,025 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. అందువల్ల ఇప్పటినుంచి కరెంటు బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలి. జాప్యం చేసిన వారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

రాజమౌళిని ఆదర్శంగా తీసుకోండి..

గంగదేవిపల్లి మాజీ సర్పంచి కూసం రాజమౌళి గురించి సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. పంచాయతీరాజ్‌శాఖ ఎంపిక చేసిన రిసోర్సు పర్సన్లలో రాజమౌళి కూడా ఉన్నారు. దీంతో ఆయన్ను సీఎం సభకు పరిచయం చేశారు. ఆయన ఆదర్శ నాయకుడని కొనియాడారు. వేదిక మీది పిలిపించి, సీనియర్ అధికారులు, ఎమ్మెల్యేల సరసన కూర్చోబెట్టారు. రాజమౌళిని స్ఫూర్తిగా తీసుకుని గంగదేవిపల్లిలో గ్రామజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించానని గుర్తుచేశారు.

పెదిరిపాడు ఘటనపై ఖండన..

మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడు గ్రామంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ బాలప్పను నేలపై కూర్చోబెట్టిన సంఘటనను కేసీఆర్ ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించారు. ఇలా చేయటం దారుణమని అన్నారు. భవిష్యత్తులో ఇలంటి సంఘటనలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు డాక్టర్ రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్‌కే జోషితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థికి మద్దతు ఇవ్వలేదని..

నవతెలంగాణ- సుల్తానాబాద్‌రూరల్ /పెద్దపల్లి

పంచాయతీ ఎన్నికల్లో తమ సామాజిక తరగతి సర్పంచ్ అభ్యర్థికి మద్దతు ఇవ్వలేదని ఆరు కుటుంబాలను బహిష్కరించారు. ఈ విషయంపై బాధితులు బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నారాయణపూర్‌లోని వాల్మీకి బోయ సామాజిక తరగతికి చెందిన గుడుగుల అపర్ణ ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేశారు. అదే సామాజిక తరగతికి చెందిన కుడుదెల రమేష్, మండల వెంకటేష్, పెరుక సాగర్, గుడుగుల సది, మండల లచ్చయ్య, మండల చంద్రయ్య అపర్ణకు మద్దతు ఇవ్వలేదని పెద్ద మనుషులు పంచాయితీ పెట్టారు. ఆ ఆరు కుటుంబాలను కుల బహిష్కరణ చేశారు. ఈ విషయాన్ని ఈనెల 4వ తేదీన గ్రామంలో ఇంటింటా తిరుగుతూ చెప్పారు. ఎవరైనా వారిని ఇంటికి ఆహ్వానించినా, సాయం చేసినా రూ.50వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దీంతో బాధితులు బుధవారం పెద్దపల్లి ఆర్‌వో కార్యాలయంలో అధికారి అనంతరెడ్డికి, సుల్తానాబాద్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో ప్రజాసామ్యబద్ధంగా రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును వినియోగించుకున్నామని తెలిపారు. తమకు నచ్చిన వ్యక్తికి మద్దతు తెలిపితే కుల పెద్దమనుషులు తప్పుగా భావించి బహిష్కరించారని చెప్పారు. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా తమ ఆరు కుటుంబాలను పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను బహిష్కరించిన గుడుగుల సతీష్, గుడుగుల కొమురయ్య, గుడుగుల సది, మండల కొమురయ్య, కుడుదుల రాజేశం, పెరుక కనుకయ్యపై తగు చర్యలు తీసుకుని న్యాయం జరిగేలా చూడాలని పోలీసులను వేడుకున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల లచ్చయ్య, మండల చంద్రయ్య, పెరుక సాగర్, గుడుగుల సది, వెంకటేశం, ఈరయ్య, కె.రమేష్ ఉన్నారు.

ప్రేమించలేదని..

(మొదటిపేజీ తరువాయి)

రెండో కుమార్తె మధులిక. నల్లకుంట శివం రోడ్డులోని శరత్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. సత్యానగర్‌కే చెందిన వేణుగోపాల్-కళ్యాణిల కుమారుడు చిట్టుకూరి భరత్(19) రాంకోఠిలోని జాగృతి డిగ్రీ కాలేజీలో బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఒకే కాలనీ కావడం, మధులిక, భరత్ ఇండ్లు దగ్గర దగ్గరలోనే ఉండటంతో పరిచయం ఉంది. పరిచయాన్ని ఆసరా చేసుకుని తనను ప్రేమించాలంటూ ఏడాది కాలంగా మధులికను వేధిస్తున్నాడు. ఈ విషయంపై ఈనెల 7న బాలిక తల్లిదండ్రులు షీ టీమ్‌కు ఫిర్యాదు చేశారు. షీ టీమ్ సభ్యులు భరత్‌ను, ఇరు కుటుంబాల వారినీ పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రేమ పేరుతో ఇబ్బందులు కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భరత్‌ను, అతని కుటుంబ సభ్యులను హెచ్చరించారు. ఇక నుంచి ఆమె జోలికి వెళ్లనని భరత్ అక్కడ చెప్పాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే బుధవారం ఉదయం 8 గంటల సమయంలో మధులిక కాలేజీకి వెళ్తుండగా.. అక్కడ కాపుకాసిన భరత్ ఆమెను పక్కకు లాక్కెళ్లాడు. తన వెంట తెచ్చుకున్న కొబ్బరి బొండాల కత్తితో విచక్షణ రహితంగా బాలిక మెడపై, చేతులపై దాడి చేశాడు. అరుపులు, కేకలతో బాలిక రక్తపు మడుగులో కుప్పకూలిపోయింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న బాలికను స్థానికులు వెంటనే మలక్‌పేటలోని యశోద ఆస్పత్రికి తరలించారు. మధులిక తల, భుజం, చేతులపై తీవ్రగాయాలయ్యాయని డాక్టర్లు చెప్పారు. ఆమెకు తీవ్ర రక్తస్రావం అయిందన్నారు. తల వెనుకభాగంలో పెద్ద గాయమైందనీ, పుర్రె ఎముక విరిగి, బ్రెయిన్‌లో కొంత డ్యామేజ్ అయిందనీ వివరించారు. కోమాలో





ఉన్న మధులికకు వెంటిలేటర్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగానే ఉందనీ, 72 గంటలు గడిస్తేగానీ ఏ విషయం చెప్పలేమనీ డాక్టర్లు చెప్పారు.

దాడి జరిగిన ప్రాంతాన్ని ఈస్ట్‌జోన్ డీసీపీ రమేశ్ ఐపీఎస్, అడిషనల్ డీసీపీ గోవర్ధన్‌రెడ్డి, కాచిగూడ ఏసీపీ సుధాకర్, కాచిగూడ డీఐ యాదేందర్ పరిశీలించారు. క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

పోలీసుల అదుపులో భరత్

భరత్‌ను అరెస్టు చేసినట్టు తూర్పు మండల డీసీపీ రమేష్ తెలిపారు. కేసు వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ప్రేమను అంగీకరించలేదనీ, మాట్లాడటం లేదనీ మధులికపై భరత్ దాడి చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం ఆమెకు యశోదా ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. నిందితుడు భరత్ కోసం నాలుగు ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసి మూసీ నది ఒడ్డున పట్టుకున్నట్టు చెప్పారు. దాడికి ఉపయోగించిన కత్తిని అతని ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడి జరిగిన ప్రాంతంలో ఇరుకైన గల్లీలు ఉండటంతో స్థానికులు సకాలంలో స్పందించలేకపోయారన్నారు. నిందితునిపై హత్యాయత్నం, ఫోక్సో కింద కేసులు పెట్టి, కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ఎవరి దారి వారిదే

(మొదటిపేజీ తరువాయి)

కూటమి కోసం ప్రయత్నిస్తున్న తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుతో రాహుల్ స్నేహం కొనసాగుతున్నప్పటికీ రాష్ట్రంలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉన్నది. తెలుగుదేశం పార్టీతో ముందుకు పోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకు పోతుందని ఆ పార్టీ నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నప్పటికీ తెలంగాణ తెలుగుదేశం నేతలు మాత్రం ఆచి తూచి స్పందిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుల వ్యవహారాన్ని తమ నాయకుడు చంద్రబాబు చూసుకుంటారని వారంటున్నారు. ప్రజాకూటమి పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, టీజేఎస్ నేతలు ప్రస్తుతం ఎడమొహం పెడమొహంగానే వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో కూడా బల నిరూపణ కోసం కూటమి పార్టీలు విడి విడిగానే ప్రయత్నించాయి. ప్రజాకూటమిలోని భాగస్వామ్య పార్టీల మధ్య ఓట్ల బదలాయింపు జరగలేదని నాలుగు పార్టీలు భావిస్తున్నాయి. అందుకే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పొత్తులపై ఎవరూ ఆసక్తి చూపటం లేదు. ప్రజాకూటమికి చైర్మన్‌గా ఉన్న కోదండరాం కూడా జాతీయ స్థాయిలో జరిగిన ఒకటి రెండు సమావేశాల్లో పాల్గొనడం మినహా రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకూ ఇతర పార్టీల నేతలను కలవలేదు. కూటమి సమావేశం ఏర్పాటు చేయాలనే ప్రస్తావన కూడా జరగలేదు. ఈ సమావేశం అసలు జరుగుతుందా లేదా అనే అంశంపై కూడా ఎవరూ స్పష్టతనీయటం లేదు. పార్టీలో తలెత్తిన అంతర్గత విబేధాలతోనే కోదండరాం సతమతమవుతున్నట్టు ఆ పార్టీ నేతలే అంటున్నారు. పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేయటం ద్వారా పార్టీ క్యాడర్‌ను పెంచుకోవాలని, పార్టీ నిర్మాణం పూర్తి చేసుకోవాలని టీజేఎస్ నేతలు భావించినప్పటికీ ప్రజల వద్ద నుంచి ఆశించిన రీతిలో స్పందన రాక పోవటంతో చతికిలపడి పోయారు.

అందరికీ అక్కడే బలం...

ప్రజాకూటమిలోని కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ పార్టీలకు బలం కలిగిన ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్ లోక్‌సభ సీట్లపైనే మూడు పార్టీలు దృష్టిని కేంద్రీకరించాయి. ఖమ్మం లోక్‌సభ పరిధిలోని పాలేరు, మధిర, కొత్తగూడెం అసెంబ్లీ సీట్లలో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ వైరా స్థానంలో పోటీ చేసిన ఇండిపెంటెంట్ అభ్యర్తిని కూడా బలపరిచింది. పొత్తుల్లో భాగంగా అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో విజయం సాధించిన టీడీపీ ఖమ్మం స్థానంలో కూడా గణనీయంగా ఓట్లు సాధించింది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో తమ పార్టీ పోటీ చేస్తుందని విజయం సాధిస్తుందని కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ప్రకటించారు. ఇదే స్థానంలో టీడీపీ కూడా బరిలోకి దిగాలని యోచిస్తున్నది. ఇక సీపీఐ కూడా ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ స్థానాల్లో మూడు స్థానాల్లో పోటీ చేయాలని ఇప్పటికే నిర్ణయించింది. పొత్తులు ఉన్నా లేకున్నా రెండు స్థానాల్లో పోటీ చేస్తామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి సీపీఐ నేత నారాయణ పోటీ చేసి పరాజయం పాలయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రయోగం విఫలం కావంటంతో ఒంటరి పోరుకే కాంగ్రెస్ పార్టీ నేతలు మొగ్గు చూపుతున్నారు.

రెండు స్థానాల్లో పోటీ... చాడ



లోక్‌సభలో కూటమి పార్టీల మధ్య పొత్తులు ఉంటాయో లేదో చెప్పలేమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. పొత్తులు ఉన్నా లేకున్నా తమ పార్టీకి బలం ఉన్న ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో రెండు స్థానాల్లో పోటీ చేస్తామని ఆయన చెప్పారు. ఈ నెల 10 వ తేదీ తర్వాత దీనిపై పార్టీలో చర్చిస్తామన్నారు. వామపక్ష పార్టీల మధ్య ఐక్యత అవసరమేనని అందుకు తమ పార్టీ జాతీయ స్థాయిలో కూడా కృషి చేస్తున్నదని స్పష్టం చేశారు.

బాబు నుంచి ఎటువంటి ఆదేశాలు లేవు. ఎల్. రమణ



లోక్‌సభ ఎన్నికల్లో పొత్తులకు సంబంధించి చంద్రబాబు నుంచి ఎటువంటి ఆదేశాలు లేవని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్. రమణ తెలిపారు. తెలుగుదేశం పార్టీతో పొత్తు వల్లే తమకు నష్టం జరిగిందని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారంపై ఆయన మాట్లాడుతూ ఎవరి అభిప్రాయం వారిదన్నారు. లోక్‌సభ ఎన్నికల గురించి తమ పార్టీలో ఇంకా చర్చ జరగలేదన్నారు. చంద్రబాబు ఆదేశాలతో పాటూ స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తమ పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

కూటమి మనుగడలోనే ఉన్నది.. కోదండరాం



రాష్ట్రంలో ప్రజాకూటమి మనుగడలోనే ఉన్నదని టీజేఎస్ అధ్యక్షుడు, కూటమి చైర్మన్ కోదండరాం అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత భాగస్వామ్య పార్టీల మధ్య చర్చలు జరిగే అవకాశం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. తమ పార్టీ లోక్‌సభ ఎన్నికల గురించి పెద్దగా ఆలోచించటం లేదని, కేవలం పార్టీ నిర్మాణంపైనే దృష్టి పెట్టామని చెప్పారు.

జయరాం హత్య కేసు.. తెలంగాణకు బదిలీ

నందిగామ: కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్, ప్రవాసాంధ్రుడు చిగురుపాటి జయరాం హత్య కేసు తెలంగాణకు బదిలీ అయింది. ఘటన జరిగి తెలంగాణ పరిధి కావడంతో ఏపీ పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ సిటీ పోలీసులకు ఈ కేసును బదిలీ చేస్తున్నట్లు ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ ప్రకటించారు. ఈ అంశంపై ఏపీ పోలీసులు న్యాయనిపుణుల సలహా తీసుకుని నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో జయరాం భార్య పద్మశ్రీ నిన్న రాత్రి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఏపీ పోలీసులు కేసు బదిలీ ఆలోచన చేశారు. తెలంగాణ పోలీసులు ఈ కేసును విచారించాలంటూ పద్మశ్రీ నిన్న మీడియాతో పేర్కొన్న విషయం తెలిసిందే.

నిందితులకు రిమాండ్

జయరాం హత్యకేసు నిందితులను పోలీసులు నందిగామ కోర్టులో హాజరుపరిచారు. నిందితులు రాకేష్‌రెడ్డి, శ్రీనివాసులను రిమాండ్‌కు పంపుతూ న్యాయ మూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిందితులను నందిగామ సబ్‌జైలుకు తరలించారు.

కాగిత రహితంగా డిగ్రీ ప్రవేశాల కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రక్రియ మరింత సులభతరం చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు పలు సంస్కరణలు తీసుకురావాలని భావిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో చేపట్టే డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలను కాగిత రహితంగా చేపట్టాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగానే బుధవారం హైదరాబాద్‌లో దోస్త్ రాష్ట్రస్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎస్జీటీలకు న్యాయం చేయాలి: పీఆర్టీయూ తెలంగాణ

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు న్యాయం చేయాలని పీఆర్టీయూ తెలంగాణ కోరింది. ఈ మేరకు పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షులు ఎం అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చెన్నయ్య బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మోడీ వర్సెస్ మోడీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. 'దేశం, రాజ్యాంగ సంస్థలను కాపాడండి' నినాదంతో నిరసన ధర్నాలో కూర్చున్నారు. సీబీఐని కాపాడేపనిలో బీజేపీ నాయకులు వేగంగా పావులు కదిపారు. చట్టబద్ధమైన విధులను నిర్వర్తించకుండా సీబీఐని మమతా బెనర్జీ ఆపివేశారని కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.


అయితే బీజేపీ, నరేంద్రమోడీ నుంచి సీబీఐకి ఈ రకమైన రక్షణ ఎప్పుడూ ఉన్నదా? అంటే లేదనే చెప్పాలి. నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, మోడీ చేసిన ట్వీట్లను ఒకసారి పరిశీలిద్దాం. 2002 గుజరాత్ అల్లర్లు, నకిలీ ఎన్‌కౌంటర్లపై మోడీ, ఆయన సన్నిహిత సహచరులపై దర్యాప్తు జరుగుతున్నప్పుడు సీఎం మోడీ 2013లో చేసిన ట్వీట్లు.. ఇప్పటి మమతా బెనర్జీ ట్వీట్లతో చాలా పోలిక ఉన్నది. 'కట్టడిలేని దుర్వినియోగం సీబీఐపై జరుగుతున్నది. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకునే అన్వేషణలో నిఘా వ్యవస్థలు అణచివేతకు గురవుతున్నాయి' అని 2013లో సీఎం మోడీ ట్వీట్ చేశారు. అలాగే మోడీ ఇతర పాత ట్వీట్లను పరిశీలిస్తే... ప్రధాన మంత్రి మోడీకి అత్యుత్తమ విమర్శకుడు... బద్ధ శత్రువు సీఎం మోడీనే అని అర్థమవుతున్నది.

ఎఫ్‌డీఐలపై..

సింగిల్-బ్రాండ్ రిటైల్ ద్వారా 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు 2018 జనవరిలో మోడీ ప్రభుత్వం ఆమోదించింది. పెట్టుబడి, ఆదాయం, ఉపాధి పెరుగుదలకు ఎఫ్‌డీఐలు దోహదపడతాయని ప్రభుత్వం తెలిపింది. కానీ, మోడీ గత ట్వీట్లలో ఏం చెప్పారు? ఎఫ్‌డీఐలకు తాను అభిమానినికాదని సీఎం మోడీ తన ట్వీట్లలో పేర్కొన్నారు. 2012 డిసెంబరులో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఎఫ్‌డీఐ చట్టాన్ని తీసుకురావడాన్ని ఆయన విమర్శించారు. 'ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. రిటైల్‌లో ఎఫ్‌డీఐలు చిన్న దుకాణాలకు, తయారీరంగానికి తీవ్ర హాని చేస్తాయి. అది నిరుద్యోగాన్ని సృష్టిస్తుంది' అని సీఎం మోడీ ట్వీట్ చేశారు.

రూపాయి పతనంపైనా..

రూపాయి విలువ పడిపోతుండటం బహిరంగమే. 2018 ఆగస్టులో రూపాయి విలువ డాలరుకు 70.1కు పడిపోయింది. తన తప్పేమీ లేదని చేతులు దులుపుకునే పనిని మొదలుపెట్టింది ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం. 'రూపాయి పడిపోవడానికి బాహ్య కారకాలే' కారణమని పేర్కొన్నది. ఇతర కొన్ని కరెన్సీలతో



పోల్చిచూస్తే రూపాయి విలువ బాగానే ఉన్నదని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్.

రూపాయి అభాసుపాలుపై పీఎం మోడీ మౌనంగా ఉండిపోయారు. కానీ, 2013లో మాత్రం ఆయన మౌనంగా లేరు. యూపీఏ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'రూపాయి, యూపీఏ ప్రభుత్వం పల్టీ కొట్టడంలో పోటీపడుతున్నాయి. రూపాయిలాగే యూపీఏ ప్రభుత్వ పతనం కూడా ఖాయం' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

పెట్రోల్ ధరలపై...

పెట్రోల్ ధరలపై బీజేపీ అధికారిక ట్విట్టర్ అవమానకరమైన గ్రాఫిక్స్‌ను ట్వీట్ చేసింది. పెట్రోల్ ధరలు 2009, 2014లో కంటే 2018లో ఎక్కువగా ఉన్నప్పటికీ.. తక్కువగా ఉన్నట్టు చూపించే ప్రయత్నం చేశారు. 2018 సెప్టెంబరులో ఆ గ్రాఫిక్‌ను బీజేపీ అధికారిక ట్విట్టర్‌లో పోస్టుచేశారు. దీనిపై ప్రధాని మోడీతోపాటు, బీజేపీపై అనంతంగా ట్రోల్స్ వచ్చిపడ్డాయి కూడా.

'పెట్రోల్ ధరల్లో భారీ పెంపుదల కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ వైఫల్యానికి ప్రధాన ఉదాహరణ. దీనివల్ల వందల కోట్ల భారం గుజరాత్‌పై పడుతున్నది' అని 2012 మే 23న సీఎం మోడీ ట్వీట్ చేశారు. 'వైఫల్యం'పై నిర్వచనంలో వివక్షపై పీఎం మోడీ ట్విట్టర్‌లో తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నారు.

ఆధార్ సెక్యూరిటీ విషయంలో..

ఆధార్ వ్యవస్థపై నిరసనలు , భద్రతా ఉల్లంఘనపై భయాందోళనలు ఉన్నప్పటికీ, దేశంలో రోజువారీ జీవితంలో ఆధార్‌ను తప్పనిసరి అవసరంగా చేసింది మోడీ ప్రభుత్వం. వ్యక్తిగత గోప్యతకు సంబంధించి సుప్రీంకోర్టులో వాదోపవాదాలు జరిగాయి. గూగుల్ సెర్చ్‌లో ఆధార్‌లోని వ్యక్తిగత సమాచారాన్ని వేలాది డేటాబేస్‌లు వెల్లడిస్తున్నప్పుడు భద్రతా ఆందోళనను యూఐడీఏఐ పక్కనపెట్టింది, తోసిపుచ్చింది.

దేశాధినేత మోడీ మాట్లాడుతూ 'మోసపూరితమైన, అవినీతిపరులైన వారిపై ఆధార్ ప్రతికూల ప్రభావం చూపుతున్నది. దీనిని వ్యతిరేకించడానికి అసలు కారణం ఇదే' అని పీఎం మోడీ ట్వీట్ చేశారు. అయితే, 2014లో ఆయనకు భద్రతా సమస్యలే ముందుకొచ్చాయి. 'ఆధార్‌తో వచ్చే భద్రతాపరమైన ముప్పుపై తన ప్రశ్నలకు ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ సమాధానం చెప్పలేరు. రాజకీయ జిమ్మిక్కు తప్ప.. విజన్ ఏదీ లేదు' అని సీఎం మోడీ 2014 ఏప్రిల్‌లో ట్వీట్ చేశారు.

రేవంత్‌ను అక్రమంగా నిర్బంధించలేదు

- హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం



హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రేవంత్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా నిర్బంధిం చలేదని హైకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. రేవంత్‌రెడ్డి అరెస్ట్‌కు దారితీసిన పరిస్థితుల్ని కోర్టుకు సవివరంగా తెలియజేస్తామని పేర్కొంది. ఇందుకు కొంత సమయం కావాలని కోరడంతో అందుకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్‌లతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. రేవంత్‌ను పోలీసులు అర్ధరాత్రి అక్రమంగా నిర్బంధించారంటూ ఆయన సన్నిహితుడు వేం నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు మరోసారి విచారించింది. తెలంగాణ ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదిస్తూ.. రేవంత్‌ది అక్రమ నిర్బంధం కానేకాదని, సీఎం కేసీఆర్ పాల్గొనబోయే సభను అడ్డుకుని గొడవలు సృష్టించబోతున్నారని ఇంటెలిజెన్స్ హెచ్చరిక నేపథ్యంలో ముందస్తుగా అరెస్ట్ చేయాల్సివచ్చిందన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డిని పోలీసులు విడుదల చేశారని, ఈకేసును క్లోజ్ చేయాలని, విచారణ చేయాల్సిన అవసరం లేదన్నారు. దీనిపై రేవంత్‌రెడ్డి తరఫు సీనియర్ లాయర్ సీవీ మోహన్‌రెడ్డి అభ్యంతరం చెప్పారు. అర్ధరాత్రి పోలీసులు రేవంత్‌రెడ్డి ఇంటికి వచ్చి అక్రమంగా నిర్బంధించారని, గతంలో భీమ్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు రూ.50 లక్షలను పరిహారంగా చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డికి కూడా పరిహారం చెల్లించాల్సిందేనని, అది లక్షల రూపాయల్లోనే అవసరం లేదని, ఒక్క రూపాయి ఇచ్చినా తమకు సమ్మతమేనన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రేవంత్‌కు ఎంత పరిహారం చెల్లిస్తారో కూడా ప్రభుత్వం చెప్పాలని కోరింది. ప్రభుత్వం వివరాల సమర్పణ కోసం విచారణ 25కి వాయిదా పడింది.

మీ వైఖరేంటీ..?

(మొదటిపేజీ తరువాయి)

పిటిషనర్ లాయర్ భుజంగరావు వాదించారు. సమయం కావాలని ప్రభుత్వం కోరడంతో కేసు విచారణ రెండు వారాలకు వాయిదా పడింది. లోకాయుక్తా,ఉప లోకాయుక్తా నియామకాలెప్పుడు.!

లోకాయుక్త, ఉప లోకాయుక్తల నియామాకాలు చేయాలనే వ్యాజ్యంపై రెండు వారాల్లోగా ప్రభుత్వ వైఖరిని తెలియజేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. లోకాయుక్త, ఉప లోకాయుక్తలను నియమించేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ సెక్రెటరీ ఎం.పద్మనాభరెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. ప్రభుత్వం రెండు వారాల్లోగా తన నిర్ణయాన్ని తెలియజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. లోకాయుక్తలో అయిదు వేల పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, అవినీతి అధికారులు, ప్రజాప్రతినిధులపై కేసుల విచారణకు వాటిని వెంటనే వాటిని నియమించాలని పిటిషనర్ లాయర్ రచనారెడ్డి తమ వాదనల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిని తెలియజేసేందుకు సమయం కావాలని అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ కోరారు. దాంతో కేసు విచారణ రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

మహిళల ప్రవేశానికి ఓకే

న్యూఢిల్లీ : కేరళలోని శబరిమల ఆలయ నిర్వహణను పర్యవేక్షిస్తున్న ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) యూటర్న్ తీసుకుంది. అన్ని వయసుల మహిళలకు అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశాన్ని కల్పిస్తూ గతేడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు వెలువరించిన చారిత్రాత్మక తీర్పును గౌరవిస్తామని తెలిపింది. కాగా, ఈ తీర్పును సమీక్షించాలని దాఖలైన పిటిషన్ల వాదనలను సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం విన్నది. ఈ తీర్పునకు సంబంధించి 56 రివ్యూ పిటిషన్లు, 4 రిట్ పిటషన్లు సహా మొత్తం 65 పిటిషన్లు దాఖలయ్యాయి. సెప్టెంబర్ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు స్వీకరణపై తీర్పును రిజర్వ్‌లో ఉంచినట్టు ధర్మాసనం తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదని కేరళ ప్రభుత్వం అభిప్రాయపడింది. టీడీబీ అధ్యక్షుడు పద్మకుమార్ మాట్లాడుతూ.. తాము సుప్రీంకోర్టును తీర్పును గౌరవిస్తున్నారని తెలిపారు. కోర్టు నిర్ణయ మేదైనా అంగీకరిస్తారని చెప్పారు. ఈ తీర్పుపై రివ్యూ పిటిషన్లు అవసరమే లేదని అన్నారు. తీర్పును అమలు చేసేందుకు కొంత సమయం కావాలని, ఎలాంటి వివక్షా ఉండకూడదనే కోరుకుంటున్నట్టు తెలిపారు.

ప్రియాంక ఎంట్రీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోదరి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. తన భర్త రాబర్ట్ వాద్రను.. మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కార్యలయం వద్ద డ్రాప్ చేసిన అనంతరం ఆమె ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా, తూర్పు యూపీ ఇంచార్జీగా బాధ్యతలు స్వీకరించారు. రాహుల్ గాంధీ.. ఆమెను ఈ పదవుల్లో గతనెల 23న నియమించిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని అక్బర్ రోడ్ ఏఐసీసీ ప్రధాన కార్యలయంలో రాహుల్ చాంబర్ పక్కనే ఆమె కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె నేడు(గురువారం) తొలి అధికారిక సమావేశంలో పాల్గొననున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించే వ్యూహంపై అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఇంచార్జులతో రాహుల్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాగా, మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన భర్త రాబర్ట్ వాద్రాకు బాసటగా ఉంటానని ఆమె తెలిపారు.

నింగిలోకి జీశాట్-31

(మొదటిపేజీ తరువాయి)

అనువైన ఫ్రీక్వెన్సీని అందిస్తూ దేశ ప్రధాన భూభాగం, దీవులలో సమాచార సేవలను మెరుగుపర్చడానికి దోహదం చేస్తుందని ఇస్రో చైర్మెన్ కె శివన్ హర్షం వ్యక్తం చేశారు. జీశాట్-31 ప్రయోగం విజయవంతం కావడం పట్ల సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్(ఎస్‌డీఎస్‌సీ) డైరెక్టర్ ఎస్ పాండియన్.. శాటిలైట్‌ను కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఏరి యాన్‌స్పేస్‌కు అభినందనలు తెలిపారు. జీశాట్-31 భారత 40వ సమాచార ఉపగ్రహం. ఇది త్వరలో జీవితకాలం ముగిసిపోయే ఇన్‌శాట్ ఉపగ్రహ స్థానాన్ని భర్తీ చేయనున్నది. జీశాట్-31 ఉపగ్రహం బరువు 2,535 కిలోగ్రాములు. దీని కాలపరిమితి 15 సంవత్సరాలు. భూస్థిర కక్ష్యలోని కేయూ బ్యాండ్ సామర్థ్యానిన ఇది పెంచు తుందని స్పేస్ ఏజెన్సీ తెలిపింది. అలాగే వీశాట్ నెట్వర్క్, టెలివిజన్ అప్‌లింక్స్, డీటీహెచ్ టీవీ సర్వీసులతో పాటు అనేక ఇతర అప్లికేషన్లకు అనుగుణంగా సేవలను అందించడం దీని సొంతం. కాగా, ఇస్రోకు చెందిన మరో ఉపగ్రహం జీశాట్-30ని కూడా ఏరియాన్‌స్పేస్ ప్రయోగించనున్నది.

పెండ్లికి వెళ్ళి వస్తుండగా...

నవతెలంగాణ- నేలకొండపల్లి

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెండ్లికి వెళ్లి బైక్‌పై వస్తున్న కుటుంబాన్ని మృత్యురూపంలో వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరు చిన్నారులతో సహా నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

మండల కేంద్రంలోని సింగారెడ్డిపాలెం రెవెన్యూ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన పాలపాటి వెంకటేశ్వర్లు(40)ది నిరుపేద కుటుంబం. పెయింటింగ్ వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య, తల్లి కూడా కూలీ పనులకు వెళ్తారు. వారికి ఇద్దరు కొడుకులు కోదండరామ్(8), ప్రణయ్(6). మంగళవారం సాయంత్రం ముదిగొండ మండలం వెంకటాపురంలో బంధువుల ఇంట్లో పెండ్లి కోసం వెంకటేశ్వర్లు తల్లితో పాటు కుమారులిద్దరినీ తీసుకెళ్లాడు. ఫంక్షన్ అయిపోయిన తర్వాత అర్ధరాత్రి బైక్‌పై తల్లిని, కుమారులను ఎక్కించుకొని బయలుదేరాడు. కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనగా, కట్టలమ్మ చెరువు నక్కల తూము వద్ద గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను తరలించే క్రమంలో పొట్టిశ్రీరాములు సెంటర్‌లోకి రాగానే బాధిత కుటుంబీకులు, బంధువులు తమకు న్యాయం చేయాలంటూ రహదారిపై బైటాయించారు. స్థానిక ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రావాలనీ, తమకు న్యాయం చేయాలనీ నినాదాలు చేశారు. భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎస్ఐ గౌతమ్ అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

సెన్సెక్స్ ▲358 36,975 | నిఫ్టీ ▲128 11,062 | డాలరుకు రూపాయి విలువ 71.56



బంగారం (10 గ్రా) రూ. 33,350



వెండి (కేజీ) రూ. 40,240



కోడిగుడ్లు (వందకి)

హైదరాబాద్	400	విజయవాడ	397
ఒక్కగుడ్డుకు	4.50	చెన్నై	435
వరంగల్	399	ముంబయి	450




ఆగమవుతున్న అడాగ్ మదుపర్లు!

- 22 -53% మేర పతనమైన కంపెనీల షేర్లు
- రూ.10,116 కోట్ల మదపపరుల సొత్తు ఆవిరి



న్యూఢిల్లీ : అనీల్ అంబానీకి చెందిన అతిపెద్ద వ్యాపార సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) అప్పులు చెల్లించలేక బ్యాంకు దివాలా బాట పట్టడంతో ఆయనకు చెందిన కంపెనీల షేర్లు భారీగా పతనమవుతూ వస్తున్నాయి. గత రెండు రోజులుగా కుంగుతూ వస్తోన్న అనీల్ సంస్థల షేర్లు బుధవారం మరింతగా క్షీణించాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంట్రా ట్రేడింగ్‌లో 38 శాతం క్షీణించగా, ఆర్‌కామ్ షేర్ ముఖ విలువ స్థాయికి దిగజారింది. బీఎస్ఈలో ఆర్‌ఇన్‌ఫ్రా షేర్ క్రయ, విక్రయాలు పది రెట్లు పెరిగాయి. ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో ఆర్‌ఇన్‌ఫ్రా షేర్లు ఒక్క పూటలోనే 9.6 కోట్ల ఈక్విటీలు లేదా 35 శాతం చేతులు మారాయి. సెన్సెక్స్‌లో తుదకు ఈ సూచీ 32 శాతం పతనమై రూ.154 వద్ద ముగిసింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ 40 విత్త సంస్థలకు దాదాపుగా రూ.45వేల కోట్ల అప్పులు చెల్లించాల్సి ఉంది. మరోవైపు గత కొన్ని నెలలుగా ఎరిక్‌సన్ తమ బకాయి చెల్లింపులు చేయాలని సుప్రీంకోర్టు ద్వారా ఆర్‌కాంపై తీవ్ర ఒత్తిడిని తీసుకొస్తుంది. ఆర్‌కాం ఆస్తుల విక్రయానికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌కాం అనుహ్యంగా దివాళా పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) ద్వారా ఫాస్ట్ ట్రాక్ తీర్మానం కోరుతూ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నిర్ణయం చేశారు. ఈ పరిణామం స్టాక్ మార్కెట్‌లో ఆ కంపెనీ సూచీలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆర్‌కామ్ ఇంట్రా ట్రేడింగ్‌లో ఏకంగా 11 శాతం నష్టపోయి రూ.4.85 వద్ద ముగిసింది. తుదకు 0.7 శాతం నష్టంతో రూ.5.44 వద్ద ముగిసింది. బిఎస్ఇలో క్రితం మూడు సెషన్లలో రిలయన్స్ నిప్పన్ లైఫ్ అసెట్ మేనేజమెంట్ స్టాక్ మాత్రం 20 శాతం పెరిగింది. మిగితా ఆరు అడాగ్ కంపెనీల షేర్లు 22 శాతం నుంచి 53 శాతం వరకు పడిపోయాయి. వీటి ఉమ్మడి మార్కెట్ కాపిటలైజేషన్ విలువ దాదాపుగా 30 శాతం లేదా రూ.10,116 కోట్లు పడిపోయింది.

స్టాక్ మార్కెట్లలో దూకుడు



- సెన్సెక్స్ 358 పాయింట్ల ర్యాలీ

ముంబయి: రానున్న పరపతి విధాన సమీక్షలో భారతీయ రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించనుందన్న అంచనాల నేపథ్యంలో బుధవారం స్టాక్ మార్కెట్లు పరుగులు పెట్టాయి. మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో బీఎస్‌సీ సెన్సెక్స్ 358 పాయింట్లు (0.98 శాతం రాణించి) 36,975.23 పాయింట్లకు చేరింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 128.10 పాయింట్లు (1.17 శాతం) లాభపడి 11,062.45 పాయింట్ల వద్ద ముగిసింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష మూడు రోజుల సమీక్ష మంగళవారం ప్రారంభమైంది. కాగా గురువారంతో ముగియనున్న ఈ భేటీలో కీలక వడ్డీ రేట్లను తగ్గించొచ్చని ఆశల్లో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. సెన్సెక్స్‌లో బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ బజాజ్ ఆటో, సన్ ఫార్మా సూచీలు అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరసలో ఉండగా.. మరోవైపు యాక్సిస్ బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకులు అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

డిపాజిట్లకు డిమాండ్!

- 13 నెలల్లో బ్యాంక్స్‌కు 20లక్షల కోట్లు కావాలి
- భారీగా పెరుగనున్న భారత 'క్రెడిట్ డిమాండ్'
- నిధుల కోసం ప్రజాకర్షక పథకాల్లోకి బ్యాంకులు
- ప్రయివేటు బ్యాంక్స్ ఖాతాల్లోకే 60% డిపాజిట్లు
- 30- 35 శాతానికే పరిమితం కానున్న పీఎస్బీలు

న్యూఢిల్లీ: దేశంలో రుణ అవసరాలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో.. రానున్న రోజుల్లో బ్యాంకు డిపాజిట్లకు గిరాకీ బాగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి బ్యాంకులకు దాదాపు రూ.20 లక్షల కోట్ల మేర నిధులు అదనంగా అవసరమవుతాయని.. ఈ మేరకు బ్యాంకులు ప్రజల నుంచి డిపాజిట్లను సేకరించేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ ప్రయత్నాలలో భాగంగానే రానున్న రోజుల్లో బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీ రేట్లను గణనీయంగా పెంచే అవకాశం ఉందని ఆర్థిక రంగ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నిధుల సమీకరణలో ప్రభుత్వ బ్యాంకుల కంటే కూడా ప్రయివేటు బ్యాంకుల మెరుగ్గా వినియోగించుకొనే అవకాశం ఉందని దేశీయ క్రెడిట్ రేటింగ్ సంస్థ క్రిసిల్ వెల్లడించింది. అధిక వడ్డీ ఆదాయం ఇచ్చే ఇతర పెట్టుబడుల మార్గాలతో పోలిస్తే.. గత కొద్ది రోజులుగా బ్యాంకు డిపాజిట్లపై వడ్డీరేట్లు తగ్గుతూ వచ్చాయి. దీనికి తోడు మోడీ సర్కారు చేపట్టిన నోట్ల రద్దుతో పాటు బ్యాంకుల బాదుడుకు జంకుతున్న ప్రజలు.. బ్యాంకులకు వెళ్లేందుకు ఇష్టపడని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులలో ప్రజల డిపాజిట్లు తగ్గుతూ వస్తున్నాయి. ఫలితంగా గత కొన్ని సంవత్సరాలుగా బ్యాంకులు సగటున ఏడాదికి రూ. ఏడు లక్షల కోట్ల మేర డిపాజిట్లను మాత్రమే సమీకరిస్తూ వస్తున్నాయి. ఇప్పుడు రుణ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బ్యాంకుల తమ అవసరాల కోసం ప్రజాకర్షకంగా మరిన్ని డిపాజిట్లను సమీకరించాల్సిన ఆవశ్యకత ఏర్పడనుంది. దీంతో రానున్న రోజుల్లో ప్రజలకు బ్యాంక్ డిపాజిట్ల నుంచి అధిక వడ్డీ ఆదాయం లభించనుంది. ఈక్విటీ మార్కెట్లలో తీవ్ర ఊగిసలాటతో పాటు ఇతర పెట్టుబడి విధానాల్లో కూడా వడ్డీరేట్లు తగ్గుతుండడంతో పాటు.. ఇటీవలి కాలంలో బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీరేట్లను 0.40 శాతం నుంచి 0.60 శాతం మేర పెంచాయి. దీంతో గత కొన్ని నెలల నుంచి డిపాజిట్లపై వడ్డీరేట్లు వృద్ధి చెందుతూ వస్తున్నాయి. ప్రజలు తమ సొమ్మును దాచుకొనేందుకు బ్యాంకులే సురక్షితమైనవన్న భావన మళ్లీ పెరుగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో డిపాజిట్లను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు గాను బ్యాంకులు పలు చర్యలకు దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెరుగనున్న డిపాజిట్ల సేకరణలో బలమైన బ్యాలెన్స్ షీట్ కలిగిన ప్రయివేటు బ్యాంకుల సింహ భాగాన్ని తమ ఖాతాలో వేసుకొనే అవకాశం ఉందని క్రిసిల్ తెలిపింది. ఈ బ్యాంకులు దాదాపు 55-60 శాతం డిపాజిట్లను చేజిక్కించుకోవచ్చని విశ్లేషించింది. ఇదే సమయంలో ఆర్బీఐ పీసీఏ ఆంక్షలను ఎదుర్కొంటున్న బ్యాంకులతో కలుపుకొని ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్బీ) కేవలం 30-35 శాతం డిపాజిట్లను మాత్రమే చేజిక్కించుకొనే అవకాశం ఉన్నట్టుగా క్రిసిల్ తెలిపింది. గడిచిన ఐదేండ్ల కాలంలో ప్రయివేటు బ్యాంకుల మొత్తం డిపాజిట్లు ఏడు శాతం వృద్ధితో 30 శాతానికి చేరువయ్యాయని నివేదిక వెల్లడించింది.



క్రెడిట్-డిపాజిట్ల నిష్పత్తిలో జూమ్!

2017-18 ఆర్థిక సంవత్సరంలో 8 శాతంగా ఉన్న రుణాల వృద్ధి రేటు 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరంలో 13-14 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని క్రిసెల్ అంచానా వేస్తోంది. ఇదే సమయంలో 2018 ఆర్థిక సంవత్సరానికి 6 శాతంగా ఉన్న డిపాజిట్ల పెరుగుదల రేటు ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరానికి 10 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని రేటింగ్ సంస్థ లెక్కగట్టింది. అయితే ఇది 2007 ఆర్థిక సంవత్సరం డిపాజిట్ల వృద్ధిరేటు25 శాతంతో పోలిస్తే తక్కువేనని పేర్కొంది. 2017 మార్చి నాటికి 73 శాతంగా ఉన్న క్రెడిట్-డిపాజిట్ల నిష్పత్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి 78 శాతానికి చేరుకొనే అవకాశం ఉందని రేటింగ్ సంస్థ లెక్కగట్టింది.

బాస్ మరణం.. వందల కోట్లు బ్లాక్

- నిలిచిపోయిన 'కెనడా క్రిప్టో కరెన్సీ' సేవలు..
- అందోళనలో 1.15 లక్షల మంది ఖతాదార్లు
- దాదాపు రూ.982 కోట్ల సొమ్ముపై నీలినీడలు



అట్టావా: క్వాడ్రిగా-సీఎక్స్ అనే కెనడా క్రిప్టో కరెన్సీ కంపెనీ వ్యవస్థాపకులు, అధ్యక్షుడు జెరాల్డ్ కాటెన్ మరణించడంతో ఖాతాదారుల ఆందోళనకు గురవుతున్నారు. క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ ప్లాట్‌ఫాంనకు సంబంధించిన పాస్‌వర్డ్‌లు, రికవరీ కీ తదితర ముఖ్యమైన సమాచారం కేవలం గెరాల్డ్‌కు మాత్రమే తెలవడం.. గత డిసెంబరులో ఆయన ఆకస్మికంగా కన్నుమూయడంతో ఖాతాదారులు ఆందోళనకు గురవుతున్నారు. పాస్‌వర్డ్, రికవరీ కీ మరెవ్వరికీ తెలియకపోవడంతో, దాదాపు 187 మిలియన్ల కెనడా డాలర్లు (రూ.982 కోట్లు) ఫ్రీజ్ అయిపోయాయి. దీంతో ఈ సమస్య పరిష్కారానికి టెక్ నిపుణులు అష్టకష్టాలు పడుతున్నారు. అయినా ఎలాంటి ఫలితం కనిపించకపోవడంతో సంస్థలో ఇతర అధికారులు తలలు పట్టుకున్నారు.

గెరాల్డ్ నిజంగా చనిపోయారా..?

ఇండియాలో ఒక అనాథాశ్రయానికి సేవలందిస్తున్న క్రమంలో గెరాల్డ్ కాటన్ డిసెంబరు 9న చనిపోయారని జనవరి 14న సోషల్ మీడియా ద్వారా కంపెనీ ప్రకటించింది. మరోవైపు గెరాల్డ్ ఎలా చనిపోయాడు? నిజంగా చనిపోయాడా లేదా కంపెనీ మోసం చేస్తోందా లాంటి పలు అనుమానాలు, ప్రశ్నలతో ఆన్‌లైన్ దుమారం రేగుతోంది. అంతేకాదు గెరాల్డ్ భార్య జెన్నిఫర్ రాబర్ట్‌సన్‌కు వేధింపులు, బెదిరింపులు తీవ్రమయ్యాయి. దీంతో వీటిని నుంచి తనకూ, కంపెనీకి రక్షణ కల్పించాల్సిందిగా కోర్టును ఆశ్రయించారు. దీంతో బిట్‌కాయిన్, లైట్ కాయిన్, ఎథిరియం లాంటి డిజిటల్ కరెన్సీ ట్రేడింగ్ ప్లాట్‌ఫాం క్వాడ్రిగా సీఎక్స్ ఎక్స్చేంజీకి నోవా స్కోటియా ఉన్నత న్యాయస్థానం దివాలా రక్షణను మంజూరు చేసింది. ఈ వేదికపై కరెన్సీ ట్రేడింగ్ కూడా నిలిపివేసింది. కేవలం అతనికి మాత్రమే తెలిసిన పాస్‌వర్డ్‌లు ఎక్కడా రాసిపెట్టలేదని, దీంతో వాటిని కనుక్కోవడం చాలా కష్టంగా మారిందంటూ కంపెనీ తరపున జెన్నిఫర్ రాబర్ట్‌సన్ అఫిటవిట్ దాఖలు చేశారు. అలాగే గెరాల్డ్ సెల్‌ఫోన్లు, ఇతర కంప్యూటర్లలోని సమాచారం కోసం సంబంధిత ఎన్క్రిప్షన్లను ఛేదించడానికి నిపుణులతో ప్రయత్నిస్తున్నామనీ, కానీ ఫలితం లభించలేదన్నారు. క్వాడ్రిగాలో 363,000 యూజర్లు నమోదుగాకా, సుమారు లక్షా పదిహేను వేలమంది యూజర్లకు 250 మిలియన్ల కెనడా డాలర్లు రుణపడి ఉన్నామని కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో రాబర్ట్‌సన్ పేర్కొన్నారు. అటు ఇన్వెస్టర్లు కూడా ఈ వ్యవహారంపై న్యాయ పోరాటానికి సిద్ధపడుతున్నారు.

టాటా ట్రస్ట్‌కు ఐటీశాఖ షాక్



ముంబయి: టాటా గ్రూప్‌నకు సంబంధించిన సర్ దోరబ్‌జీ టాటా ట్రస్ట్‌కు ఆదాయపు పన్ను శాఖ (ఐటీ శాఖ) షాక్ ఇచ్చింది. ఈ సంస్థకు పన్ను మినహాయింపును రద్దు చేసింది. మినహాయింపులు పొందేందుకు పాటించాల్సిన నిబంధనలను ఉల్లంఘించడంతో డిసెంబర్ 31న ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ట్రస్ట్‌లోని ట్రస్టీ సభ్యుడు ఆర్. వెంకటరమణన్‌కు పరిహారం చెల్లింపు విషయంలో ఉల్లఘనలు చోటు చేసుకొన్నట్లు ఐటీ శాఖ పేర్కొంది. 2015-16 సంవత్సరానికి వెంటక రామన్‌కు రూ.2.5 కోట్లు పరిహారంగా చెల్లించినట్లు గుర్తించింది. ఇది అధిక మొత్తమని.. దీనిపై వివరణ ఇవ్వాలని ఐటి శాఖ ఆదేశించింది. కాగా దీనిపై ఆ సంస్థ వివరణ ఇవ్వకపోవడంతో ఐటీ శాఖ పన్ను మినహాయింపును రద్దు చేసింది.

విలీనమైనా.. వీడని నష్టాలు



న్యూఢిల్లీ: జియో దెబ్బను ఎదుర్కొని పోరాడేందుకు జట్టుకట్టిన వొడాఫోన్- ఐడియా సంస్థలకు ఆర్థిక కష్టాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. ఈ రెండు సంస్థలు విలీనమైనప్పటికీ గత డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో ఈ సంస్థలు దాదాపు రూ.5,005.7 కోట్ల నష్టాలను నమోదు చేశాయి. ఇంతక్రితం ఏడాది త్రైమాసికంలో వొడాఫోన్, ఐడియా కంపెనీలు సంయుక్తంగా రూ.1,284.5 కోట్ల నష్టాలు నమోదు చేశాయి. 2018 ఆగస్టులో ఈ రెండు కంపెనీలు విలీనం అయ్యాయి. క్రితం క్యూ3లో వొడాఫోన్ ఐడియా మొత్తం ఆదాయం 52 శాతం పెరిగి రూ.11,982.8 కోట్లకు చేరింది. ఇంతక్రితం జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.7,878.6 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది.

సుప్రీం కోర్టులో 'స్టే' ఎత్తివేయాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్ల క్రితం (06.02.2006) హైకోర్టులో ఐదుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసం ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో స్టే ఎత్తివేయాలని భారత ప్రజాన్యాయవాదుల సంఘం (ఐపీఎల్) డిమాండ్ చేసింది. దేశంలో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేసింది. బుధవారం ఎన్ఎస్-ఎస్‌లో ఐపీఎల్ నాయకులు డి సురేష్‌కుమార్, ఎం వెంకన్న, బల్ల రవీంద్రనాథ్ సంయుక్తంగా విలేకరులతో మాట్లాడారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైందని, ఆ తీర్పు దేశ చరిత్రలో నిలిచిపోయిందని చెప్పారు. ఆనాడు రాష్ట్రంలో బూటకపు ఎన్‌కౌంటర్లపై అనేక వ్యాజ్యాలు కోర్టు దృష్టికి వెళ్లడంతో ఐదుగురుసభ్యులతో కూడిన విస్తృత ధర్మాసం కీలక తీర్పును వెలువరించిందని గుర్తు చేశారు. ఆయా ప్రభుత్వాలు సుప్రీం కోర్టుకు వెళ్లగా ఆ తీర్పుపై స్టే విధించిందన్నారు. వెంటనే సుప్రీం కోర్టులో ఎన్‌కౌంటర్లపై స్టే ఎత్తి వేసి, తదుపరి వాదనాలు వినాలని కోరారు. దేశంలోని ప్రాంతాల్లో కొనసాగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఎక్కడా ఎదురు కాల్పులు జరిగినా పోలీసులపై దర్యాప్తు జరగడం లేదని చెప్పారు. ఇవన్నీ ఎన్‌కౌంటర్లు కావని, సర్కారు హత్యలేనని అభిప్రాయపడ్డారు. ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న అధికారుల పేర్లు బహిర్గతం చేయాలని, కచ్చితంగా పోలీసు డైరీలో రాయాలని, వారిపై విచారణ జరిపి, హత్యానేరం నమోదు చేయాలని తీర్పులో పేర్కొందన్నారు. కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరహక్కుల కోసం పోరాడుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని అనేక చట్టాలను ప్రయోగిస్తున్నారని చెప్పారు. ఇలాంటి సంఘటనలపై మేజిస్ట్రేషియల్ విచారణ జరిపించాలన్నారు. కానీ శాఖాపరమైన దర్యాప్తు జరిపి వారికి అనుకూలంగా నివేదిక ఇస్తున్నారని ఆరోపించారు. ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపామని చెబుతున్నా పోలీసులు దానికి ప్రాతిపదిక ఏమిటని వారు ప్రశ్నించారు.

'అవినీతి అధికారులతో మచ్చ'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ పాలన పారదర్శకంగా ఉన్నప్పటికీ అవినీతి అధికారులతో తెలంగాణకు మచ్చ వస్తున్నదని వరంగల్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ శివ ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం ఇవ్వకపోతే అధికారులు ఒక్క పని కూడా చేయట్లేదని ఆరోపించారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తొలి స్థానంలో ఉన్న తెలంగాణ....అవినీతిలో రెండో స్థానంలో ఉన్నదని గుర్తుచేశారు. ప్రభుత్వం అనుకున్నంతగా క్షేత్రస్థాయిలో పనిజరగట్లేదని, అవినీతి పెచ్చుమీరిపోతున్నదని అన్నారు. అవినీతిపై పలు సర్వేలు చేశామని, సీఎంకు విన్నవిద్దామని పలు ప్రయత్నించినప్పటికీ కలిసే అవకాశం రాలేదన్నారు. కిందిస్థాయి అధికారులపై ఉన్నతాధికారుల నిఘా లేకపోవడం, వారిపై పట్టు లేకపోవడం, ముఖ్యంగా థర్డ్ పార్టీ విచారణలు లేకపోవడం కూడా భారీ ఎత్తున అవినీతికి కారణమన్నారు. లంచాలను నివారించడం చేతకాకపోతే చట్టబద్ధమైన చేయాలన్నారు.

'యాత్ర' చిత్రాన్ని పీసీసీకి చూపించాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బయోపిక్ చిత్రాన్ని పీసీసీ అధ్యక్షులకు చూపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ చరిత్రను వక్రీకరిస్తే తెలుగు రాష్ట్రాల్లో నిరసన తప్పదన్నారు. యాత్ర చిత్రంలో సోనియా, రాహుల్‌గాంధీలను కించపరిచేలా ఉంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రుణాలు..ఎన్నికల వాగ్ధానాలేనా?

ఎంబీసీ సంఘం ఆగ్రహం

- వెంటనే విడుదల చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న ఆశయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ముందస్తు ఎన్నికలకు ముందు వెనుకబడ్డ కులాలకు రుణాలు ఇచ్చి ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా వాటి గురించి ప్రస్తావించడం లేదు ఇది కేవలం ఒక ఎన్నికల స్టంట్ అని విమర్శించింది. కేవలం శాసనసభ ఎన్నికల్లో బీసీ, ఎంబీసీల ఓట్లు పొందేందుకే రుణాల సర్కారు రుణాలంటూ ఆర్భాటం చేసిందని ఎంబీసీ సంఘం మండిపడింది. ఇచ్చిన హామీ మేరకు అర్హులైన బీసీ, ఎంబీసీలందరికీ వెంటనే రుణాలు అందజేయాలని డిమాండ్ చేసింది". ఈ మేరకు బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భూంపల్లి అశోక్ అధ్యక్షతన ఎంబీసీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఇందులో సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్ సుదర్శన్‌రావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పైళ్ల ఆశయ్య, ఉపాధ్యక్షులు జి నరేష్, రాష్ట్ర నాయకులు చెన్నారం మల్లేషం, మరోజు సునీల్‌కుమార్, కాతోజు రామాచారి, శ్రీహరి, విల్లూరి విమల, విజయ్, సత్యం, వై వెంకటేశ్వర్లు, పార్వతయ్య, వేలాద్రి, ఎల్వీ చెన్నా రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీ మనోహర్, పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ శాసనసభ ముందస్తు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని టీఆర్ఎస్ సర్కార్ రాష్ట్రంలోని బీసీలందరికీ రుణాలు అందజేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సుమారు 5.70 లక్షల మంది బీసీ, ఎంబీసీలు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. కానీ ఇప్పటి వరకు దరఖాస్తు దారులకు రుణాలు ఇవ్వడం లేదని, కేవలం బీసీలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవడానికే రుణాలు ప్రకటించారని విమర్శించారు. గతేడాది కేటాయించిన నిధులు ఖర్చు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. లక్షలాది మంది బీసీ, ఎంబీసీ, సంచార జాతుల వారు రుణాల కోసం ఎదురు చూపులు చూస్తున్నా సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాల కోసం దరఖాస్తుదారులందరికీ 80 శాతం సబ్సిడీతో వెంటనే రుణాలు అందించాలని వారు డిమాండ్ చేశారు.

దాడులు ఆపాలి

అటవీ ప్రాంతంలో వండ్రంగి వృత్తి చేస్తున్న విశ్వకర్మలపై అటవీ శాఖ అధికారుల దాడులను ఆపాలని ఆశయ్య విజ్ఞప్తి చేశారు. ఇటీవల జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్ జిల్లాల్లోని ఫారెస్టు అధికారుల వేధింపులకు విశ్వకర్మ వృత్తిదారుడు ఒకరు గుండె ఆగి మరణించాడని తెలిపారు. అనేక చోట్ల ఇండ్లపై చేస్తున్న దాడులను వెంటనే ఆపాలన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్రిక్తత

భవనాన్ని కూల్చేసేందుకొచ్చిన అధికారులు

- అడ్డుకున్న విద్యార్థినులు
- కళాశాల ఎదుట బైటాయింపు.. ఉద్రిక్తత
- విద్యార్థి సంఘాల నాయకుల బైండోవర్



నవతెలంగాణ-సూర్యాపేట

సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డలో గల మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో వైద్య కళాశాల ఏర్పాటును విద్యార్థినులు ప్రతిఘటించారు. కళాశాలలోని ఒక బ్లాక్‌ను బుధవారం కూల్చేసేందుకొచ్చిన అధికారులను అడ్డుకున్నారు. ఉన్నపళంగా కళాశాల బ్లాక్‌ను కూల్చేస్తే తమ చదువులు ఏం కావాలని నిలదీశారు. పనులను నిలిపివేసి తమ కళాశాలను తమకే కేటాయించాలంటూ కళాశాల ఎదుట ధర్నాకు దిగారు. దీంతో ఆర్డీఓ మోహన్‌రావు, డీఎస్పీ నాగేశ్వరరావు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు, విద్యార్థినులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కళాశాల భవనాన్ని ఖాళీ చేయాలని కలెక్టర్ అమయ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారని అధికారులు చెప్పారు. ఇక్కడ తామిక్కడ చదువుకుంటున్నామనీ, ప్రత్యామ్నాయ చర్యలు చూపకుండా ఎలా ఖాళీ చేయమంటారనీ విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో నెల రోజుల్లో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాల్సి ఉందనీ, ఈ సమయంలో తరగతులను ఖాళీ చేసి వెళ్లిపొమ్మంటే ఎక్కడికి వెళ్తారనీ ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అనంతరం విద్యార్థినులు రోడ్డుపై ఆందోళనకు సిద్ధపడతుండగా పోలీసులు అప్రమత్తమై కళాశాల గేటుకు తాళం వేసి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థినులకు మద్దతుగా వచ్చిన విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కళాశాలలో ఉన్న హాస్టల్ బ్లాక్ రూమ్ భవనంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. అయితే, ఆ రూములు సరిపోవని విద్యార్థినులు అనగా, సరిపడే విధంగా వసతులు కల్పిస్తామని ఆర్డీఓ నచ్చజెప్పారు. అనంతరం విద్యార్థినులు కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ అమయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థి సంఘాల నాయకుల బైండోవర్:

విద్యార్థినులకు మద్దతుగా నిలిచిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఉపేందర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోల బోయిన కిరణ్ కుమార్, లింగన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఎంఎస్ఎఫ్ నాయకులు సైదులు, టీఎస్ఎఫ్ నాయకులు భారీ అశోక్‌ను బైండోవర్ చేశారు.

వైద్య కళాశాల నిర్మాణం ఆపాలి..
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్ వర్మ

పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మించతలపెట్టిన వైద్య కళాశాల నిర్మాణాన్ని విరమించుకోవాలి. విద్యార్థినులకే ఆ కళాశాలను కేటాయించాలి. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తాం. అన్యాయంగా అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నాయకులను తక్షణం విడుదల చేయాలి.

సేంద్రీయ ఆహారంతోనే ఆరోగ్యం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సేంద్రీయ ఆహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. తమ కుటుంబంలో ఏండ్ల నుంచి ఇలాంటి ఆహారాన్నే తీసుకుంటున్నామని చెప్పారు. ఏడో జాతీయ 'ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్' శిల్పారామంలో బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅథితిగా హోంమంత్రి హాజరై ప్రసంగించారు. భూమి కాలుష్యం బారిన పడకుండా ఉండాలంటే ప్రతిఒక్కరు సేంద్రీయం వైపు మొగ్గుచూపాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్గానిక్ ఆహారం ఎంతో అవసరమని చెప్పారు. రసాయన ఆహార పదార్థాలు తీసుకుంటుండటంతో ప్రజల ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్గానిక్ సేద్యాన్ని పెంచే దిశగా కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతులకు మంచి పథకాలు అమలు చేస్తున్నదని అన్నారు. 2018-19లో రైతుల కోసం రూ.12 వేల కోట్లు కేటాయించామని గుర్తుచేశారు. సినీ నటి అక్కినేని అమల మాట్లాడుతూ తమ కుటుంబం కూడా సేంద్రీయ వంటలనే తీసుకుంటున్నదని చెప్పారు. తనకు గతంలో కేంద్రమంత్రి మేనగాగాంధీ సేంద్రీయ ఆహారంపై అవగాహన కల్పించారని, నాటి నుంచి నేటి వరకు అదే పద్ధతిని పాటిస్తున్నానని చెప్పారు.

వ్యవసాయానికి అనువుగా లేని, వర్షపాతం తక్కువగా ఉన్న ప్రాంతాలు మేకల పెంపకానికి అనుకూలం. మేకలు కలుపు మొక్కలను, ముళ్ల పొదలను, పంట కోసిన మొదళ్లను ఆహారంగా తీసుకుంటాయి. వీటి నుండి వచ్చే మాంసం, చర్మం ఎంతో విలువైనవి. అలాగే పంట పొలాలకు, అడవులకు అధిక సత్తువగల ఎరువునిస్తాయి. ఇతర పశువులు, గొర్రెలతో పోలిస్తే వీటి పోషణకు అయ్యే ఖర్చు కూడా తక్కువ. ఇవి త్వరగా వృద్ధిచెంది ఒకే ఈతలో రెండు, మూడు పిల్లల్ని ఇస్తుంది. అంతే కాకుండా ఇవి అధిక రోగనిరోధక శక్తి కలిగి ఉండడం వల్ల ఆరోగ్య సమస్యలు తక్కువ. మన ప్రాంతానికి అనువైన జాతులను ఎంపిక చేసుకుంటే చాలు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని పొందచ్చు. మన రాష్ట్రంలో 64.27లోల మేకలు ఉండి దేశంలోనే ఏడో స్థానంలో ఉన్నాం.

ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ





మేకలలో ముఖ్య జాతులు

జమునాపరి: ఇది మేక జాతుల్లో ఎత్తైనది. ఈ జాతి మేకలు ఉత్తరప్రదేశ్‌లోని మధుర, ఇటావా ప్రాంతంలో దొరుకుతాయి. ఇవి తెల్లగా శరీరంపైన గోధుమ రంగులో చుక్కలు కలిగి ఉంటాయి. గొంతు, ముఖం వద్ద ఎక్కువగా మచ్చలుంటాయి. ముక్కు భాగం ఉబ్బెత్తుగా ఉండి వెంట్రుకలు ఒత్తుగా ఉంటాయి. చెవులు పొడవుగా ఉండి వేలాడుతుంటాయి. మగ, ఆడ రెండింటిలోనూ కొమ్ములుంటాయి. వీటికి చిన్నగా సన్నని తోక ఉంటుంది. ఒకటి నుంచి రెండు లీటర్ల పాలిస్తాయి.

బార్బారి: ఇవి కూడా ఉత్తరప్రదేశ్‌లోని మధుర, ఇటావా, అలీగర్ ప్రాంతాల్లో దొరుకుతాయి. ఈ జాతి ఒకే ఈతలో రెండు, మూడు పిల్లలను ఈనుతుంది. ఇవి చిన్నగా, తెల్లగా ఉండి చర్మంపై లేత గోధుమ రంగుల్లో మచ్చలుంటాయి. చెవులు చిన్నగా ఉండి నిక్కబొడ్చుకొని ఉంటాయి. మేకపోతుల్లో కొమ్ములుంటాయి. ఈ జాతి మేకలు రోజుకు 700మి.లీ నుంచి లీటరు వరకు పాలిస్తాయి.

బీటల్ : ఈ జాతి మేకలు పంజాబ్, హర్యానాలో లభ్యమవుతాయి. ఇవి పెద్దగా ఉండి (జమునాపరి కంటే చిన్నవి) నల్ల రంగులో ఉంటాయి. చెవులు వేలాడుతుంటాయి. ముక్కు భాగం ఉబ్బెత్తుగా ఉంటుంది. తోక సన్నగా చిన్నగా ఉంటుంది. మేకలు, మేకపోతులకు కొమ్ములుంటాయి. పాలు రెండు లీటర్ల వరకు ఇస్తాయి.

ఉస్మానాబాది: ఈ జాతి మేకలు మహారాష్ట్రలోని ఉద్‌గిరి, లాతుర్, ఉస్మానాబాద్ జిల్లాల్లో లభ్యమవుతాయి. శరీరాకారం పెద్దగా ఉండి నల్లరంగులో ఉంటాయి. శరీంపై తెల్ల రంగులో మచ్చలుంటాయి. అరలీటరు నుంచి లీటరున్నర వరకు పాలిస్తాయి.

బ్లాక్ బెంగాల్ : చిన్నగా ఎక్కువగా నల్ల రంగుల్లో ఉంటాయి. అక్కడక్కడ గోధుమ, తెలుపు రంగుల్లో లభ్యమవుతాయి. వీటి చెవులు మొదేలి ఉంటాయి. ఇవి త్వరగా చూడికొస్తాయి. ఎక్కువ పిల్లలను పెడతాయి. మేకల్లో, మేకపోతుల్లోనూ కొమ్ములుంటాయి. వీటి చర్మం చాలా ఖరీదైనది. మాంసానికి ప్రసిద్ధి చెందినది.

మేకల గృహవసతి

ఎత్తైన, నీరు నిల్వని, మురుగు నీరు బయటికి పోయే ప్రదేశాల్లో మేకల కొట్టాలు (పాకలు) నిర్మించాలి. ఎప్పుడూ చల్లగా, పరిశుభ్రంగా తగినంత గాలి ప్రసరించాలి. స్థానికంగాదొరికే కలపగానీ, రాతి స్తంభాలపైన గానీ కొట్టాలు వేయొచ్చు. పై కప్పును ఎండిన కంచగడ్డి,, తుంగ,తాటి కమ్మలతోగానీ వర్షపు నీరు కారకుండా కప్పుకోవాలి. నీరు, దాణా అన్ని మేకలకు అందుబాటులో ఉండే విధంగా తొట్లను నిర్మించుకోవాలి. ఎండ, వాన, చలి వంటి పరిస్థితుల నుండి రక్షణ కలిగించేలా కొట్టాలను నిర్మించాలి. షెడ్ నాలుగువైపుల, వెలుపల చల్లదనం, మేతనిచ్చే చెట్లు పెంచాలి. షెడ్ లోపల నేలపై మొరము లేదా ఎర్రమట్టిని వేసి ప్రతి ఆరు నెలలకొకసారి మారుస్తూ ఉండాలి. ఒక్కొక్క ఆడమేకకు ఒక చదరపు మీటరు, మేకపోతుకు 2 చ.మీ, మేకపిల్లకు 0.5 చ.మీ స్థలం ఉండే విధంగా చూడాలి. శీతాకాలంలో దడి చుట్టూ గోనెసంచులు కప్పినట్లయితే రాత్రివేళల్లో చలిగాలి లోపలికి రాదు.

నాణ్యమైన మేత

మేకలు వృద్ధి చెందాలంటే నాణ్యమైన మేతను అందించాలి. రోజుకు కనీసం 8నుంచి 10 గంటల వరకు బీడు భూములు, పంట కోసిన పొలాలు, అడవుల్లో మేపాలి. వీటితోపాటు పాక చుట్టూ మేకలు తినే చెట్లు పెంచుకోవాలి. మేకలు పచ్చిగడ్డితోపాటు, చెట్ల ఆకులను, పండ్ల తొక్కలను, కూరగాయల ఆకులను ఇష్టపడ్తాయి. కనుక పశుగ్రాసానిచ్చే సుబాబుల్, అవిశ, రావి, తుమ్మ, అల్లనేరేడు, సీమచింత, వేప వంటి ఆకులను సమృద్ధిగా అందించాలి. వీటితోపాటు జొన్న, సజ్జ, మొక్కజొన్న, పప్పుజాతి పశుగ్రాసాలైన అలసంద, హెడ్జిలూసర్న్, స్టైలో వంటివి పెంచాలి. క్యాబేజి, కాలీఫ్లవర్, క్యారెట్ ఆకులను కూడా ఇష్టంగా తింటాయి. పచ్చిమేత ఇచేటప్పుడు సుమారుగా ఒక కిలో చెట్ల ఆకులు, ఒక కిలో కాయజాతి పచ్చిమేతలు, 3కిలోల ఇతర పశుగ్రాసం ఇవ్వాలి.

విత్తనపు మేకపోతులు పోషణ

విత్తన మేకపోతులను వేరే వసతి కల్పించి వాటికి కావాల్సిన ఆహార పోషక పదార్థాలను సమకూర్చాలి. ప్రతి మేకపోతుకు ఒక్కొక్కదానికి 300 గ్రాముల చొప్పున మిశ్రమ దాణా ఇవ్వాలి. మేకలను దాటడానికి ఉపయోగించే రోజుల్లో దాణా రోజుకు 500 గ్రా. చొప్పున ఇవ్వాలి. తగినంత నీటిని అందుబాటులో ఉంచాలి. మేకపోతులకు, పెద్ద మేకలకు ఇచ్చే దాణా మిశ్రమంలో 25భాగాల మొక్కజొన్నలు, 5 భాగాల వేరుశనగ పిండి, 20 భాగాల గోధుమపొట్టు, 20 భాగాల బియ్యం తవుడు, 13భాగాల బియ్యం నూకలు, 14భాగాల జొన్నలు, సజ్జలు, 2 భాగాల లవణ మిశ్రమం,1 భాగం ఉప్పు కలిపి ఇవ్వాలి. స్థానికంగా దొరికే ముడి సరుకులను ఉపయోగించి కావాల్సిన పోషక విలువలు ఉండే విధంగా మిశ్రమాన్ని తయారు చేసుకోవాలి.

మేకల్లో సంపర్కం

మేకలు దాటించే వయసు వచ్చేసరికి కనీసం 25 కిలోలుండాలి. ఆడ మేకలు 6-7 నెలలు దాటిన తర్వాత ఆరోగ్యంగా ఉంటే మొదటి ఎదకొస్తాయి. ఎక్కువగా మార్చి నుండి మే వరకు తిరిగి సెప్టెంబర్, నవంబర్ నెలల్లో ఎదకొస్తాయి. మేకలు ఎదలో 1నుంచి 3 రోజులుంటాయి. మేకలు ప్రతి 21 రోజులకొకసారి ఎదకొస్తాయి. మేకల్లో ఎదను గుర్తించడానికి ఎల్లప్పుడు వెసక్టమీ చేసిన మేకపోతును వదలాలి. ఇది ఎదలో ఉన్న మేకలను గుర్తించడానికి ప్రయత్నిస్తుంది. ఎదలో ఉన్న మేకలను మంచి జాతి లక్షణాలున్న మేకపోతుతో దాటించాలి. మేకల గర్భధారణ కాలం 150 రోజులు. ఒక మేకపోతు సుమారు 25నుంచి 30 ఆడ మేకలను దాటగలుతుంది.

చూడి మేకల పెంపకం: మేకలు చూడి కట్టిన మూడు నెలల తర్వాత కడుపులోని పిల్లల పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో చూడి మేకలకు మంచి దాణా ఇవ్వాలి. 200నుంచి 250 గ్రాముల వరకు మిశ్రమ దాణా అదనంగా ఇవ్వాలి. ఈ విధంగా చేయడం వల్ల ఎక్కువ బరుతో పిల్లలు పుడతాయి. మేక ఆరోగ్యం బాగుండి ఎక్కువ పాలిస్తుంది.పచ్చిమేత కూడా ఎక్కువగా ఇవ్వాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మేక పిల్లలు పుట్టిన వెంటనే ముక్కు రంధ్రాలు, నోటిపైనున్న పొరలను తీసివేయాలి. బొడ్డుకు టింక్చర్ అయోడిన్ పూయాలి. పిల్లను ఉంచే ప్రదేశంలో 10శాతం ఫినాయిల్ చల్లాలి. ఈనిన వెంటనే మేక పొదుగును శుభ్రంగా కడిగిన తర్వాతే పిల్లలకు పాలు తాగించాలి. పిల్లలు పుట్టిన 6 గంటల్లోపు ముర్రుపాలు తాగించాలి. మొదటిమూడు రోజులు తల్లి పాలు తాగిస్తూ రెండు నెలల వయసు వచ్చే వరకు తాగించాలి. ముర్రుపాలు చాలా బలమైనవి. రోజుకు మూడుసార్లు తాగించాలి. మెల్లగా దాణా వైపు మళ్లించాలి. అజీర్తికి గురికాకుండా చూడాలి. మూడు నెలలు దాటిన తర్వాత నట్టల మందులు వేయించాలి. ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలి. పునరుత్పత్తికి ఉపయోగించని మగ మేకపిల్లలకు విత్తుకొట్టాలి. దీని వల్ల మాంసపు నాణ్యత పెరుగుతుంది.



మేకల వ్యాధులు - నివారణ మార్గాలు

ఇతర జంతువులతో పోలిస్తే మేకల్లో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. కనుక రోగాలకు గురయ్యే అవకాశం తక్కువ. మేకల్లో సాధారణంగా ఈ కింది వ్యాధులు వస్తాయి

పారుడు వ్యాధి (సిసిఆర్) ఈ వ్యాధి వైరస్ క్రిముల వల్ల వస్తుంది. విపరీతమైన జ్వరం107ఫారన్‌హీట్ వరకు ఉంటుంది. కండ్లు ఎర్రబడి నీరుగారడం, నోటి నుండి చొంగ రావడం, చిగుళ్ల మీద సన్నని పుండ్లు ఏర్పడడం పల్చని విరేచనాలు కావడం ఈ వ్యాధి లక్షణాలు. వ్యాధి నిరోధక టీకాల ద్వారా ఈ అంటువ్యాధిని అరికట్టవచ్చు.

బొబ్బరోగం లేదా మశూచి: ఈ వ్యాధి డిసెంబంర్, జనవరి, ఏప్రిల్, మే నెలల్లో కనిపిస్తుంది. మేకలు బొబ్బలతోను, ఎక్కువ జ్వరంతో బాధపడుతుంటాయి. ఈ వ్యాధి వైరస్ వల్ల వస్తుంది. ముక్కుల నుండి నీరు కారడం, వేగంగా ఊపిరి పీల్చుతుంటాయి. ఈ వ్యాధి రాకుండా అరికట్టేందుకు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో మేకలకు మశూచి టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన మేకలను వేరుగా ఉంచాలి. పుండ్లపై వేపనూనె పూయాలి.

గాలికుంటు: ఈ వ్యాధి సోకిన మేకల నోటిలో చిగుళ్ల మీద, నాలుక మీద గుల్లలు ఏర్పడి మేతమేయవు. నోటి నుండి చొంగకార్చడం, కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ప్రతి ఆరు నెలలకొకసారి మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడ వల్ల నివారించవచ్చు.

చిటుకు వ్యాధి : మేకలు హఠాత్తుగా చనిపోతాయి. మేకపిల్లలు తన్నుకోవడం, కండరాలు అదరడం, నోటి నుంచి చొంగ కారడం ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి రాకుండా ఉండేందుకు వర్షాకాలం ప్రారంభానికి 3 వారాల ముందుగా 'ఎంట్రో టాక్సీమియా' అనే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

వ్యవసాయం - వాతావరణం

గడిచిన మూడు రోజులలో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 28 నుంచి 32 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 12 నుంచి 21 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతారణం పొడిగా ఉండవచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 34 డిగ్రీల సెల్సీయస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 13 నుంచి 22 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.

వేసవి పెసర, మినుము, నువ్వు పంటలను విత్తుకోవాలి.

వరి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరిలో కాండం తొలుచు పురుగు ఆశించడమైంది. నివారణకు 2గ్రా. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 0.4 మి.లీ క్లోరాంట్రినిల్‌ప్రోల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుతం చలి మంచు వాతావరణం కనుక అగ్గి తెగులు సోకుటకు అనుకూలం. తెగులను గమనించినట్టయితే నివారణకు ఎకరానికి 0.6గ్రా. ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీ ఐసోప్రోథయోలేన్ లేదా 2.5 మి.లీ కాసుగామైసిన్ మందును లీటరు నీటిలో కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో కెండుసార్లు పిచికారి చేయాలి.

మొక్కజొన్న: రబీ మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించినట్టు గమనించడమైంది. నివారణకు విషపు ఎర తయారు చేసుకోవడానికి గాను 10 కిలోల వరి తవుడులో 2 కిలోల బెల్లంను కలిపి 2నుంచి 3 లీ. నీటిని చేర్చి సుమారు 12 గంటల పాటు పులియనిచ్చి మరుసటి రోజు 100గ్రా. థైడికార్బ్‌ను కలుపుకొని ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండలుగా చేసి మొక్క సుడులలో వేసుకోవాలి. ఎమమేక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా థైమేమిథాక్సాన్ 9.5 శాతం, లాను సైహలోత్రిన్ 12 శాతం 0.5 మి.లీ లేదా క్లోరాన్‌ట్రినిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పైరు మొలిచిన 10 నుండి 15 రోజుల మధ్య మొవ్వు పురుగు ఆశించే అవకాశాలున్నాయి. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.0 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైరు 25 నుంచి30 రోజుల దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరానికి 3నుంచి 4 కిలోల చొప్పున మొవ్వులో వేయాలి.

ద్రాక్ష: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ద్రాక్షలో పక్షికన్ను తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 3 గ్రా. ప్రొఫినెట్ మందును లీటరు నీటిలోకలిపి కత్తిరింపుల తరువాత 20 రోజులలోపు పిచికారి చేయాలి. ద్రాక్షలో పెంకు పురుగు గమనించడమైంది. నివా రణకు 2.5 మి.లీ క్లోరిపైరాపాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితులు ద్రాక్షలో తామర పురుగులు ఆశించుటకు అనుకూలం. ఉధృతి గమనించి 2 మి.లీ ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

మామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో తామర, తేనె మంచు పురుగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1 మి.లీ డైక్లోరోవాస్, 2.5 మి.లీ వేపనూనె మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

నల్లి ఉధృతి గమనిస్తే...

నిమ్మ జాతి పంటలు: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు నిమ్మజాతి పంటలో నల్లి ఆశించుటకు అనుకూలం. నివారణకు 3.0మి.లీ ప్రోపర్‌జైట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

మిరప: మిరపలో తామర పురుగు, నల్లి ఉధృతి గమనించినట్టయితే నివారణకు 1.5 గ్రా. డిఫెన్‌థయూరాన్ లేదా 2 మి.లీ క్లోర్‌ఫినాపిర్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మిరపలో గుండు ఈగ ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.5 మి.లీ ట్రైజోఫోస్ లేదా 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఫ్యుజేరియం ఎండు తెగులు సోకే సూచనలున్నాయి. నివారణకు 3 గ్రా. కాపర్‌ఆక్సిక్లోరైడ్ లేదా 1 గ్రా. కర్బెండజిమ్ మందును లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల దగ్గర నేల తడిచే విధంగా పిచికారి చేయాలి. మిరపలో వైరస్ తెగులు ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఈ వైరస్ వ్యాప్తి వాహకాలైన రసం పీల్చే పురుగులను అదుపు చేయాలి.



కూరగాయలు: ప్రస్తుత పొడి వాతావరణ పరస్థితులలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఫిప్రోనిల్ 2మి.లీ లేదా థయోమిథాక్సిమ్ 0.3 గ్రా. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు టమాటలో ఆకుమాడు తెగులు సోకుటకు అనుకూలం. తెగులు నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1మి.లీ ప్రొఫికొనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ఆలస్యంగా నాటిన టమాట పైరులో శనగ పచ్చ పురుగు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.25 మి.లీ నోవాల్యూరాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. టమాటలో తామర పురుగులు కూడా ఆశించేందుకు అనుకూలం. నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

సేకరణ : మోత్కూరు యాదయ్య

గులాబీ పురుగుకు విరుగుడు...

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పత్తి ఏరడం పూర్తయింది. మొదటి రెండుసార్లు ఏరిన పత్తిలో గులాబీరంగు పురుగు నష్టం పెద్దగా లేనప్పటికీ, రైతులు చివరిసారి ఏరిన పత్తిలో అంటే డిసెంబరు నుంచి జనవరి నెలల తీసిన పత్తిలో చాలా చోట్ల గులాబీరంగు పురుగు నష్టం కలిగించింది. పురుగు సోకిన పత్తి రంగు నాణ్యతను కోల్పోవడమే కాకుండా, దూదిలోని గింజలను తినడం వల్ల పత్తి బరువు కూడా బాగా తగ్గిపోయింది. కనుక రైతులకు ఎక్కువ నష్టం వాటిల్లింది. ఈ గులాబీ రంగు పురుగు ఉధృతి లేదా నష్టం ప్రస్తుతం మిగిలి ఉన్న పంట అవశేషాలు (పంట మోళ్లు, జిన్నింగు మిల్లులో పత్తిని జిన్నింగ్ చేయగా వచ్చే పత్తి గింజలు, వ్యర్థాలు మొదలుగునవి) నిల్వ చేసిన పత్తిద్వారా ఎక్కువగా వ్యాప్తి చెందకుండా కొన్ని ముఖ్యమైన నివారణ చర్యలు ప్రస్తుత దశలో తప్పకుండా చేపట్టాలి. తద్వారా గులాబీ పురుగు ఉనికి బాగా తగ్గి వచ్చే పంట ఆరోగ్యంగా ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది.



ప్రస్తుత పత్తి పంటలో ఈ కింది చర్యలు పత్తి సాగు చేసే అన్ని ప్రాంతాల్లో పత్తిని జిన్నింగు చేసే అన్ని మిల్లుల్లో తప్పకుండా చేపట్టాలి. పత్తి పంట కాలాన్ని ఎట్టి పరిస్థితులలో 200 రోజులకు మించి పొడిగించరాదు. నీటి వసతి ఉన్న చోట కూడా జనవరి మొదటి పక్షం కల్లా పత్తి తీత పూర్తి చేసి అనుకూలతను బట్టి స్వల్పకాలిక ఆరుతడి పంటలకు వెళ్లాలి. ముఖ్యంగా పెసర, బొబ్బెర, తెల్ల నువ్వులు అనుకూల పంటలు. పత్తి తీయడం పూర్తయిన వెంటనే పత్తి మోళ్లను పుశువులు, గొర్రెలతో మేపి మోళ్ల ఎండగానే త్వరగా ట్రాక్టర్ ష్రెడ్డర్ లేదా రోటవేటర్ సహాయంతో భూమిలో కలియ దున్నాలి. తద్వారా పత్తి మోళ్లలో మిగిలి ఉన్న పురుగు కోశస్థదశలు నిర్మూలించడమే కాకుండా పత్తి కట్టే భూమిలో మంచి సేంద్రియ ఎరువుగా మారుతుంది. పత్తి మోళ్లను ఏరూపంలోనైనా ఎక్కువ నిల్వ ఉంచకుండా నిర్మూలించడం గులాబీ రంగు పురుగు నివారణకు చాలా ముఖ్యం. పురుగు సోకిన పత్తిని ఎక్కువ కాలం నిల్వ చేయకుండా త్వరగా అమ్మేయాలి. దీంతో నష్టం తగ్గుతుంది. పత్తి మోళ్లను భూమిలో కలియదున్నిన తర్వాత ఎండకాలంలో ఏప్రిల్, మే నెలలో లోతు దుక్కులు చేసినట్టయితే ఇంకా మిగిలిన పురుగు ఆవశేషాలు కూడా నశిస్తాయి.

నీటి వసతి ఉన్న చోట నీరు నిండుగా పెట్టి ఎకండా కాలం దుక్కులు చేసి నట్టయితే భూమిలోపల ఉన్న పురుగు కోశస్థ దశలు సమగ్రంగా నిర్మూలించబడతాయి. పత్తి పంటకు పంటకు మధ్య 4 నుంచి 6 నెలల వరకు భూమిపై ఏమాత్రం పత్తి పంట అవశేషాలు లేకుండా చేయాలి. తద్వారా గులాబీ పురుగు ఉధృతి వచ్చే పంటపై బాగా తగ్గుతుంది. మరీ ముఖ్యంగా జిన్నింగు మిల్లులో పురుగు ఆశించిన పత్తిని జిన్నింగు చేయగా వచ్చిన గింజలను ఇతర వ్యర్థాలను త్వరంగా తొలగించాలి. జిన్నింగు మిల్లుల లోపల, బయట చుట్టు పక్కల పత్తి గింజలను, ఇతర వ్యర్థాలను కుప్పలుగా పోసి నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలి. పత్తి జిన్నింగ్ సమయంలో, జిన్నింగ్ తర్వాత దూది, గింజలు మిల్లులో ఉన్నంత కాలం గులాబీ రంగు పురుగు లింగాకర్షక బుట్టలను మిల్లులోపల, బయట ఎకరానికి 20 చొప్పున పెట్టి, బుట్టలో పడ్డ తల్లిపురుగులను ఎప్పటికప్పుడు వేరు చేసి ఒక గుంతలో వేసి కాల్చాలి. పంట పూర్తయిన వెంటనే పత్తి మోళ్లను భూమిలో కలియదున్నాలి. ఎండాకాలం లోతు దుక్కులు, పంటకు పంటకు మధ్య ఎడం ఎక్కువగా ఉండడం, శుభ్రమైన జిన్నింగు మిల్లు ప్రాంతాలు పత్తిలో గులాబీ పురుగు ఉధృతిని గణనీయంగా తగ్గించడానికి బాగా ఉపకరిస్తాయి.

డా. బి.రాంప్రసాద్, కీటక శాస్త్రవేత్త
ఎ. సుదర్శనం, పత్తి ప్రధాన శాస్త్రవేత్త
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వరంగల్

పాండ్య, రాహుల్‌పై కేసు నమోదు

లూని : టెలివిజన్ షోలో మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్ సహా సినీ దర్శక నిర్మాత, షో వ్యాఖ్యాత కరణ్ జోహర్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. లూని (రాజస్థాన్)కు చెందిన డి.ఆర్ మేఘాల్ ఫిర్యాదు చేయగా, మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేశామని లూని పోలీసు అధికారులు వెల్లడించారు. విపరీత వాగుడుతో బీసీసీఐ నిషేధానికి గురైన పాండ్య, రాహుల్ తాజా కేసుతో కొత్త చిక్కుల్లో పడ్డారు.

పొట్టి పోరులో పెద్ద ఓటమి!

- 80 పరుగులతో కివీస్ గెలుపు
- అన్నింటా న్యూజిలాండ్ ఆధిపత్యం

రోహిత్‌సేన సమష్టి వైఫల్యం


రోహిత్ శర్మ (1)

నెగ్గితే ఏకపక్షం, ఓడితే అత్యంత దారుణం!. న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా ప్రస్థానం సాగుతోన్న తీరిది. పొట్టి సిరీస్‌లోనూ అదే ఒరవడి కొనసాగింది. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన రోహిత్ సేన టీ20ల్లో అత్యంత దారుణ ఓటమి చవిచూసింది. 80 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌కు తొలి టీ20 కోల్పోయింది. పరుగుల పరంగా టీ20ల్లో భారత్‌కు ఇదే భారీ ఓటమి. కివీస్ ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (84) మెరుపు ఇన్నింగ్స్‌తో ఆతిథ్య జట్టు 219 పరుగులు చేయగా, ఛేదనలో భారత్ పూర్తిగా చేతులెత్తేసింది. 139 పరుగులకే కుప్పకూలింది. రెండో టీ20 శుక్రవారం జరుగనున్నది.

వెల్లింగ్టన్

టీ20లో న్యూజిలాండ్ చెలరేగింది. అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం చెలాయించిన ఆతిథ్య జట్టు 80 పరుగుల తేడాతో నెగ్గి, టీ20ల్లో భారత్‌కు భారీ ఓటమి రుచి చూపించింది. పొట్టి ఫార్మాట్‌లో న్యూజిలాండ్ గడ్డపై గెలుపు బోణీ కొట్టని టీమ్ ఇండియా, వెల్లింగ్టన్‌లోనూ నిరాశపరిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లలో 219 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (84, 43 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సులు) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. విలియమ్సన్ (34), కొలిన్ మన్రో (34), రాస్ టేలర్ (23), స్కాట్ (20) రాణించారు. ఛేదనలో భారత్ ఏ దశలోనూ మెరుగ్గా కనిపించలేదు. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన భారత్ 139 పరుగులకే చేతులెత్తేసింది. ఎం.ఎస్ ధోని (39), శిఖర్ ధావన్ (29) ఫర్వాలేదనిపించారు!. మెరుపు ఇన్నింగ్స్ ఆడిన టిమ్ సీఫర్ట్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. వెల్లింగ్టన్ విజయంతో న్యూజిలాండ్ 1-0 ఆధిక్యం సాధించింది.

పస లేని ఛేదన : 220 పరుగుల భారీ ఛేదనలో అవసరమైన రీతిలో ఆడటంలో భారత్ విఫలమైంది. కెప్టెన్ రోహిత్ శర్మ (1) ఆరంభంలోనే అవుటైనా.. శిఖర్ ధావన్ (29, 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులు), విజయ్ శంకర్ (27, 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ధావన్ మూడు సిక్సర్లు కొట్టగా, విజయ్ రెండు సిక్సర్లతో చెలరేగాడు. వీరిద్దరి మెరుపులతో 51/1తో భారత్ పటిష్టంగానే కనిపించింది. కానీ మిడిల్ ఆర్డర్ కుప్పకూలటంతో పరిస్థితి చేయి దాటిపోయింది. రిషబ్ పంత్ (4), దినేశ్ కార్తీక్ (5), హార్దిక్ పాండ్య (5)లు విఫలమయ్యారు. దీంతో 77/6తో భారత్ ఓటమి అంచుల్లో నిలిచింది. ఎం.ఎస్ ధోని (39, 31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), కృనాల్ పాండ్య (20, 18 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఇన్నింగ్స్ ఫర్వాలేదనిపించినా, ఓటమి అంతరాన్ని తగ్గించగలిగారు. భువనేశ్వర్ (1), చాహల్ (1) సులువుగా వికెట్లు పారేసుకున్నారు. దీంతో 19.2 ఓవర్లలో భారత్ ఆలౌటైంది. 80 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. కివీస్ పేసర్ టిమ్ సౌథీ (3/17), ఫెర్గుసన్ (2/22) సహా సోధి (1/26) భారత్‌ను కట్టడి చేశారు.


టిమ్ సీఫర్ట్ (84)

సీఫర్ట్ విధ్వంసం : తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ల మెరుపులతో 8.2 ఓవర్లలో 86 పరుగులు పిండుకున్నది. ఓపెనర్ టిమ్ సిఫర్ట్ (84, 43 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సులు) సిక్సర్ల మోత మోగించాడు. ఎడా పెడా బాదిన సీఫర్ట్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతడికి మన్రో (34, 20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) మంచి సహకారం అందించాడు. 43 బంతుల్లోనే 84 పరుగులు పిండుకున్న సీఫర్ట్ ఇన్నింగ్స్ గమనాన్ని మార్చివేశాడు. తర్వాత వచ్చిన బ్యాట్స్‌మెన్ జోరందుకువటంతో ఎక్కడా ఇన్నింగ్స్ నెమ్మదించలేదు. కెప్టెన్ విలియమ్సన్ (34) మూడు సిక్సర్లతో మెరువగా, రాస్ టేలర్ (23) రెండు సిక్సర్లు కొట్టాడు. చివర్లో స్కాట్ (20) సైతం మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో ధనాదన్ ముగింపునిచ్చాడు. దీంతో న్యూజిలాండ్ 219 పరుగులు చేసింది. భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్, హార్దిక్ పాండ్య బౌలింగ్ గణాంకాలు గల్లంతయ్యాయి. ఈ ముగ్గురి ఎకానమీ 12 దాటపోయింది!. చాహల్ ఒక్కడే మెరుగైన పరుగుల పొదుపు పాటించాడు.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : టిమ్ సీఫర్ట్ (బి) ఖలీల్ అహ్మద్ 84, కొలిన్ మన్రో (సి) విజయ్ (బి) కృనాల్ 34, కేన్ విలియమ్సన్ (సి) హార్దిక్ (బి) చాహల్ 34, డార్లీ మిచెల్ (సి) కార్తీక్ (బి) హార్దిక్ 8, రాస్ టేలర్ (సి) ఖలీల్ (బి) భువనేశ్వర్ 23, గ్రాండ్‌హోమె (సి) (సబ్) సిరాజ్ (బి) హార్దిక్ 3, మిచెల్ శాంట్నర్ నాటౌట్ 7, స్కాట్ నాటౌట్ 20, ఎక్స్‌ట్రాలు : 06, **మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 219.**

వికెట్ల పతనం : 1-86, 2-134, 3-164, 4-164, 5-189, 6-191.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 4-0-47-1, ఖలీల్ అహ్మద్ 4-0-48-1, కృనాల్ పాండ్య 4-0-37-1, హార్దిక్ పాండ్య 4-0-51-2, యుజ్వేంద్ర చాహల్ 4-0-35-1.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) ఫెర్గుసన్ (బి) సౌథీ 1, శిఖర్ ధావన్ (బి) ఫెర్గుసన్ 29, విజయ్ శంకర్ (సి) గ్రాండ్‌హోమె (బి) శాంట్నర్ 27, రిషబ్ పంత్ (బి) శాంట్నర్ 4, ఎం.ఎస్ ధోని (సి) ఫెర్గుసన్ (బి) సౌథీ 39, దినేశ్ కార్తీక్ (సి) సౌథీ (బి) ఇశ్ సోధీ 5, హార్దిక్ పాండ్య (సి) మిచెల్ (బి) సోధి 4, కృనాల్ పాండ్య (సి) సీఫర్ట్ (బి) సౌథీ 20, భువనేశ్వర్ (సి) సీఫర్ట్ (బి) ఫెర్గుసన్ 1, చాహల్ (బి) మిచెల్ 1, ఖలీల్ అహ్మద్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 07, **మొత్తం : (19.2 ఓవర్లలో ఆలౌట్) 139.**

వికెట్ల పతనం : 1-18, 2-51, 3-64, 4-65, 5-72, 6-77, 7-129, 8-132, 9-136, 10-139.

బౌలింగ్ : టిమ్ సౌథీ 4-0-17-3, స్కాట్ 2-0-34-0, ఫెర్గుసన్ 4-0-22-2, శాంట్నర్ 4-0-24-2, డార్లీ మిచెల్ 2.2-0-13-1, ఇశ్ సోధి 3-0-26-2.

టైటిల్ ముంగిట విదర్భ

- సౌరాష్ట్రతో రంజీ ఫైనల్

నాగ్‌పూర్ : ఆసక్తికర మలుపులు తిరుగుతూ రసవత్తరంగా సాగుతున్న రంజీ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ విదర్భ విజయానికి చేరువైంది. సౌరాష్ట్ర బౌలర్ ధర్మేంద్ర సిన్హా జడేజా (6/96) మాయతో రెండో ఇన్నింగ్స్‌లో 200 పరుగులకే కుప్పకూలిన విదర్భ, బంతితో గొప్పగా పుంజుకున్నది. బ్యాట్‌తో ఆదుకున్న టెయిలెండర్ ఆదిత్య సార్వాటె (49) బంతితో నిప్పులు చెరిగాడు. స్టార్ బ్యాట్స్‌మన్ పుజారా (0)ను డకౌట్ చేసిన ఆదిత్య (3/13) సౌరాష్ట్ర ఛేదనను కకావికలం చేశాడు. ఆదిత్యతో పాటు ఉమేశ్ యాదవ్, అక్షయ్ మెరవటంతో సౌరాష్ట్ర 58 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. హార్విక్ దేశాయ్ (8), స్నేల్ పటేల్ (12), ఆర్పిత్ (5), షెల్డన్ జాక్సన్ (7) విఫలమయ్యారు. 206 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌరాష్ట్ర నాల్గో రోజు ఆట ముగిసే సమయానికి 58/5తో కొనసాగుతోంది. కమలేశ్ (1), విశ్వరాజ్ జడేజా (23) అజేయంగా ఆడుతున్నారు. చివరి రోజు అద్భుతం చేస్తే తప్ప విదర్భ విజయం లాంఛనమే!.



మంధాన మెరిసినా..

- తొలి టీ20లో ఓడిన అమ్మాయిలు
- బోణీ కొట్టిన న్యూజిలాండ్

వెల్లింగ్టన్ : చిన్న పొటీలో చిట్టి ఓటమి!. తొలి టీ20లో టీమ్ ఇండియా అమ్మాయిలు 23 పరుగుల తేడాతో ఓటమిపాలయ్యారు. వన్డే సిరీస్ విజయంతో టీ20 సిరీస్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన హర్మన్‌సేనకు వెల్లింగ్టన్‌లో ఓటమే ఎదురైంది. 160 పరుగుల ఛేదనలో భారత్ 136 పరుగులకే కుప్పకూలింది. భీకర ఫామ్‌లో ఉన్న స్మృతీ మంధాన (58, 34 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సులు) మెరుపు అర్ధ సెంచరీతో చెలరేగింది. 24 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన మంధాన భారత్ తరపున వేగవంతమైన ఫిఫ్టీ నమోదు చేసింది. 2018లో ఇంగ్లాండ్‌పై బాదిన 25 బంతుల్లో ఫిఫ్టీ రికార్డును మంధాన మెరుగుపర్చుకున్నది. అరంగేట్ర ఓపెనర్ ప్రియ పూనియా (4) ఓ బౌండరీతో ఖాతా తెరిచినా, ఎంతో సేపు క్రీజులో నిలువలేదు. జెమీమా రొడ్రిగస్ (39, 33 బంతుల్లో 6 ఫోర్లు)తో కలిసి మంధాన రెండో వికెట్‌కు 98 పరుగులు జోడించింది. ఓ ఎండ్‌లో మంధాన విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగగా, మరో ఎండ్‌లో రొడ్రిగస్ సమయోచిత ఇన్నింగ్స్‌తో భారత్ గెలుపు లాంఛనమే అనిపించింది. 102/1తో పటిష్టంగా కనిపించిన టీమ్ ఇండియా మిడిల్ ఆర్డర్ పతనంతో విజయానికి దూరమైంది. ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో వీర విహారం చేసిన మంధాన అర్ధ సెంచరీ తర్వాత వికెట్ కోల్పోయింది. మంధాన అవుటైన తర్వాతి ఓవర్లోనే రొడ్రిగస్ సైతం నిష్క్రమించింది. తర్వాత వచ్చిన హేమలత (3), అనుజా పాటిల్ (0), అరుంధతి రెడ్డి (2), దీప్తి శర్మ (5), తానియా భాటియా (1), రాధ యాదవ్ (3)లు దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్‌కౌర్ (17, 15 బంతుల్లో 1 సిక్సర్) భారీ హిట్టింగ్ సామర్థ్యంపై నమ్మకంతో భారత్ ఆశలు సజీవంగానే ఉన్నాయి. ఖేర్ బంతిని భారీ సిక్సర్‌గా మలిచిన కౌర్, తర్వాతి బంతికే స్టంపౌట్ అవటంతో మ్యాచ్ కివీస్ చేతుల్లోకి వెళ్లిపోయింది. కివీస్ పేసర్ లీ తహుహు (3/20) భారత్‌ను శాసించగా.. కాస్పరెక్, అమేలీలు రెండేసి వికెట్లు తీసుకున్నారు. 11.3 ఓవర్లలో 102 పరుగులు చేసిన 23 పరుగులో ఓటమి పాలవటం ఊహించనిదే!. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ అమ్మాయిలు నిర్ణీత ఓవర్లలో 159 పరుగులు చేశారు. స్టార్ బ్యాట్స్‌మన్ సుజీ బేట్స్ (7) విఫలమైనా ఓపెనర్ సోఫీ డివేన్ (62, 48 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు), కెప్టెన్ ఆమీ (33) రాణించటంతో భారీ స్కోరు సాధించింది. వికెట్ కీపర్ మార్టిన్ (27) సైతం ఆఖర్లో వేగంగా పరుగులు రాబట్టింది. భారత బౌలర్లలో అరుంధతి, రాధ, పూనమ్, దీప్తిలు తలా ఓ వికెట్ పడగొట్టారు. ఛేదనలో భారత్‌ను దెబ్బకొట్టిన కివీస్ బౌలర్ లీ తహుహు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. సిరీస్‌లో రెండో టీ20 శుక్రవారం జరుగనున్నది.



మిథాలికి మళ్లీ అవమానం!

- తుది జట్టులో దక్కని చోటు



వెల్లింగ్టన్ : మహిళల క్రికెట్ దిగ్గజం మిథాలీరాజ్‌కు మరో అవమానం. గత ఏడాది నవంబర్‌లో టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ తుది జట్టు నుంచి మిథాలీరాజ్‌ను తప్పించటం మహిళల క్రికెట్‌లో పెద్ద దుమారానికి కారణమైంది. మిథాలీ నెమ్మదైన స్ట్రయిక్‌రేట్‌తో మిడిల్ ఆర్డర్‌పై ఒత్తిడి పెరుగుతోందని అప్పటి కోచ్ రమేశ్ పొవార్ బీసీసీఐకి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నాడు. తన కెరీర్‌ను నాశనం చేసేందుకు కుట్ర చేస్తున్నారని మిథాలీ లేఖాస్త్రం సంధించటం చర్చనీయాంశమైంది. పాత కోచ్‌పై వేటు, హర్మన్‌ప్రీత్‌తో మైత్రీబంధంతో అది ఇక చరిత్రే అనుకున్నారు. కానీ హర్మన్‌ప్రీత్ కౌర్ మరోసారి మిథాలీరాజ్‌ను తుది జట్టు నుంచి తప్పించింది. ప్రియ పూనియాకు అరంగేట్ర అవకాశం ఇచ్చిన హర్మన్.. దిగ్గజ క్రికెటర్‌ను మరోసారి విస్మరించింది. వన్డేల్లో 200వ మ్యాచ్‌తో మహిళల క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన ఏకైక క్రికెటర్‌గా నిలిచిన మిథాలీకి ఇది ఊహించని భంగపాటు. ఇప్పటికే టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికే యోచనలో ఉన్న మిథాలీరాజ్, తాజా పరిణామాలపై ఏం నిర్ణయం తీసుకుంటుందో ఆసక్తికరం. భారత ఆడిన చివరి రెండు టీ20 మిథాలీ రాజ్ లేకపోవటం, భారత్ రెండింటా ఓటమి పాలవటం గమనార్హం. టీ20 ప్రపంచకప్‌లో రెండు అర్ధ సెంచరీలు చేసిన మిథాలీరాజ్ స్ట్రయిక్ రేట్ 102 మాత్రమేనని, తాజా మ్యాచ్‌లో వేటుకూ హర్మన్‌ప్రీత్ అదే కారణం చెప్పే వీలుందని సమాచారం.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.